ఆదివారం
31-8-2025
హైదరాబాద్ ప్రచురణ
సంపుటి : 09, సంచిక : 370
పేజీలు : 8, వెల: రూ.6.00
Simultaneously published from Hyderabad, Vijayawada, Visakapatnam, Tirupathi, Kurnool, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
అక్షరాక్షరం అభ్యుదయం
VISALAANDHRA Regd No.VJ/042/2021-23

డిసెంబరులో భారత్‌కు పుతిన్

మాస్కో: రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ డిసెంబరులో భారత్‌కు రానున్నారు. ఈ మేరకు క్రెమ్లిన్ ప్రకటించింది. రష్యా చమురు కొనుగోలు నేపథ్యంలో భారత్‌పై అమెరికా అదనపు సుంకాలు విధించిన క్రమంలో పుతిన్ పర్యటనకు ప్రాధాన్యత ఏర్పడిందని అధికారులు తెలిపారు.

చైనాలో సోమవారం జరిగే ప్రాంతీయ శిఖరాగ్ర సమావేశంలో భారత ప్రధాని మోదీతో పుతిన్ భేటీ అవుతారని క్రెమ్లిన్ ప్రతినిధి యూరి ఉషాకోవ్ వెల్లడించారు. పుతిన్ డిసెంబరు పర్యటనకు సన్నాహకంగా ఈ భేటీ ఉంటుందన్నారు. సోవియట్ యూనియన్ కాలం నుంచి భారత్‌తో రష్యాకు స్నేహ సంబంధాలు ఉన్నాయని పేర్కొన్నారు.

మాజీ ఎమ్మెల్యే పింఛనుకు ధన్కర్ దరఖాస్తు

న్యూదిల్లీ: పదవీకాలం పూర్తికాకుండానే ఉపరాష్ట్రపతి పదవికి రాజీనామా చేసిన జగదీప్ ధన్కర్ తాజాగా మాజీ ఎమ్మెల్యే పింఛనుకు దరఖాస్తు చేసుకున్నారు. అందుకు సంబంధించిన ప్రక్రియ మొదలైంది. ధన్కర్ గతంలో రాజస్థాన్ అసెంబ్లీకి ఎన్నికయ్యారు. 1993 అసెంబ్లీ ఎన్నికల్లో అజ్మేర్‌లోని కిషన్‌గఢ్ నుంచి కాంగ్రెస్ తరపున విజయం సాధించారు. ఆ సమయంలో రూల్స్ కమిటీకీ సభ్యుడిగానూ పనిచేశారు. నిబంధనల ప్రకారం రాజస్థాన్ మాజీ ఎమ్మెల్యే రూ.35

- మిగతా 2 లో

పసిడి ధరకు రెక్కలు

ముంబై: దేశంలో బంగారం ధరలకు రెక్కలొచ్చాయి. రికార్డు స్థాయిలో తులం బంగారం ధర లక్షా ఐదువేల రూపాయలకు చేరింది. కొన్ని రోజులుగా పసిడి ధరలు ఊగిసలాడుతున్నాయి. శుక్రవారంతో పోలిస్తే శనివారం రికార్డు స్థాయిలో ఎగబాకింది. మధ్యాహ్నం సమయానికి బంగారం ధరల్లో భారీ మార్పులు చోటు చేసుకున్నాయి. ప్రస్తుతం 24 క్యారెట్ల బంగారం ధర రూ.1640 పెరిగి 1,04,950కు చేరుకుంది. అంటే దాదాపు రూ.లక్షా 5వేల వద్ద నమోదైనట్లే. ఇక 22 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధరపై రూ.1,200 పెరిగి 96,200 రూపాయల వద్ద ఉంది.

రూ.232 కోట్ల మోసం

న్యూదిల్లీ: ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ) సీనియర్ మేనేజర్ రాహుల్ విజయ్‌ను సీబీఐ అదుపులోకి తీసుకుంది. ఆయన రూ.232 కోట్ల మోసానికి పాల్పడినట్లు పేర్కొంది. ఈ మేరకు వచ్చిన ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన క్రమంలో అధికారిని అరెస్టు చేసింది. డెహ్రాడూన్ విమానాశ్రయంలో పనిచేసినప్పుడు విజయ్ అధికారిక, ఎలక్ట్రానిక్ రికార్డుల్లో అవకతవకలు సృష్టించి, ఏఏఐ నిధులను పథకం ప్రకారం దారి మళ్లించినట్లు ఆరోపణలు ఉన్నాయి. 2019-20 నుంచి 2022-23 వరకు డెహ్రాడూన్‌లో పనిచేసిన ఆయన రికార్డులు

- మిగతా 2 లో

ఇదీ లోకం!

వామపక్ష ఐక్యతే ఆయన తపన

పాలకుల విపరీత పోకడల కట్టడికి ఐక్య కార్యాచరణ
రాజ్యాంగ రక్షణకు కలసి నడుద్దాం
సుధాకరరెడ్డి సంస్మరణ సభలో వక్తలు

విశాలాంధ్ర-హైదరాబాద్: కమ్యూనిస్టుల ఐక్యతను, విలీనాన్ని, దేశాభివృద్ధిని తుదిశ్వాస వరకు ఆకాంక్షించిన కమ్యూనిస్టు యోధుడు సురవరం సుధాకరరెడ్డి అని వామపక్ష, రాజకీయ నాయకులు, వివిధ రంగాల ప్రముఖులు, న్యాయకోవిదులు అన్నారు. నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడి, నిబద్ధతతో సమాజాన్ని నిరంతరం అధ్యయనం చేస్తూ... చైతన్యవంతం చేస్తూ నిజాయతీగా, నిస్వార్థంగా, నిరాడంబరంగా, ఆదర్శవంత జీవితం గడిపారని కొనియాడారు. దేశ, రాష్ట్ర రాజకీయాలలో తనదైన ముద్రవేసిన నిష్కలంక వ్యక్తిత్వం గల మానవతావాది, నైతిక విలువలను ఆచరించిన సహనశీలి, సౌమ్యుడు, సంపూర్ణ జీవితాన్ని గడిపిన గొప్ప నాయకుడు సురవరం అన్నారు. ప్రాంతాలు, రాజకీయాలకతీతంగా అభిమానులను కలిగి ఉండడం సుధాకరరెడ్డి వ్యక్తిత్వానికి నిదర్శనమని వక్తలు పేర్కొన్నారు. భారత కమ్యూనిస్టు ఉద్యమంలో సురవరం సుధాకరరెడ్డి పాత్ర చిరస్మరణీయమని వ్యాఖ్యానించారు. సురవరం ఆశయాలు, ఆదర్శాలు, ఉద్యమస్ఫూర్తిని కొనసాగించడమే ఆయనకు నిజమైన నివాళి అన్నారు. సీపీఐ తెలంగాణ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో హైదరాబాద్ రవీంద్రభారతిలో కమ్యూనిస్టు దిగ్గజం సురవరం సుధాకరరెడ్డి సంస్మరణ సభ శనివారం జరిగింది. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్‌ఏ కూనంనేని సాంబశివరావు అధ్యక్షతన జరిగిన సభలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్‌వీ రమణ, హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా, కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ, సీపీఐ(ఎం) పొలిట్ బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు, కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం, మంత్రులు జూపల్లి కృష్ణారావు, తుమ్మల నాగేశ్వరరావు, ఎంపీ ఈటల రాజేందర్, ఎంఎల్‌ఏ మల్‌రెడ్డి రంగారెడ్డి, మందుల సామ్యూల్, మాజీ ఎంపీ కేవీపీ రామచంద్రరావు, టీజేఎస్ అధ్యక్షుడు ప్రొఫెసర్ ఎం.కోదండరామ్, సీపీఐ ఏపీ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, రిటైర్డ్ ప్రొఫెసర్ జీ.హరగోపాల్, ప్రొఫెసర్ కాశీం, వామపక్ష పార్టీల నాయకులు గుమ్మడి నర్సయ్య, ఎం.అశోక్, సీహెచ్ మురహరి, రమేశ్ రాజా, ఎ.జానకిరాములు, ప్రజాకవి గోరటి వెంకన్న, సురవరం సుధాకరరెడ్డి సతీమణి డాక్టర్ బీవీ విజయలక్ష్మి తదితరులు ప్రసంగించారు. తెలంగాణ

- మిగతా 2 లో

సెప్టెంబరులో స్థానిక పోరు

రిజర్వేషన్లపై సీలింగ్ ఎత్తివేతకు ప్రత్యేక జీవో
ఎమ్మెల్సీలుగా కోదండరాం, అజారుద్దీన్
రాష్ట్ర కేబినెట్ కీలక నిర్ణయాలు

విశాలాంధ్ర-హైదరాబాద్: స్థానిక సంస్థల ఎన్నికలపై తెలంగాణ రాష్ట్ర కేబినెట్ కీలక నిర్ణయం తీసుకుంది. అలాగే సుప్రీంకోర్టు ఆదేశాలతో ఖాళీ అయిన రెండు గవర్నర్ ఎమ్మెల్సీ కోటా సీట్లు భర్తీకి ఆమోదం తెలిపింది. రాష్ట్ర శాసనసభ ముగిసిన అనంతరం శాసనసభ కమిటీ హాల్‌లో తెలంగాణ రాష్ట్ర కేబినెట్ సమావేశం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన శనివారం జరిగింది. స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ, ఖాళీ అయిన ఎమ్మెల్సీ స్థానాల భర్తీపై ప్రధానంగా చర్చ జరిగింది. గవర్నర్ కోటలో ఎమ్మెల్సీలుగా మరోసారి ప్రొ.కోదండరాం పేరు ఖరారు చేయగా... గతంలో ఉన్న అమీర్ అలీఖాన్ స్థానంలో భారత క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ మహమ్మద్ అజారుద్దీన్ పేరును సిఫార్సు చేసింది. సుప్రీంకోర్టు తీర్పుతో కేబినెట్ మరోసారి గవర్నర్ కోట ఎమ్మెల్సీల పేర్లను సిఫార్సు చేసింది. కాగా, షెడ్యూల్ ప్రకారమే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని కేబినెట్ నిర్ణయించింది. ఈ మేరకు స్థానిక ఎన్నికలకు గ్రీన్‌సిగ్నల్ ఇస్తూ కేబినెట్ నిర్ణయం తీసుకుంది. సెప్టెంబర్‌లో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని ఎన్నికల కమిషన్‌కు తెలంగాణ ప్రభుత్వం లేఖ రాసింది. అంతేకాకుండా రిజర్వేషన్లలో సీలింగ్ క్యాప్ ఎత్తివేతకు కేబినెట్ ఆమోదం తెలిపింది. స్పెషల్ జీవోతో ఎన్నికలకు వెళ్లాలని నిర్ణయించింది. రిజర్వేషన్ల పరిమితి ఎత్తేస్తూ అసెంబ్లీలో తీర్మానం చేయాలని నిర్ణయం తీసుకుంది. మంత్రివర్గ సమావేశంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అంశంతోపాటు వర్షాలు, వరదలతో నష్టపోయిన రైతులను ఆదుకోవడంపైనా చర్చించారు. పంటలు, రోడ్లు, ఇతర నష్టాలపై కేంద్ర ఆర్థికశాఖ సాయం కోరుతూ తీర్మానం చేశారు. సెప్టెంబర్ 30 లోగా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని హైకోర్టు ఆదేశించిన నేపథ్యంలో ఎన్నికల నిర్వహణకు సంబంధించి నిర్ణయం తీసుకుంది.

సీలింగ్ ఎత్తివేతకు అసెంబ్లీలో తీర్మానం

రిజర్వేషన్ల కోటా పరిమితి ఎత్తివేస్తూ కేబినెట్ కీలక నిర్ణయం తీసుకుంది. ఈ నిర్ణయం ద్వారా 50 శాతం రిజర్వేషన్ సీలింగ్‌ను సడలించడానికి ముందుకు వచ్చింది. 42 శాతం బీసీ రిజర్వేషన్‌ను ప్రత్యేక జీవో ద్వారా అమలు చేయనుంది. అందులో భాగంగా ప్రభుత్వం పంచాయతీ రాజ్ చట్టంలోని సెక్షన్ 285(A)లో సవరణలు చేయాలని నిర్ణయించింది. ఈ సవరణతో బీసీ వర్గాలకు పంచాయతీ రాజ్

- మిగతా 2 లో

అసెంబ్లీ ఆరంభంలోనే రసాభాస

అధికార-ప్రతిపక్ష నేతల మధ్య మాటల యుద్ధం

విశాలాంధ్ర - హైదరాబాద్: శాసనసభ సమావేశాలు శనివారం ఉదయం 10.30గంటలకు ప్రారంభం అయ్యాయి. ఆదిలోనే అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధం ఆరంభమైంది. కాళేశ్వరంపై పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ (పీపీపీ)కి అనుమతి ఇవ్వాలని బీఆర్‌ఎస్ కోరింది. దీనికి అధికార కాంగ్రెస్ పార్టీ సభ్యులు అంగీకరించలేదు. గతంలో తాము కూడా పీపీపీకి అనుమతి అడిగితే బీఆర్‌ఎస్ ప్రభుత్వం అనుమతించలేదని గుర్తు చేశారు. అలాంటపుడు ఇప్పుడు వారికి సభలో పీపీపీకి అనుమతి ఇవ్వమని అడిగే అధికారం లేదన్నారు.

గోపీనాథ్ రాజకీయ ప్రస్థానం టీడీపీతోనే: రేవంత్

సభ ప్రారంభం అయిన వెంటనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇటీవల మరణించిన జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ సంతాప తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే గోపీనాథ్ చురుకుగా ఉండేవారని అన్నారు. 1983లో తెలుగుదేశం పార్టీలో ఆయన తన రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించారని, 1985 నుంచి 1992 వరకు ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రానికి తెలుగు యువత అధ్యక్షుడిగా పని చేశారని చెప్పారు. 1987-88 లో హైదరాబాద్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ డైరెక్టర్‌గా, 1988-93 లో జిల్లా వినియోగదారుల ఫోరం సభ్యుడిగా పనిచేశారని, అలాగే గోపీనాథ్... ఎన్టీఆర్ కు గొప్ప భక్తుడని పేర్కొన్నారు. సినీ రంగంలోనూ నిర్మాతగా రాణించినట్లు చెప్పుకొచ్చారు. 'పాతబస్తీ'(1995), 'రవన్న' (2000), 'భద్రాద్రి రాముడు' (2004), 'నా స్టైలే

- మిగతా 2 లో

'ఉప రాష్ట్రపతి'గా మద్దతివ్వండి

- పార్టీలకు అతీతంగా ఎంపీలకు జస్టిస్ సుదర్శన్ రెడ్డి లేఖలు
- బీజేపీ మద్దతు కోరనున్న ఇండియా అభ్యర్థి
- జార్ఖండ్ సీఎంతో భేటీ

రాంచీ: ఉప రాష్ట్రపతి ఎన్నికలో తనకు మద్దతు ఇవ్వాలని పార్టీలకు అతీతంగా లోక్‌సభ, రాజ్యసభ సభ్యులందరికీ 'ఇండియా' అభ్యర్థి, జస్టిస్ సుదర్శన్ రెడ్డి పిలుపునిచ్చారు. సమర్థుడిగా భావిస్తే ఓటు వేయండి అని కోరుతూ అందరికీ లేఖలు పంపారు. తనకు మద్దతు ఇవ్వాలని బీజేపీ అగ్రనాయకత్వాన్ని కోరుతానని చెప్పారు. భారత్ ఇటీవల కాలంలో చూడనంత హుందాగా, న్యాయంగా ఉప రాష్ట్రపతి ఎన్నిక జరగాలని ఆకాంక్షించారు. జస్టిస్ సుదర్శన్ రెడ్డి శనివారం జార్ఖండ్‌లో పర్యటించారు. రాజధాని రాంచీకి చేరుకున్న ఆయనకు అక్కడి

- మిగతా 2 లో

ఎన్డీయేను తరిమేద్దాం

బీజేపీ, ఆర్ఎస్ఎస్, ఈసీ ఓటు దొంగలు

- దేశవ్యాప్త ఉద్యమంగా ఓటరు అధికార్ యాత్ర
- రాహుల్ గాంధీ ఉద్ఘాటన
- తేజస్వి గెలిస్తేనే బీహార్ అభివృద్ధి: అఖిలేశ్

అరా (బీహార్): దేశంలో ఓట్ల చౌర్యానికి బీజేపీ, ఆర్ఎస్ఎస్, ఎన్నికల సంఘం పాల్పడుతున్నాయని లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ ఆరోపించారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్, ఈసీ ఓట్ల దొంగలని దుయ్యబట్టారు. బీహార్‌లో తలపెట్టిన ఓటరు అధికార్ యాత్ర... ఓట్ల చోరికి వ్యతిరేకంగా దేశవ్యాప్త ఉద్యమంగా మారుతుందని నొక్కిచెప్పారు. సామాజిక న్యాయం కోసం గత ఐదు వేల సంవత్సరాలుగా పోరాటం సాగుతుందని అనుకున్నాం కానీ ఆ పోరాటం 40వేల సంవత్సరాలుగా సాగుతోందని ఇటీవల తెలిసిందంటూ ఆర్ఎస్ఎస్ అధినేత మోహన్ భగవత్ వ్యాఖ్యలను సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్ ఎద్దేవా చేశారు. బీహార్‌లోని అరా జిల్లాలో ఓటరు అధికార్ యాత్ర శనివారం

- మిగతా 2 లో

రైతులకు యూరియా ఇచ్చేదెప్పుడు?

- వ్యవసాయ కమిషనరేట్ వద్ద బీఆర్ఎస్ ధర్నా
- ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల అరెస్ట్... ఉద్రిక్తత
- ప్రభుత్వంపై మండిపడిన కేటీఆర్
- కనీసం 15 రోజులు శాసన సభ నడపాలని డిమాండ్

విశాలాంధ్ర-హైదరాబాద్: రాష్ట్రంలో రైతులు యూరియా కోసం పడిగాపులు కాస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని బీఆర్ఎస్ పార్టీ మండిపడింది. అసలు ఈ ప్రభుత్వానికి రైతుల పట్ల ఏ మేరకు చిత్తశుద్ధి ఉందో ఇక్కడే అర్థం అవుతుందని ధ్వజమెత్తింది. శనివారం శాసన సభ సమావేశం ముగిసిన వెంటనే బీఆర్ఎస్ శాసన సభ్యులు, శాసన మండలి సభ్యులు అసెంబ్లీ నుంచి ప్లకార్డులతో నిరసన ర్యాలీ చేపట్టారు. నేరుగా వ్యవసాయ కమిషనరేట్ వద్దకు చేరుకున్న వారు అక్కడ ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినదించారు. అయితే యూరియా కొరతపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల ధర్నా వ్యవసాయ కమిషనరేట్ దగ్గర ఉద్రిక్తత నెలకొంది. ముందుగా కమిషనరేట్ వ్యవసాయ కమిషనర్‌కు వినతి పత్రం సమర్పించిన అనంతరం ధర్నాకు దిగారు. బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్, హరీశ్ రావు సహా అనేక మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు వ్యవసాయ కమిషనరేట్ బయట బైఠాయించి నిరసన తెలిపారు. ఈ క్రమంలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ గత పదేళ్లలో రాష్ట్రంలో ఎప్పుడూ లేని యూరియా కొరత

- మిగతా 2 లో

కాంగ్రెస్, బీజేపీ దొంగాట

అసెంబ్లీ రెండు రోజులని చెప్పడం దుర్మార్గం
సమస్యలపై చర్చించే సమయం ఇవ్వనందుకే బీఏసీ నుంచి బయటకు
కాళేశ్వరంపై బురద రాజకీయాలకు అధికారపార్టీ సిద్ధం: హరీశ్ ధ్వజం

విశాలాంధ్ర - హైదరాబాద్ : యూరియా కొరత, వరద బీభత్సం, విష జ్వరాలు, గురుకుల పిల్లల మరణాలు సహా ఇతర ప్రజా సమస్యలపై చర్చించేందుకు అసెంబ్లీలో సమయం ఇవ్వకుండా రెండు రోజులే నడుపుతామని ప్రభుత్వం చెప్పడంతో బీఏసీ నుంచి బీఆర్ఎస్ పార్టీ వాకౌట్ చేసింది. అనంతరం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మాజీ మంత్రులు హరీశ్ రావు, వేముల ప్రశాంత్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని కనీసం 15 రోజులపాటు అసెంబ్లీ సమావేశాలు నడపాలని బీఏసీ సమావేశంలో కోరామన్నారు. చాలా గ్రామాల్లో కరెంటు, రోడ్లు లేవు, ప్రాణాలు కోల్పోయి ప్రజలు ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మొదటి ప్రాధాన్యత కింద రాష్ట్రంలో వరదల వల్ల జరిగిన ప్రాణ నష్టం, పంట నష్టంపై అసెంబ్లీలో చర్చించాలని కోరామన్నారు. రెండో ప్రధానమైన సమస్య యూరియా కొరత పై చర్చించాలని విజ్ఞప్తి చేశామన్నారు. కాంగ్రెస్, బీజేపీ దొంగ

- మిగతా 2 లో

ప్రభుత్వ అస్థిరతకు బీఆర్ఎస్, బీజేపీ కుట్ర

జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో కాంగ్రెస్ జెండా ఎగరాలి: మంత్రి తుమ్మల

విశాలాంధ్ర- హైదరాబాద్ : సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని అస్థిర పర్చాలనే బీఆర్ఎస్, బీజేపీ కుట్రలను తిప్పికొట్టాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కాంగ్రెస్ శ్రేణులకు పిలుపునిచ్చారు. షేక్‌పేటలో సీసీ రోడ్, ఓపెన్ జిమ్, ఇందిరాగాంధీ కమ్యూనిటీ

- మిగతా 2 లో

జపాన్‌లో బుల్లెట్ రైలెక్కిన మోదీ

టోక్యో నుంచి సెండాయ్ వరకు ప్రయాణం

టోక్యో: జపాన్ పర్యటనలో భాగంగా భారత ప్రధాని నరేంద్ర మోదీ అక్కడ బుల్లెట్ రైలులో ఆ దేశ ప్రధాని షిగేరు ఇషిబాతో కలిసి ప్రయాణించారు. రాజధాని టోక్యో నుంచి సెండాయ్ వరకు వెళ్లారు. అంతకుముందు ఈస్ట్ జపాన్ రైల్వే కంపెనీలో శిక్షణ పొందుతున్న భారతీయ లోకో పైలట్లతో మోదీ ముచ్చటించారు. కొత్తగా రూపొందించిన ఆల్ఫా-ఎక్స్ రైలును అధినేతలు పరిశీలించారు.

16 మంది గవర్నర్లతో భేటీ

మోదీ 16 మంది జపాన్ గవర్నర్లతో భేటీ అయ్యారు. భారత్-జపాన్ మధ్య స్నేహం, సహకారం మరింతగా పెంపొందించుకోవాలన్నారు. సాంకేతికత, వాణిజ్యం, ఆవిష్కరణలు, పెట్టుబడులు, స్టార్టప్‌లు వంటి రంగాల్లో భాగస్వామ్యం పెంచుకోవడంపై చర్చించారు. తయారీ రంగం, మౌలిక సదుపాయాలు, స్టార్టప్‌లతో బలమైన సహకారాన్ని ఏర్పరుచుకోవాలన్నారు. భారత్‌లో రాష్ట్రాలాభివృద్ధికి తోడ్పాటును కోరారు. 'భారత్-జపాన్ ఆర్థిక వేదిక' సదస్సులో మోదీ పాల్గొన్నారు. మేకిన్ ఇండియా కోసం పారిశ్రామికవేత్తలు భారత్‌కు రావాలని, ప్రపంచం కోసం అక్కడి నుంచి తయారీ చేపట్టాలని వ్యాపారవేత్తలకు పిలుపునిచ్చారు. మోదీ జపాన్‌లో రెండు రోజుల పర్యటనను ముగించుకొని చైనాకు బయల్దేరి వెళ్లారు. సెప్టెంబరు 1న తియాంజిన్ వేదికగా జరిగే షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీఓ) శిఖరాగ్ర సదస్సులో ఆయన పాల్గొంటారు.

కొత్త చట్టం తక్షణమే వెనక్కి

గ్రీస్ కార్మిక సంఘాల డిమాండ్- దేశవ్యాప్తంగా 24 గంటల సమ్మె

ఏథెన్స్: గ్రీస్‌లో ప్రభుత్వ రంగ కార్మికులు దేశ వ్యాప్తంగా సమ్మె నిర్వహించారు. కొత్త చట్టానికి వ్యతిరేకంగా 24 గంటల సమ్మెకు ప్రభుత్వ రంగ సంఘాల యూనియన్ ఇచ్చిన పిలుపు మేరకు పాత పార్లమెంట్ భవన్ నుంచి కొత్త పార్లమెంట్ వరకు భారీ మార్చ్‌లో వేలాది మంది కార్మికులు పాల్గొన్నారు. 'మా పోరు ఆగదు, మధ్యయుగాల పరిస్థితులతో, దోపిడితో రాజీపడబోం' అంటూ నినాదాలిచ్చారు. సమ్మెకు మద్దతుగా థెస్సలోనికి, పట్రాస్, లారిస్సా, క్రీట్ వంటి నగరాల్లో నిరసనలు జరిగాయి. కొత్త చట్టాన్ని ఉపసంహరించుకోవాలన్న డిమాండ్ సర్వత్రా వినిపించింది. విద్య, వైద్య సదుపాయాలను కల్పించాలని కార్మికులు డిమాండ్ చేశారు. ఎయిర్ ట్రాఫిక్ క్రంటోలర్లు సమ్మెకు సిద్ధమవుతుండగా కోర్టు అడ్డుకట్ట వేసింది. చట్ట విరుద్ధమంటూ సమ్మెను రద్దు చేసింది. గ్రీస్ ప్రభుత్వం తెచ్చిన కొత్త చట్టం కార్మిక హక్కులను కాలరాస్తుందని, క్రమశిక్షణ పేరుతో అణిచివేతకు గురిచేస్తుందని కార్మిక నాయకులు ఆగ్రహం వ్యక్తంచేశారు. పని దినాల పెంపు, పనిగంటలు సడలించి వేతనం లేకుండా అదనపు సమయం పని చేయాలనే నిబంధనలను వ్యతిరేకించారు. కార్మిక వ్యతిరేక విధానాలు వద్దని, తక్షణమే ఈ చట్టాన్ని ఉపసంహరించుకోవాలని ముక్తకంఠంతో డిమాండ్ చేశారు.

సుంకాలు చట్టవిరుద్ధం

అమెరికా కోర్టు తీర్పు- సుప్రీంకెళతాం: ట్రంప్

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధించిన సుంకాలు చట్టవిరుద్ధమని అమెరికా ఫెడరల్ కోర్టు తీర్పునిచ్చింది. సుంకాలు విధించేలా విస్తృత అధికారాలు అధ్యక్షుడికి లేవని పేర్కొంది. ఈ తీర్పుపై ట్రంప్ స్పందిస్తూ అత్యంత పక్షపాతంతో కూడుకున్న నిర్ణయమన్నారు. దీనిపై సుప్రీం కోర్టును ఆశ్రయిస్తామని 'ట్రూత్ సోషల్'లో పేర్కొన్నారు. కోర్టు తీర్పు అమెరికాను నాశనం చేస్తుందని వ్యాఖ్యానించారు. అయితే సుప్రీం కోర్టుకు వెళ్లేందుకు ట్రంప్‌కు అవకాశమిచ్చిన ఫెడరల్ కోర్టు...తమ తీర్పు అమలును అక్టోబరు 14వతేదీ వరకు నిలిపివేసింది. దీంతో ట్రంప్ విధించిన సుంకాలు అప్పటివరకు యథావిధిగా అమల్లో ఉంటాయి.

సెప్టెంబరులో స్థానిక పోరు

(మొదటిపేజీ తరువాయి)

ఎన్నికలలో ఎక్కువ అవకాశం కల్పించే వీలుంటుంది. ఈ సవరణ ద్వారా బీసీ వర్గాలకు ప్రాతినిధ్యం పెరడగం, సముచిత స్థానం కల్పించడం, అధిక అవకాశాలకు మద్దతు లభిస్తుంది. రాష్ట్ర ప్రభుత్వం 50 శాతం సీలింగ్‌ను సడలించేందుకు చట్ట సవరణ బిల్లు ప్రవేశపెట్టే నిమిత్తం ప్రణాళికలు సిద్ధం చేసింది. దీనితో, రిజర్వేషన్ల కోటా పరిమితిని నెమ్మదిగా పెంచవచ్చు. ప్రస్తుతం దేశంలో ఉన్న 50 శాతం రిజర్వేషన్ సీలింగ్‌ను తొలగించడం ద్వారా బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు మరిన్ని అవకాశాలు ఉండనున్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నప్పటికీ ఆర్డినెన్స్‌కు ఆమోదం లభించకపోవడంతో జీవో ద్వారా ఈ నిర్ణయాన్ని అమలు చేయాలని రేవంత్ ప్రభుత్వం నిర్ణయించింది. ఈ జీవో ద్వారా కొత్త రిజర్వేషన్ విధానాన్ని త్వరలో అమలు చేయనుంది. ఈ జీవో అమలు చేయడం ద్వారా తెలంగాణలో బీసీ వర్గాలకు విద్య, ఉద్యోగాలు, పంచాయతీ ఎన్నికలలో మరింత ప్రాతినిధ్యం ఉంటుంది.

'ఉప రాష్ట్రపతి'గా మద్దతివ్వండి

(మొదటిపేజీ తరువాయి)

విమానాశ్రయంలో 'ఇండియా' నాయకుల నుంచి ఆత్మీయ స్వాగతం లభించింది. అనంతరం ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్‌తో భేటీ అయ్యారు. తన ఎన్నికకు మద్దతివ్వాలని కోరారు. ఆపై సీఎం నివాసం వద్ద విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ 'ఉప రాష్ట్రపతి ఎన్నిక గెలుపోటములకు పరిమితం కాదు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం జరిగే ఒక పోరాటం' అని సుదర్శన్ రెడ్డి వక్కాణించారు. ఎంపీలంతా తమ మనస్సాక్షి చెప్పేది వింటారని, తనకు మద్దతిస్తారన్నారు. ఉప రాష్ట్రపతిగా సమర్థుడిని అని ఎంపీలంతా భావిస్తే తప్పక ఓటేస్తారని చెప్పారు. సీఎం హేమంత్ సోరెన్‌పై తప్పుడు ఆరోపణలు, వేధింపులను ఖండించారు. ఆయన ప్రతిష్ఠకు భంగం కలిగించారని, ఇలాంటివి ప్రజాస్వామ్యంపై ప్రశ్నలకు తావిస్తాయన్నారు. బీహార్‌లో ఎస్ఐఆర్ ప్రక్రియ, ఎన్నికల సంఘం పారదర్శకతనూ సుదర్శన్ రెడ్డి ప్రశ్నించారు. ఎన్నికల సంఘం నిష్పాక్షిక పాత్ర పోషించాలని నొక్కి చెప్పారు. మెజారిటీ ఉన్నంత మాత్రాన ప్రజలపై చట్టాలను రద్దు లేరన్నారు. పార్లమెంటులో ప్రవేశపెట్టిన రాజ్యాంగానికి 130 సవరణ బిల్లును హడావిడిగా తీసుకొచ్చారని, జేపీసీ పరిశీలనలో ఉన్న ఆ చట్టంపై నివేదిక వచ్చాక చర్చలు జరుగుతాయన్నారు. చేతిలో రాజ్యాంగంతో సమావేశానికి హాజరైన సుదర్శన్ రెడ్డి... జార్ఖండ్ ముఖ్యమంత్రి గౌరవ మర్యాదలను దెబ్బతీసిన రాజ్యాంగబద్ధ విధుల్లో ఉన్న వారు అందుకు బాధ్యత వహించాలన్నారు. అంతకుముందు హేమంత్ సోరెన్ మాట్లాడుతూ ఉప రాష్ట్రపతి ఎన్నిక దేశానికి చాలా ముఖ్యమైనదని చెప్పారు. అధికార-విపక్షాలు ఎవరి వ్యూహాలు వారు అనుసరిస్తున్నారని, 'ఇండియా' అభ్యర్థి బి.సుదర్శన్ రెడ్డి గెలుపు కోసం ఉమ్మడిగా వ్యూహాలు సిద్ధం చేస్తున్నామని హేమంత్ సోరెన్ అన్నారు. ఆయన గెలుపుపై ధీమా వ్యక్తంచేశారు. ఇదిలావుంటే, ఉప రాష్ట్రపతి పదవి కోసం ఎన్డీయే తరపున సీపీ రాధాకృష్ణ పోటీ చేస్తున్నారు. సెప్టెంబరు 9న ఈ ఎన్నిక జరగనున్నది. రాధాకృష్ణ తమిళనాడుకు చెందిన వారు కాగా, సుదర్శన్ రెడ్డి తెలంగాణకు చెందిన వారు. దీంతో సౌత్ వర్సెస్ సౌత్ అంటూ వీరి మధ్య పోటీపై ప్రచారం సాగుతుండటం విదితమే.

పింఛనుకు ధన్కర్ దరఖాస్తు

(మొదటిపేజీ తరువాయి)

వేల పింఛనుకు అర్హులు. అలాగే వయసు ఆధారంగా ఆ మొత్తంలో పెంపు ఉంటుంది. 70 ఏళ్లు దాటిన మాజీ సభ్యుడికి 20 శాతం అదనపు పింఛను అందుతుంది. అదే 80 ఏళ్లు దాటితో 30 శాతంగా ఉంటుంది. ప్రస్తుతం ఈ మాజీ ఉపరాష్ట్రపతి వయసు 74 ఏళ్లు. దాంతో ఆయనకు రూ.42 వేల వరకు పింఛను లభించనుంది. ఈ పింఛను దరఖాస్తు అందిందని రాజస్థాన్ అసెంబ్లీ స్పీకర్ వాసుదేవ్ దేవనాని వెల్లడించారు. దానికి సంబంధించిన ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు. ధన్కర్‌కు సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉంది. లోక్‌సభ సభ్యుడిగా, కేంద్రమంత్రిగా పనిచేశారు. 2003లో బీజేపీలో చేరారు. 2019 నుంచి 2022 మధ్య పశ్చిమ బెంగాల్ గవర్నర్‌గా బాధ్యతలు నిర్వహించారు. 2022 ఆగస్టులో ఉపరాష్ట్రపతిగా నియమితులైన ధన్కర్... రెండేళ్ల పదవీకాలం మిగిలి ఉండగానే అనూహ్యంగా వైదొలిగారు. అనారోగ్య కారణాలతోనే రాజీనామా చేస్తున్నట్లు ఆయన ప్రకటించారు.

రూ.232 కోట్ల మోసం

(మొదటిపేజీ తరువాయి)

మార్చేసి, నకిలీ ఆస్తులను సృష్టించి, కొన్ని ఆస్తుల విలువలను సున్నా చేర్చడం ద్వారా పెంచినట్లు దర్యాప్తులో వెల్లడైందని సీబీఐ తెలిపింది. తనిఖీల నుంచి తప్పించుకునేందుకు 'సున్నా' చేర్చే పద్ధతిని విజయ్ అనుసరించినట్లు పేర్కొంది. అవినీతి సొమ్మునంతా తన వ్యక్తిగత ఖాతాలకు, ఆపై ట్రేడింగ్ అకౌంటర్లకు బదిలీ చేసి... వ్యూహాత్మకంగా ఏఏఐ నిధులను ఆయన పక్కదారి పట్టించినట్లు సీబీఐ వెల్లడించింది.

ఎన్డీయేను తరిమేద్దాం

(మొదటిపేజీ తరువాయి)

సందడిగా సాగింది. ప్రతిపక్ష పార్టీల కార్యకర్తలు, ప్రజలు ఉత్సాహంగా పాల్గొన్నారు. జిల్లా కేంద్రం భోజ్‌పూర్‌లో ర్యాలీని ఉద్దేశించి రాహుల్, అఖిలేశ్ ప్రసంగించారు. ఓటర్ల జాబితాల సవరణ పేరుతో రాజ్యాంగంపై, దేశ ప్రజాస్వామిక వ్యవస్థపై దాడి జరుగుతోందని, మహారాష్ట్రతో పాటు అనేక చోట్ల ఎన్డీయే ఓట్లు దోచుకున్నదన్నారు. ఇకపై బీహార్‌లో ఒక్క ఓటును కూడా బీజేపీ, ఈసీ దోచుకోలేవని రాహుల్ నొక్కిచెప్పారు. దళితులు, మైనారిటీలు, మహిళల ఓట్ల హక్కును హరించి ఎన్నికల్లో గెలవాలనే ఉద్దేశంతోనే మోదీ ప్రభుత్వం ఓట్లు చోరీ చేస్తోందని మండిపడ్డారు. దేశంలో ఎక్కడ కూడా ఓట్ల చోరీ జరగనివ్వమని పునరుద్ఘాటించారు. బీజేపీ నేతలు ఓట్ల దొంగలని, వారి గుట్టును రట్టు చేశామని, అందుకే వారి గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయని రాహుల్ వ్యాఖ్యానించారు. భారత్ డీఎన్ఏ 40వేల సంవత్సరాలుగా మారలేదన్న భగవత్ వ్యాఖ్యలను అఖిలేశ్ దుయ్యబట్టారు. మనం అనుకున్నట్లుగా సామాజిక న్యాయం కోసం పోరాటం గత 5000 ఏళ్లుగా కాదు... 40,000 సంవత్సరాలుగా జరుగుతోందని వ్యాఖ్యానించారు. 'ఇక మన పోరాటాన్ని మరింత ఉధృతం చేయాల్సిందే' అంటూ పిలుపునిచ్చారు. '40వేల సంవత్సరాలుగా దేశంలో సామాజిక అసమానతలు ఉన్నట్లు బీజేపీ-ఆర్ఎస్ఎస్ చెబుతున్నాయి. గత లోక్‌సభ ఎన్నికలప్పుడు అవధ్ (యూపీ)లో బీజేపీ చిత్తు అయింది. ఇప్పుడు మగధ్ (బీహార్) నుంచీ దాన్ని తరిమేందుకు సమయం ఆసన్నమైంది' అని అఖిలేశ్ అన్నారు. తదుపరి అసెంబ్లీ ఎన్నికల్లో తేజస్వీ యాదవ్‌కు మద్దతిస్తామని ప్రకటించారు. ఆయన బీహార్‌లో అధికారాన్ని ఏర్పాటు చేస్తే, రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తారన్నారు. 'బీహార్ యువతకు ఉద్యోగావకాశాలు కల్పిస్తామని తేజస్వీ యాదవ్ హామీనిచ్చారు. తద్వారా వలసలకు తెరపడుతుంది. అసెంబ్లీ ఎన్నికల్లో తేజస్విని గెలవనిస్తే బీజేపీ రాష్ట్రం నుంచి వలస పోవాల్సి వస్తుంది' అని అఖిలేశ్ వ్యాఖ్యానించారు. ఇంట్లో పులి... బయట పిల్లి చందంగా మోదీ ప్రభుత్వ వైఖరి ఉందన్నారు. మోదీ మనల్ని భయపెడతారు కానీ ట్రంప్ (అమెరికా అధ్యక్షుడు) అంటే భయపడతారని, అమెరికా సుంకాలు బీజేపీకి చంపపెట్టు అని ఎస్పీ అధినేత చమత్కరించారు. 'రైతుల ఆదాయం రెట్టింపు చేస్తామన్నారు.

వాస్తవానికి రైతులను నాశనం చేశారు' అంటూ ఆగ్రహం వ్యక్తంచేశారు. బీజేపీ ప్రయోజనాల కోసం ఎన్నికలను ప్రభావితం చేయడంలో ఎన్నికల సంఘం నిమగ్నమై ఉందని ఆరోపించారు. ఓటర్ల జాబితాల్లో నుంచి అర్హులైన ఓటర్ల పేర్లు ఒక్కటి కూడా తొలగించనివ్వమని ఇండియా ఐక్య సంఘటన కార్యకర్తలు సంకల్పించాలని పిలుపునిచ్చారు. ఎన్నికలప్పుడు ఎటువంటి బెదిరింపులకు తలొగ్గరాదని, ఓటర్లు కూడా ఎలాంటి భయం లేకుండా ధైర్యంగా పోలింగ్ కేంద్రాలకు చేరుకొని ఓటు వేసేలా చూడాలని అఖిలేశ్ అన్నారు. యాత్రలో సీపీఐ(ఎంఎల్) ప్రధాన కార్యదర్శి దీపాంకర్ భట్టాచార్య, వికాసశీల్ ఇన్సాన్ పార్టీ (వీఐపీ) నాయకుడు ముకేశ్ సహనీ తదితరులు పాల్గొన్నారు. అరాలో ప్రతిపక్ష నాయకుల యాత్రకు మంచి స్పందన లభించింది.

అసెంబ్లీ ఆరంభంలోనే రసాభాస

(మొదటిపేజీ తరువాయి)

వేరు' (2009) వంటి సినిమాలకు నిర్మాతగా వ్యవహరించారని వెల్లడించారు. గోపినాథ్ తనకు మంచి మిత్రుడని, రాజకీయంగా పార్టీలు వేరైనా... వ్యక్తిగతంగా మంచి మిత్రుడన్నారు. వరుసగా మూడు సార్లు ఎమ్మెల్యేగా ఎన్నికై ఘనత సాధించిన వారిలో ఆయన ఒకరని కొనియాడారు. ఆయన మరణం వారి కుటుంబానికి తీరని లోటని, ఆయన అకాల మరణం ఆ కుటుంబానికి శోకాన్ని మిగిల్చిందన్నారు. చూడటానికి క్లాస్ గా కనిపించినా జూబ్లీహిల్స్ నియోజకవర్గానికి ఆయన మాస్ లీడర్ అన్నారు. మాజీ మంత్రి హరీశ్ రావు మీడియాతో మాట్లాడుతూ అసెంబ్లీలో పీపీపీ ఇస్తామంటే కాంగ్రెస్ నేతలు భయపడుతున్నారని ఆరోపించారు. దానికి అవకాశం ఇవ్వడం లేదంటే... వాస్తవాలను వినడానికి సిద్ధంగా లేరని అర్థం అవుతుందని పేర్కొన్నారు. మంత్రి శ్రీధర్ బాబు మాటలు చూస్తుంటే... ఆయనకు వాస్తవాన్ని అంగీకరించడం ఇష్టం లేదని తెలుస్తోందని చురకలు పెట్టారు. నిజానిజాలు కోర్టులో తెలుస్తాయని స్పష్టం చేశారు.

పీపీపీ సంప్రదాయం సభలో లేదు: భట్టి

హరీశ్ రావు మాటలపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పందించారు. ప్రతిపక్షాలకు అసెంబ్లీలో పీపీపీ ఇచ్చే సంప్రదాయం లేదని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు తమకు అవకాశం ఇవ్వాలని లేఖ కూడా రాసినట్లు గుర్తుచేశారు. అయినా తమకు అవకాశం ఇవ్వలేదని పేర్కొన్నారు. అప్పుడు లేనిది ఇప్పుడు ఎలా ఉంటుందని ప్రశ్నించారు. బీఆర్ఎస్ నేతలు ప్రజలను మభ్యపెట్టడానికి ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం రూ.6,500 కోట్లు వడ్డీ కట్టడంలేదని బీఆర్ఎస్ చేస్తోన్న వాదన సరికాదని అన్నారు. వడ్డీ తాము కట్టకపోతే... బీఆర్ఎస్ నేతలు కడుతున్నారా అని భట్టి నిలదీశారు.

సీఎంను కలిసిన సీఎస్

అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు మర్యాదపూర్వకంగా కలిశారు. తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా రామకృష్ణారావు సర్వీసును ఏడు నెలలు పొడిగిస్తూ ఇటీవల కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

ప్రభుత్వ అస్థిరతకు బీఆర్ఎస్, బీజేపీ కుట్ర

(మొదటిపేజీ తరువాయి)

హాల్‌కు శనివారం కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామితో కలసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ జూబ్లీహిల్స్ ఉపఎన్నిక రాష్ట్ర రాజకీయాల దశదిశ మార్చబోతుందని, బీఆర్ఎస్, బీజేపీ జెండాలు పక్కన పెట్టి రెండు పార్టీలు ఏకమై కాంగ్రెస్‌ను ఓడించాలని పన్నే కుయుక్తులను ఓడించి ప్రజా ప్రభుత్వాన్ని జూబ్లీ హిల్స్ ఓటర్లు ఆశీర్వదించాలని కోరారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలతో ప్రభుత్వం చక్కని పాలన చేస్తుంటే రాజకీయ స్వార్థంతో బీఆర్ఎస్... బీజేపీ ఉప ఎన్నికల బరిలో ప్రలోభాలతో కులాలకుంపట్లు పెట్టి గెలవాలనే కుట్రలను వివేకవంతమైన జూబ్లీహిల్స్ ఓటర్లు తిప్పికొట్టి కాంగ్రెస్‌ను గెలిపించి అభివృద్ధిలో భాగస్వాములు కావాలని, ఈ తీర్పు రాష్ట్ర రాజకీయాల్లో కీలకంగా మారనుందని పేర్కొన్నారు. వర్గ విభేధాలు పక్కన పెట్టి పార్టీ గెలుపునకు కృషి చేయాలని కాంగ్రెస్ శ్రేణులకు పిలుపునిచ్చారు. కష్టపడ్డ వారికి పార్టీలో ప్రాధాన్యత ఉంటుందని వారిలో జోష్ నింపారు.

రైతులకు యూరియా ఇచ్చేదెప్పుడు?

(మొదటిపేజీ తరువాయి)

ఇప్పుడే ఎందుకు వచ్చిందని నిలదీశారు. యూరియా ఏమైనా బ్లాక్ మార్కెట్‌లో అమ్ముతున్నారా అంటూ ప్రశ్నించారు. తెలంగాణలో ఏం జరుగుతుందో తమకు తెలియాలని అన్నారు. పండగపూట కూడా రైతన్నలను రోడ్ల పైన నిలబెట్టిందని ప్రభుత్వాన్ని విమర్శించారు. గణపతి బప్పా మోరియా కావాలయ్యా యూరియా అంటూ నినాదం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం కనీసం 15 రోజుల పాటు అసెంబ్లీ సమావేశాలు నిర్వహించాలని, అంతకు మించి నిర్వహించినా తాము సిద్ధమేనని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఏ అంశాన్ని సభలో పెట్టినా... అన్నింటికీ సరైన సమాధానం ఇస్తామని చెప్పారు. వ్యవసాయ రంగం నుంచి మొదలుకొని ఏ అంశం పైననైనా సభలో చర్చకు పెడితే ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నామని వెల్లడించారు. వ్యవసాయ విస్తీర్ణంతో పాటు వ్యవసాయ సంక్షేమానికి కేసీఆర్ చేసిన కార్యక్రమాలు, పథకాల గురించి వివరిస్తామన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు అయిన కాళేశ్వరం గురించి కూడా సమాధానం చెబుతామని కేటీఆర్ అన్నారు. అసమ్మతి ఎమ్మెల్యేలకు సంబంధించిన అంశంలో స్పీకర్ ఏ నిర్ణయం తీసుకుంటారో చూద్దామని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం శాసన సభను తమకు అనుకూలంగా ఉండేలా నడిపించే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. రైతుల సమస్యల పైన, రాష్ట్రంలో ఉన్న ఎరువుల సంక్షోభం పైన మాట్లాడటం లేదని, 10 సంవత్సరాల పాటు కేసీఆర్ ప్రభుత్వం ఉన్నప్పుడు ఏ రోజూ కూడా ఇలాంటి ఎరువుల కొరత రాలేదని తెలిపారు. రైతులు లైన్లలో నిలబడాల్సిన దుస్థితి రాలేదని కానీ ఎందుకు కాంగ్రెస్ అధికారంలోకి రాగానే చెప్పులను లైన్లో పెట్టడం, ఆధార్ కార్డులను లైన్లో పెట్టే పరిస్థితి వచ్చిందో చెప్పాలన్నారు. పంట నష్టపోయిన రైతుల గురించి కానీ, భారీ వర్షాల వల్ల ఇబ్బందుల గురించి గానీ సుదీర్ఘంగా చర్చించే అవకాశం అసెంబ్లీలో ఇవ్వాలన్నారు. రాష్ట్రంలో ఉన్న వ్యవసాయ సంక్షోభం పైన అసెంబ్లీలో చర్చ పెట్టాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే రాష్ట్రంలో 600కు పైగా రైతులు ఆత్మహత్య చేసుకున్నారని, 75 లక్షల మంది రైతులు ఈరోజు అవస్థల్లో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు కాంగ్రెస్ చేసిన మోసం పైన అసెంబ్లీలో చర్చ జరగాలన్నారు. ఆరు గ్యారెంటీల నుంచి 420 హామీల అమలు వైఫల్యాల దాకా అన్ని అంశాల పైన చర్చిద్దామని, అందుకు కాంగ్రెస్ సిద్ధంగా ఉండాలని తెలిపారు.

విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల వల్ల వారు ఇబ్బందులు పడుతున్నారని, వాటిపై చర్చ జరగాల్సి ఉన్నప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం తమకు అనుకూలంగా ఉండే ఒకటి రెండు అంశాలపై మాత్రమే మాట్లాడే ప్రయత్నం చేస్తోందని మండిపడ్డారు. ప్రజల కష్టాలు, సమస్యల పైన చర్చలకు అసెంబ్లీ వేదిక కావాలని తెలిపారు. కాళేశ్వరంతో పాటు అన్ని అంశాల పైన సమాధానం చెప్పడానికి సిద్ధంగా ఉన్నామని, అది పీసీ ఘోష్ కమిషన్ కాదు, అది కాంగ్రెస్ పార్టీ వేసుకున్న పీసీసీ ఘోష్ కమిషన్ అని ఎద్దేవా చేశారు. దాని పైన కూడా కాంగ్రెస్ పార్టీకి సమాధానం చెప్పడానికి తాము సిద్ధంగా ఉన్నామని కేటీఆర్ అన్నారు.

కాంగ్రెస్, బీజేపీ దొంగాట

(మొదటిపేజీ తరువాయి)

నాటకాలు ఆడి రైతులను ఇబ్బంది పెడుతున్నాయని ధ్వజమెత్తారు. యూరియా కొరతపై చర్చిద్దామని కోరామని తెలిపారు. ఎరువుల కొరత తీర్చేందుకు అసెంబ్లీలో చర్చించాలని కోరామని, గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ సరిగ్గా లేక మలేరియా, డెంగీ వంటి విష జ్వరాలతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, దీనివల్ల వస్తున్న అంటురోగాలపై చర్చించాలని కోరామని వివరించారు. అదేసమయంలో గురుకులాల్లో 100కు పైగా మరణాలు జరిగిన నేపథ్యంలో వాటిపై చర్చించాలని పట్టుబట్టినట్లు తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులు తీవ్ర ఇబ్బంది పడుతున్న నేపథ్యంలో ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై చర్చించాలని కోరామని చెప్పారు. ఫోర్త్ సిటీలో ముఖ్యమంత్రి సోదరులపై ... ఉద్యోగుల పీఆర్సీడీఎల్ఐ, బనకచర్లపై చర్చించాలని కోరినట్లు చెప్పారు. రాష్ట్రంలో ఇన్ని సమస్యలు ఉంటే ప్రభుత్వం కేవలం రెండు రోజులే అసెంబ్లీ నడిపిస్తామని చెబుతుందన్నారు. ప్రజా సమస్యలపై చర్చించకుండా సభ వాయిదా వేసుకుని పారిపోవాలని కాంగ్రెస్ ప్రభుత్వం చూస్తుందన్నారు. వరదలతో ఇబ్బంది పడుతున్న ప్రజల కష్టాల గురించి చర్చిద్దాం అంటే బురద రాజకీయాలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. ప్రజలు పడుతున్న బాధల గురించి మాట్లాడడానికి ముందుకు రాకపోవడంతో బీఏసీ సమావేశం నుంచి వాకౌట్ చేసి బయటకు వచ్చామన్నారు. వరదలపై, యూరియా కొరతపై మాట్లాడటం కంటే ప్రభుత్వానికి ఇంకేమి ప్రాధాన్యత ఉంటుందన్నారు. ప్రభుత్వ ధోరణి చూస్తుంటే కాళేశ్వరం కమిషన్ రిపోర్ట్ పెట్టి బురద రాజకీయాలకు పాల్పడాలని చూస్తున్నట్టు ఉందని విమర్శించారు. ఒక్కరోజు కాదు నాలుగు రోజులైనా సరే కాళేశ్వరం కమిషన్ పై మాట్లాడదాం కానీ ముందు ప్రజలు కష్టాల గురించి చర్చిద్దామని కోరామని వివరించారు. కాళేశ్వరం, బీసీ బిల్లు రెండు రేపే చర్చించి వాయిదా వేసుకుని కాంగ్రెస్ ప్రభుత్వం పారిపోవాలని చూస్తుందన్నారు.

వామపక్ష ఐక్యతే ఆయన తపన

(మొదటిపేజీ తరువాయి)

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.... జాతీయస్థాయిలో పాలకుల విపరీత పోకడలను కట్టడి చేసేందుకు, రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించేందుకు కాంగ్రెస్, కమ్యూనిస్టులు, భావసారూప్యత గల వారమంతా కలిసి కట్టుగా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. 'సమాజంలో ప్రజాస్వామిక మూల సిద్ధాంతానికి విరుద్ధంగా పెరిగిపోతున్న విపరీత పోకడలను అడ్డుకోవలసిన అవసరం ఉంది. ప్రజల ప్రాథమిక హక్కులను హరించే ప్రమాదకర పరిస్థితులు తలెత్తుతున్నాయి. ప్రజలను చైతన్య పరిచే ఆలోచన ఎవరూ చేయడం లేదు. ఈ పరిస్థితులను నిలువరించేందుకు ఐక్యకార్యాచరణ నిర్మించుకోవాలి. అప్పుడే సురవరం లాంటి నేతకు ఘనమైన నివాళి' అని ముఖ్యమంత్రి అన్నారు. దేశంలో అధికారంలో ఉన్న వారు సిద్ధాంతం ముసుగులో అధికారాన్ని పదిలం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారని రేవంత్ విమర్శించారు. ఎన్నికల కమిషన్‌ను కూడా ఇందులో భాగస్వాములను చేసుకుంటున్నారని, అధికారపక్ష వ్యతిరేక ఓట్లను తొలగిస్తున్నారని, ఇది దేశ ప్రజాస్వామ్యానికి అత్యంత ప్రమాదకరమన్నారు. నాలుగు నెలల్లో కోటి ఓట్ల నమోదు సాధ్యమా? ఒకవేళ కోటి మంది పుట్టినా వారికి ఓటు హక్కు రావడం సాధ్యమా అని ప్రజాస్వామ్యవాదులంతా ఆలోచించాలని, బీహార్ ఎన్నికల్లో ఓట్లు తొలగించి గెలవాలని ప్రయత్నిస్తున్నారన్నారు. ప్రజల ఓట్లే కాకుండా రేషన్ కార్డులు, సంక్షేమ పథకాలు పోతాయని, చివరకు ఆస్తులు కూడా కొల్లగొట్టే ప్రమాదముందన్నారు. ఓట్ చోరీకి వ్యతిరేకంగా రాహుల్ గాంధీ పోరాటం చేస్తున్నారన్నారు. ఎన్నికలు వస్తున్నాయంటే ఈడీ, సీబీఐ లాంటి సంస్థలను రంగంలోకి దించుతున్నారన్నారు. రాజ్యాంగాన్ని మార్చాలన్న ఆలోచన చేసే వారి నుంచి ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలని, జాతీయస్థాయి రాజకీయాల్లో సురవరం సుధాకరరెడ్డి లాంటి నేతల అవసరం ఇప్పుడు ఉందన్నారు. సమాజంలో చైతన్యం తీసుకువచ్చేందుకు నిరంతరం శ్రమించిన కమ్యూనిస్టు యోధుడు సురవరం సుధాకరరెడ్డి అని రేవంత్ రెడ్డి అన్నారు. విద్యార్థి రాజకీయాల నుంచి జాతీయ రాజకీయాల వరకు ఎంత ఎత్తుకు ఎదిగినా సురవరం తాను నమ్మిన సిద్ధాంతాన్ని వీడలేదన్నారు. ఏ జెండాను మోయడం గొప్పగా భావించారో... చివరి వరకు ఆ జెండా నీడలోనే ఉండటం చాలా అరుదని, అలాంటి వారిలో సురవరం సుధాకరరెడ్డి ఒకరని అన్నారు. సురవరం సుధాకరరెడ్డికి రాష్ట్రస్థాయిలో మంచి గుర్తింపు, ఆయన నమ్మిన సిద్ధాంతాన్ని గౌరవించే విధంగా రాష్ట్ర మంత్రివర్గంతో చర్చించి మంచి నిర్ణయం తీసుకుంటామని సీఎం పునరుద్ఘాటించారు. సుధాకరరెడ్డి సూచన మేరకు తెలుగు యూనివర్సిటీకి సురవరం ప్రతాపరెడ్డి పేరు పెట్టుకున్నామని గుర్తుచేశారు. నిత్యం ప్రతిపక్షంగా ఉంటూ ప్రజల పక్షాన పోరాడేది కమ్యూనిస్టులేనని, కమ్యూనిస్టులు తలచుకుంటే ప్రభుత్వాలు దిగిపోతాయని తాను బలంగా నమ్ముతున్నానన్నారు.

కమ్యూనిస్టుల ఐక్యతను ఆశిస్తున్నా: జస్టిస్ ఎన్‌వీ రమణ

దేశంలో ప్రజాస్వామ్యం మనుగడ సాగించాలన్నా, పేద ప్రజలకు న్యాయం చేయాలన్నా, ప్రజల కోసం ప్రాణాలు అర్పించిన నాయకులు, కార్యకర్తల ఆశయం నేరవాలన్నా కమ్యూనిస్టు పార్టీలన్నీ ఐక్యమయ్యే రోజులు దగ్గరలోనే ఉన్నాయని ఆశిస్తున్నట్లు జస్టిస్ ఎన్‌వీ రమణ అన్నారు. సురవరం సుధాకరరెడ్డి ఎంపీగా, కార్మికశాఖ స్టాడింగ్ కమిటీ చైర్మన్‌గా తనకు గల విషయ పరిజ్ఞానంతో అద్భుతమైన నివేదికలు ఇవ్వడం ద్వారా వారి సమస్యల పరిష్కారంతో పాటు సంక్షేమం కోసం ఎనలేని కృషి చేశారన్నారు. కమ్యూనిస్టు పార్టీ కార్యకర్త నిజాయతీపరుడని, న్యాయం తరపున నిలబడతాడని, పేదల హక్కుల కోసం పోరాడతాడనే ప్రగాఢ విశ్వాసం ప్రజల్లో ఉందన్నారు. దానిని ప్రజాస్వామ్యవాదిగా తాను కూడా నమ్ముతున్నానని, కమ్యూనిస్టుల ఐక్యత అనేది ఫలప్రదం కావాలని ఆకాంక్షిస్తున్నానన్నారు.

సురవరం జీవితం సామాజిక కార్యకర్తలకు, రాజకీయ పార్టీలకు ఒక సందేశంగా మారాలి :డి.రాజా

రాజ్యాంగ పరిరక్షణ, ప్రజాస్వామ్య విలువల కోసం సురవర నిబద్ధతతో పోరాడారని, ఆయన జీవితం నేటి సామాజిక కార్యకర్తలకు ఆదర్శం కావాలని, దేశంలోని అన్ని రాజకీయ పార్టీలకు ఒక సందేశంగా మారాలని డి.రాజా అన్నారు. దేశం నేడు క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొంటుందని, మితవాదశక్తులు నేరుగా రాజ్యాంగంపై దాడి చేస్తున్నాయని, ఇలాంటి పరిస్థితిలో సుధాకరరెడ్డి మరణం దేశానికే తీరని లోటని చెప్పారు. మితవాద ఫాసిస్టు శక్తులు సాగిస్తున్న దాడులను వ్యతిరేకిస్తూ రాజకీయాలకు అతీతంగా అన్ని సామాజిక. రాజకీయ శక్తులు కలిసి చిత్తశుద్ధి, అంకితభావంతో పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుత పరిస్థితులను ఎదుర్కొవాలంటే కమ్యూనిస్టు ఉద్యమం ఐక్యం కావాలని, ఈ పిలుపు గతంలో సీపీఐ అగ్రనేత చంద్ర రాజేశ్వరరావు కాలం నుంచి ఇవ్వడం జరుగుతుందని గుర్తు చేశారు. కానీ ఇది జరగడం లేదని, అందుకే ఉభయ కమ్యూనిస్టు పార్టీల ఐక్యత విషయంలో సీపీఐ(ఎం) ఒక్కటే కాకుండా అన్ని వామపక్ష పార్టీలు ఆత్మపరిశీలన చేసుకోవాలని రాజా కోరారు. రాజ్యాంగ పరిరక్షణ విషయంలో అన్ని సామాజిక, ప్రజాస్వామ్య పార్టీలు దేశానికి ఒక సందేశం ఇవ్వాలని, మన దేశాన్ని ఎంతగా ప్రేమిస్తామనేది ప్రజలకు తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. అలా చేయకపోతే మనం మన స్వాతంత్రాన్ని కోల్పోవలసి వస్తుందని రాజా హెచ్చరించారు. నేడు ప్రపంచంలో సైనిక యుద్ధాలు, ఆర్థిక యుద్ధాలు, ఇతర ఘర్షణలు జరుగుతున్న నేపథ్యంలో ఫాసిస్టు శక్తులకు వ్యతిరేకంగా ప్రజలను రాజకీయంగా సమీకరించాలన్నారు. సుధాకరరెడ్డి జాపకార్థం తెలంగాణలో తగిన స్మారకాన్ని నిర్మించాలని ముఖ్యమంత్రిని కోరారు. సుధాకరరెడ్డి అంత్యక్రియలను అధికార లాంఛనాలతో జరిపించడం పట్ల కృతజతలు తెలియజేశారు.

గొప్ప ప్రజాస్వామికవాది: బీవీ రాఘవులు

సురవరం సుధాకరరెడ్డి గొప్ప ప్రజాస్వామికవాది అని బీవీ రాఘవులు అన్నారు. రాజకీయ విభేదాలు, ఎత్తుపల్లాలు, ఇబ్బందులు వచ్చినా ఆయన వ్యక్తిత్వం ఎప్పుడూ ఒకేలా ఉండేదన్నారు. పార్టీని నడిపిన తీరు, ప్రజలతో మమేకమైన పద్ధతి, ఉద్యమాలు నిర్వహించడంలో ఆయన చెరగని ముద్ర వేశారని అన్నారు. సురవరం అందరిని ఆకర్షించేవారని, సమస్య మీద రాజీపడకుండా అందరిని కలుపుకుపోయే వ్యక్తిత్వం ఆయనదన్నారు. విశాల ప్రజానీకాన్ని, శక్తులను కలుపుకునిపోవడం ఎంతో అవసరమని, అప్పుడే కమ్యూనిస్టు ఉద్యమం ముందుకుపోతుందన్నారు. దేశంలో ప్రజాస్వామ్యానికి, లౌకికవాదానికి, హేతువాద భావజాలానికి తీవ్ర ప్రమాదం ఏర్పడిందన్నారు. వాటిని రక్షించుకునేందుకు సమరశీల ఉద్యమాలకు సమాయత్తం కావాలని ఆయన పిలుపునిచ్చారు.

కమ్యూనిస్టుల ఐక్యత సురవరం ఆకాంక్ష: తమ్మినేని

కమ్యూనిస్టులు కలవడం, పార్టీలు ఐక్యం కావాలన్న సురవరం సుధాకరరెడ్డి ఆకాంక్ష త్వరలో నెరవేరాలని తమ్మినేని వీరభద్రం అన్నారు. కమ్యూనిస్టులకు ఈ దేశంలో భవిష్యత్తు ఉందా అంటూ విశ్లేషణలు వస్తున్నాయని, అయితే వారంతా తిరగ రాసుకోవాలని, కమ్యూనిస్టులు లేకుంటే ఈ దేశానికి భవిష్యత్తు ఉంటుందా అని ప్రశ్నించారు. బీజేపీకి కాంగ్రెస్ రాజకీయ ప్రత్యర్థి మాత్రమేనని, కానీ సైద్ధాంతిక ప్రత్యర్థి కమ్యూనిస్టులేనని స్పష్టం చేశారు. ఇండియా ఐక్యసంఘటన తరపున ఉప రాష్ట్రపతి అభ్యర్థి జస్టిస్ సుదర్శన్‌రెడ్డి ఇటీవల సైద్ధాంతిక ప్రత్యర్థిగానే బరిలో నిలిచానని ప్రకటించిన విషయాన్ని గుర్తుచేశారు. కమ్యూనిస్టులు ఐక్యత దిశగా ముందుకుసాగాలని కోరారు.

కమ్యూనిస్టుల ఐక్యత అనివార్యం: కోదండరాం

ప్రస్తుత దేశ రాజకీయ పరిస్థితుల్లో కమ్యూనిస్టుల ఐక్యత ఆప్షన్ కాదని, అనివార్యమని ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. ప్రగతిశీల రాజకీయాలకు సురవరం ఓ గుర్తు అని, అలాంటి వ్యక్తి లేకపోవడం రాజకీయాలకు పెద్ద దెబ్బ అన్నారు. రాజకీయాల్లో కమ్యూనిస్టులు ఏమి సాధించారంటూ తరుచు ఓ ప్రశ్న వస్తుంటుందని, అయితే ఓట్లు, సీట్ల లెక్కలు చెప్పడం కష్టమని, కానీ సమాజంలో మౌలిక మార్పులకు పునాది వేశామని చెప్పుకోవడం చాలా గర్వంగా ఉంటుందన్నారు. మాజీ ఎంఎల్ఏ సంపత్ కుమార్ మాట్లాడుతూ సురవరం సలహాలు, సూచనలు, ఆశీర్వాద బలంతోనే తాను ఈస్థాయికి ఎదిగానని గుర్తు చేసుకున్నారు.

నాపై చెరగని ముద్ర: నారాయణ

సురవరం సుధాకరరెడ్డికి మరణం లేదని, ఆయన ఉద్యమాల రూపంలో మనతోనే ఉంటారని కె.నారాయణ అన్నారు. సురవరం భౌతికంగా దూరమైనా ఆయన దేహం కొత్తగా 250 మంది డాక్టర్లను తయారు చేసేందుకు ఉపయోగపడనుందని, ఆ డాక్టర్ల ద్వారా వేల మందికి వైద్య సేవలు అందనున్నాయని చెప్పారు. చిన్న పిల్లాడిని నడిపించినట్లుగా సురవరం రాజకీయంగా తనను వేలు పట్టి ముందుకు నడిపించారని భావోద్వేగానికి గురయ్యారు. తన రాజకీయ ఎదుగుదలలో ఆయనది చెరగని ముద్ర అని నారాయణ పేర్కొన్నారు.

ప్రతి కమ్యూనిస్టు ఆదర్శంగా తీసుకోవాలి: రామకృష్ణ

గొప్ప మనసున్న నాయకుడు సురవరం సుధాకరరెడ్డి అని, ఆయనను ప్రతి కమ్యూనిస్టు ఆదర్శంగా తీసుకోవాలని కె.రామకృష్ణ అన్నారు. సురవరం మాదిరిగా ఉండడం ఏ నాయకుడికీ సాధ్యం కాదని, ఆయన ఎంత సౌమ్యుడో, తాను రాజకీయంగా అనుకున్నది అంతే నిబద్ధతతో చేసితీరేవారన్నారు. అసాధ్యాలను సుసాధ్యం చేయడం ఆయనకు మాత్రమే చెల్లిందన్నారు. సురవరం జ్ఞాపకార్థం ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణా జిల్లాలో పలు కార్యక్రమాలు చేపట్టనున్నట్లు రామకృష్ణ తెలిపారు. సురవరం విద్యాభ్యాసం సాగించిన కర్నూలులో ఆయన స్మారకం ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. కృష్ణా జిల్లాలో సురవరం పేరుతో రాజకీయ శిక్షణ పాఠశాల ఏర్పాటు చేస్తే రూ.కోటి విరాళం ఇచ్చేందుకు ఒక ప్రొఫెసర్ స్వయంగా ముందుకు వచ్చారని చెప్పారు. సెప్టెంబర్ 4న విజయవాడలో సురవరం సంస్మరణ సభ నిర్వహించనున్నామని, ఈ కార్యక్రమానికి ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు హాజరు కానున్నారని తెలిపారు.

టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ సురవరం జీవితం, జీవన విధానం మార్గదర్శకమన్నారు. లౌకికవాద శక్తులు బలపడినప్పుడే దేశం అభివృద్ధి దిశగా ముందుకు సాగుతుందని, ప్రస్తుత పరిస్థితుల్లో కమ్యూనిస్టులు, కాంగ్రెస్ బలపడాల్సిన అవసరముందన్నారు. కేవీపీ రామచంద్రరావు మాట్లాడుతూ సురవరం సుధాకరరెడ్డి అజాత శత్రువని, సహనశీలి అని కొనియాడారు. మాజీ ఎంపీ వినోద్ కుమార్, మాజీమంత్రి వి.శ్రీనివాస్ గౌడ్, మల్‌రెడ్డి రంగారెడ్డి, శామ్యూల్, బండారు దత్తాత్రేయ, గుమ్మడి నర్సయ్య, ఈటల రాజేందర్, ప్రొఫెసర్ హరగోపాల్, గోరటి వెంకన్న, ప్రదీప్, ఎం.అశోక్, మురహరి, రమేశ్ రాజా, జానకిరాములు, ప్రసాదన్న, పాశం యాదగిరి, ప్రొఫెసర్ కాశీం తదితరులు సురవరం సేవలను కొనియాడారు. వేదికపై సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి, పశ్యపద్మ, జాతీయ సమితి సభ్యులు పల్లా వెంకటరెడ్డి, కె.శ్రీనివాస్ సీపీఐ నాయకులు తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు, ఇటి నరసింహా, ఎంఎల్‌సీ నెల్లికంటి సత్యం, కళవేన శంకర్, వీఎస్ బోస్, ఏపూరి సోమన్న, సూర్యం, సురవరం కుటుంబ సభ్యులు ఆశీనులయ్యారు.

బత్తాయి పంట కాపాడేందుకు చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర - నల్గొండ బ్యూరో : నల్గొండ జిల్లాలో బత్తాయి పంటను కాపాడేందుకు రాష్ట్ర ప్రభుత్వానికి సూచనలు చేస్తామని తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి తెలిపారు. శనివారం నల్గొండ కేంద్రంలోని ఉదయాదిత్య భవన్‌లో బత్తాయి రైతులు, ఉద్యాన శాఖ అధికారులు, శాస్త్రవేత్తలతో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. రెండు రోజుల పర్యటనలో భాగంగా నిడమనూరు మండలంలోని బత్తాయి తోటలను సందర్శించి రైతులతో మాట్లాడిన విషయాన్ని కోదండరెడ్డి గుర్తు చేశారు. బత్తాయి మార్కెట్‌ను పరిశీలించామని, అక్కడ రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తెలుసుకున్నామని చెప్పారు. రైతుల సమస్యలు, సూచనలను సమగ్రీకరించి నివేదికను ప్రభుత్వానికి సమర్పిస్తామని, భవిష్యత్తులో పంట కాపాడేందుకు ప్రత్యేక సిఫారసులు చేస్తామని ఆయన స్పష్టం చేశారు. మార్కెట్‌లో మధ్యవర్తుల ఆధిపత్యం, సౌకర్యాల కొరత, నిర్వహణ లోపాలు ప్రధాన సమస్యలుగా ఉన్నాయని కోదండరెడ్డి పేర్కొన్నారు. మార్కెటింగ్ శాఖ సమగ్ర చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ బత్తాయి రైతుల సమస్యలపై నివేదిక తయారు చేసి ప్రభుత్వానికి సమర్పిస్తామని తెలిపారు. రైతుల సూచన మేరకు పాఠశాలలు, హాస్టళ్లకు బత్తాయి పంపిణీ చేసే ప్రతిపాదనను కూడా పరిశీలిస్తామని చెప్పారు. ఉద్యాన పంటల కోసం ప్రత్యేక క్లస్టర్లు ఏర్పాటు చేసి, ఎక్స్టెన్షన్ ఆఫీసర్లను నియమించాల్సిన అవసరం ఉందని ఆమె కమిషన్ దృష్టికి తీసుకువచ్చారు. అదనపు కలెక్టర్లు జె.శ్రీనివాస్, నారాయణ అమిత్, ఉద్యాన శాఖ ఉప సంచాలకులు సుభాషిని, వ్యవసాయ అధికారి శ్రవణ్, మార్కెటింగ్ అధికారి ఛాయాదేవి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన సదస్సు

విశాలాంధ్ర జిల్లా బ్యూరో - మహబూబాబాద్ : జిల్లా కలెక్టరేట్లో సమాచార హక్కు చట్టంపై అవగాహన సదస్సు శనివారం నిర్వహించారు. సందర్భంగా జిల్లా పర్యటనకు విచ్చేసిన రాష్ట్ర సమాచార కమిషన్, కమిషనర్లు బోరెడ్డి అయోధ్య రెడ్డి, పివి శ్రీనివాస రావు, మోహ్సినా పర్వీన్, దేశాల భూపాల్, కలెక్టరేట్ ప్రాంగణంలో మొదట పోలీస్ గౌరవ వందనం స్వీకరించి మొక్కలు నాటారు. అనంతరం జిల్లాలోని పిఐఓస్, ఏపీఐఓస్, సంబంధిత అన్ని విభాగాల అధికారులతో కలెక్టరేట్ ప్రధాన సమావేశ మందిరంలో సమాచార హక్కు చట్టం అమలుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్‌సింగ్, ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్, అదనపు కలెక్టర్లు, స్థానిక సంస్థలు అధనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టోప్పో, రెవెన్యూ ఆఫీసర్ కె. అనిల్ కుమార్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఏజెన్సీ ఉద్యోగుల సేవలు మరువలేనివి

విశాలాంధ్ర- ములుగు జిల్లా బ్యూరో : ఏజెన్సీలో పనిచేసిన ఉద్యోగుల సేవలు మరువలేనివి అని, ఏటూరు నాగారం ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి చిత్ర మిశ్రా అన్నారు. శనివారం ఐటిడిఏ సమావేశ మందిరంలో, ఏటూరు నాగారం ఐటిడిఏ గిరిజన సంక్షేమశాఖలో పనిచేస్తున్న, ఏటూరునాగారం ఏటిడిఓ కోరం క్షేత్రయ్య, సీనియర్ అసిస్టెంట్ కోగిల దుర్గయ్య లకు పదవి విరమణ సన్మాన మహోత్సవ అభినందన సభ ఏర్పాటు చేశారు. పదవి విరమణ పొందిన ఉద్యోగులకు, పిఓ శాలువా కప్పి సన్మానం చేశారు. అనంతరం గిరిజన సంక్షేమ శాఖ హెడ్ మాస్టర్, ఉద్యోగులు, సిబ్బంది, కుటుంబ సభ్యులు బొక్కేలు అందించి,శాలువాలతో సన్మానం చేశారు. ఈ కార్యక్రమంకు ముఖ్య అతిథిగా ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి చిత్ర మిశ్రా హాజరై మాట్లాడుతూ ఉద్యోగులకు పదవి విరమణ సహజం అని, కుటుంబం సభ్యులతో మంచి శేషా జీవితం గడపాలన్నారు. పదవి విరమణ పొందిన ఏటిడిఓ కోరం క్షేత్రయ్య మాట్లాడుతూ వాజేడు మండలంలోని చిక్కుపల్లి ఏజెన్సీ గ్రామంలో జన్మించిన, చిన్న స్థాయి నుండి ఈ స్థాయికి ఎదిగనని, కనీస రోడ్డు మార్గం కూడా అప్పట్లో లేదన్నారు. తాడ్వాయికి చెందిన కోగిల దుర్గయ్య సీనియర్ అసిస్టెంట్, క్షేత్రయ్య ఏటిడిఓ గురించి వివిధ పాఠశాల పిజి హెచ్ యంలు వారితో ఉన్న అనుభూతిని పంచుకొని మాట్లాడారు. ఈ కార్యక్రమానికి సమన్వయకర్తగా పి. వేణుగోపాల్, సభ అధ్యక్షులుగా గంగూ నాయక్ వహించారు. జిసిడిఓ పి. సుగుణ, ఏసియంఓ కోడి రవీందర్, వరంగల్ ఏఓ డి. పర్శరాములు, సమ్మయ్య, చక్రవర్తి, పాయం శ్రీ లత, ఈర్ప రమేష్,బి. రేవతి, నిర్మల వెంకటేశ్వర్లు, ఉమ్మడి వరంగల్ జిల్లాల్లోని హెడ్ మాస్టర్లు, ఏసియంలు, గిరిజన సంక్షేమ శాఖ సిబ్బంది, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

విద్యుత్ ప్రమాదాల పట్ల జాగ్రత్తలు వహించాలి

విశాలాంధ్ర - గూడూరు: గూడూరు మండలంలోని మచ్చర్ల గ్రామంలో పొలం బాట కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డివిజనల్ ఇంజనీర్లు పి. విజయ్, హీరాలాల్‌లు రైతులతో మాట్లాడుతూ విద్యుత్ ప్రమాదాల పట్ల జాగ్రత్తలు వహించాలని కోరారు. వ్యవసాయ పొలాల దగ్గర స్టార్టర్ లకు మరియు మోటార్‌లకు ఎర్తింగ్ చేసుకోవాలని అలాగే ఇంటి దగ్గర కూడా ఎర్తింగ్ చేసుకోవాలని తెలిపారు. దుస్తువులు ఆరవేయడానికి ఐరన్ వైర్ వాడకూడదని అన్నారు. మచ్చర్ల గ్రామంలోనీ రైతులకి ఉన్నటువంటి విద్యుత్ సమస్యలను తెలుసుకొని వాటిని పరిష్కరించేలా ఏఈ కి సూచనలు అందించారు. ఈ వర్షాకాలంలో చెట్లు విరిగి లైన్‌ల మీద పడడం లేదా లైన్ తెగి కింద పడిపోయినప్పుడు వెంటనే రైతులు తమ లైన్మెన్ లేదా ఏఈ కి సమాచారం అందించాలని కోరారు. విద్యుత్ ప్రమాదాల సమయంలో విద్యుత్ టోల్ ఫ్రీ నంబర్ 1912 ఉపయోగించుకోవాలని తెలిపారు. గూడూరు సెక్షన్‌లో పనిచేస్తున్న ఇంజనీర్లకు విద్యుత్ సిబ్బందికి విద్యుత్ అంతరాయం లేకుండా నాణ్యమైన విద్యుత్ అందించేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏడిఈ. కవిత, లక్ష్మణ్ సబ్ ఇంజనీర్ ఇతర విద్యుత్ సిబ్బంది యాకయ్య, విజయ్ పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి

విశాలాంధ్ర - కోదాడ : విద్యార్థులు మొక్కలు నాటడంతో పాటు వాటిని సంరక్షించాలని కోదాడ ట్రాఫిక్ ఎస్ఐ అంజిరెడ్డి అన్నారు. శనివారం శ్రీ స్కూల్ పాఠశాల ఆవరణలో విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు వృక్షాలే ప్రదానం అన్నారు. భవిష్యత్ తరాలకు మంచి వాతావరణం మొక్కల ద్వారానే సాధ్యం అవుతుందన్నారు. కాలుష్య నివారణకు ప్రతి విద్యార్థి కృషి చేయాలన్నారు. విద్యార్థులు తమ ప్రతి పుట్టిన రోజుకు మొక్కలు నాటాలన్నారు. మొక్కలే బహుమతులుగా ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఈఓ చిలక రమేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వరద బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుంది

విశాలాంధ్ర బ్యూరో - మెదక్ : భారీ వర్షాలు వరదల వలన నష్టం వాటిల్లిన ప్రాంతాలలో మెదక్ కలెక్టర్ రాహుల్ రాజ్ బైక్‌పై ప్రయాణించి పరిశీలించారు. బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుందని, ప్రస్తుతం తాత్కాలిక మరమ్మతులపై దృష్టి సారించామని పేర్కొన్నారు. హవేలీ ఘన్పూర్ మండలం బూరుగుపల్లి, వాడి, కప్రాయపల్లి, ధూప్ సింగ్ తండా వద్ద బ్రిడ్జిలు తెగిపోయి పూర్తిగా రాకపోకలు స్తంభించాయి. దీంతో శనివారం వాహనం వెళ్లలేని పరిస్థితిలో యువకులతో కలిసి దెబ్బతిన్న రోడ్లు, పంట పొలాలు, బ్రిడ్జిలను నాలుగు కిలోమీటర్లు బైక్ పై ప్రయాణం చేసి పరిశీలించారు. తాత్కాలిక మరమ్మతులు చేస్తూ రవాణాను పునరుద్ధరిం చాలని, వరద పంట నష్టాలపై అధికారులు అంచనాలు వేస్తున్నారని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. భవిష్యత్తులో ఎలాంటి ప్రకృతి విపత్తులు సంభవించిన ధీటుగా ఎదుర్కొనేందుకు శాశ్వత ప్రాతిపదికన నిర్మాణాలు చేపట్టే విధంగా రాష్ట్ర ప్రభుత్వం పటిష్ట కార్యచరణ ద్వారా చర్యలు తీసుకుంటుందని కలెక్టర్ రాహుల్ రాజ్ చెప్పారు. భారీ వర్షాలు కురవడం వల్ల హవేలీ ఘన్పూర్ మండలంలో పెద్ద ఎత్తున వరద నష్టాలను చవిచూసిందన్నారు. అయిదు కిలోమీటర్ల రోడ్డు పూర్తిగా వరద ప్రవాహ ఉధృతితో ధ్వంసం అయినట్లు వివరించారు. కాప్రాయిపల్లి, రాజుపేట తండాలో భారీ నష్టం వాటిల్లిందని చెప్పారు. ప్రస్తుతానికి సింగిల్ ఫేస్ విద్యుత్ పునరుద్ధరించడం జరిగిందన్నారు. దురదృష్టవశాత్తు ఇద్దరు చనిపోయారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున అన్ని విధాల ఆదుకుంటుందన్నారు. మెదక్ సమీకృత కలెక్టరేట్‌లో వివిధ శాఖల కార్యాలయాలను కలెక్టర్ రాహుల్ రాజ్ ఆకస్మిక తనికీలు నిర్వహించారు. ఎస్.ఐ.సి కార్యాలయ పనితీరుపై అసహనం వ్యక్తం చేశారు. హాజరు పట్టికల పరిశీలించి సమయానికి రాని వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని డిఆర్ఓను ఆదేశించారు. ఔట్ వార్డు, ఇన్ వార్డు సెక్షన్, ఖజానా కార్యాలయం, ఎస్.ఐ.సి కార్యాలయలు తనిఖీ చేసి హాజరు పట్టిక పరిశీలించి 11:30 అవుతున్న కొంతమంది సిబ్బంది విధులకు రాలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎస్.ఐసి కార్యాలయం ఉద్యోగి సమాచారం ఇవ్వకుండా సెలవుపై వెళ్ళటంపై అసహనం వ్యక్తం చేశారు.

గణేష్ నిమజ్జనం కోసం అవసరమైన ఏర్పాటను ఏర్పాట్లు చేపట్టాలని కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులను ఆదేశించారు. ఎస్పీ డి.వి. శ్రీనివాస్ రావుతో కలిసి వినాయక నిమజ్జనం నిర్వహించే మెదక్ మండలం కోంటూరు చెరువును సందర్శించారు. నిమజ్జనం పాయింట్ల వద్ద రక్షణ కంచెలు, లైటింగ్, క్రేన్లు ఏర్పాటు చేయాలని, ప్రతి ఘాట్ వద్ద పోలీస్, మున్సిపల్ సిబ్బంది, గజఈతగాల్లతో పాటు వలంటీర్లను ఏర్పాటు చేయాలన్నారు. తహసిల్దార్ లక్ష్మణ్ బాబు, కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, మెదక్ డిఎస్పి ప్రసన్న కుమార్, సిఐ రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

పోక్సో చట్టంపై విస్తృతంగా అవగాహన కల్పించాలి

విశాలాంధ్ర - వనపర్తి : చిన్నపిల్లల రక్షణ భవిష్యత్తు కోసం ఏర్పాటుచేసిన పోక్సో చట్టంపై విస్తృతంగా అవగాహన కల్పించాలని తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి హెచ్.ఎస్.జే అనిల్ కుమార్ జూకంటి అన్నారు. శనివారం వనపర్తి జిల్లాకు విచ్చేసిన తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి హెచ్.ఎస్.జే అనిల్ కుమార్ జూకంటికి వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి స్థానిక ఆర్ అండ్ బి అతిథి గృహంలో సాదరంగా ఆహ్వానం పలికారు. కలెక్టర్‌తో న్యాయమూర్తి మాట్లాడుతూ చిన్నపిల్లల రక్షణ భవిష్యత్తు కోసం ఏర్పాటుచేసిన పోక్సో చట్టంపై విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం జిల్లా కలెక్టర్, జిల్లా జడ్జితో కలిసి నాగవరం శివారులో సర్వే నెంబర్ 200లో నూతన కోర్టు భవన నిర్మాణానికి ప్రభుత్వం ద్వారా కేటాయించిన 20 ఎకరాల స్థలాన్ని పరిశీలించారు. ప్రతిపాదిత ఆత్మకూరు - పెబ్బేరు బైపాస్ రోడ్డును పరిశీలించిన హైకోర్టు న్యాయమూర్తి బైపాస్ రోడ్డు అలైన్‌మెంట్‌ను కొంత మార్చాల్సిందిగా జిల్లా కలెక్టర్ ను సూచించారు. వనపర్తి జిల్లా జడ్జి యం.ఆర్. సునీత, అదనపు కలెక్టర్ రెవెన్యూ ఎన్. ఖీమ్యా నాయక్, సీనియర్ సివిల్ జడ్జిలు కళార్చన, రజనీ, అశ్విని, హైకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జగన్, జిల్లా కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కిరణ్ కుమార్, ఆర్డీఓ సుబ్రమణ్యం, రోడ్లు భవనాల ఇంజనీరు దేశ్యా నాయక్ తదితరులు ఉన్నారు.

విద్యుత్ ప్రమాదాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

విశాలాంధ్ర - కే సముద్రం: విద్యుత్ ప్రమాదాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కేసముద్రం అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీరింగ్ మచ్చ ఐలయ్య అన్నారు. శనివార ఇనుగుర్తి మండలంలోని అయ్యగారిపల్లి గ్రామంలో పొలం బాట కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన రైతులతో మాట్లాడుతూ విద్యుత్ ప్రమాదాల పట్ల జాగ్రత్తలు వహించాలని కోరారు. వ్యవసాయ పొలాల దగ్గర స్టార్టర్‌లకు, మోటార్ లకు ఎర్తింగ్ చేసుకోవాలని, అలాగే ఇంటి దగ్గర కూడా ఎర్తింగ్ చేసుకోవాలని తెలిపారు. దుస్తువులు ఆరవేయడానికి ఐరన్ వైర్ వాడకూడదని చెప్పారు. అయ్యగారిపల్లి గ్రామంలోనీ రైతులకి ఉన్నటువంటి విద్యుత్ సమస్యలను తెలుసుకొని వాటిని పరిష్కరించేలా ఏఈ కి సూచనలు అందించారు. ఈ వర్షాకాలంలో చెట్లు విరిగి లైన్‌ల మీద పడడం లేదా లైన్ తెగి కింద పడిపోయినప్పుడు వెంటనే రైతులు తమ లైన్మెన్ లేదా ఏఈ కి సమాచారం అందించాలని కోరారు.విద్యుత్ ప్రమాదాల సమయంలో విద్యుత్ టోల్ ఫ్రీ నంబర్ 1912 ఉపయోగించుకోవాలని తెలిపారు. బి.శ్రీను లైన్ ఇన్స్పెక్టర్, ఎల్ఎం యశ్వంత్, ఇతర విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

వరద ప్రాంతాల్లో కలెక్టర్ పర్యటన

విశాలాంధ్ర బ్యూరో - నిర్మల్ జిల్లా : జిల్లాలో భారీ వర్షాలు కురిసిన నేపథ్యంలో ఏర్పడిన వరద నష్టాలపై జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ శనివారం సోన్ మండలంలో పర్యటించారు. ఇటీవల వర్షాల కారణంగా ప్రభావితమైన ప్రదేశాలను పరిశీలించిన కలెక్టర్, ప్రజలు, రైతులు ఎటువంటి ఆందోళన చెందవద్దని సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భారీ వర్షాల వలన జరిగిన నష్టాలను అధికారులు ఇప్పటికే నష్ట నివారణ ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారని తెలిపారు. పంట నష్టం ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపి సహాయం అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. శ్రీరామ్ సాగర్ ప్రాజెక్టు గేట్లు ఎత్తి వరద నీటిని దిగువకు వదులుతున్నారని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. పశుకాపరులు, చేపలు పట్టేవారు జాగ్రత్తగా ఉండాలని, ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా కలెక్టరేట్ కంట్రోల్ రూమ్ నంబరు 9100577132ను సంప్రదించాలని కలెక్టర్ సూచించారు. ఈ సందర్శనలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, తహసిల్దార్ మల్లేష్, రెవెన్యూ, వ్యవసాయ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో వేగం పెంచాలి

విశాలాంధ్ర-ములుగు జిల్లా బ్యూరో: ప్రభుత్వం నిర్దేశించిన నియమాల ప్రకారమే లబ్ధిదారులు ఇందిరమ్మ ఇండ్లు నిర్మించుకోవాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. తెలిపారు. శనివారం వెంకట పూర్ మండలంలోని లక్ష్మీ దేవి పేట గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పనులను జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్లను ప్రభుత్వం నిర్దేశించిన నియమాల ప్రకారమే నిర్మించుకుంటేనే 5 లక్షల రూపాయల ఆర్థిక సహాయంకు అర్హులు అవుతారని తెలిపారు. గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లు మంజూరి అయి నిర్మాణ పనులు ప్రారంభించనీ లబ్ధిదారులతో కలెక్టర్ మాట్లాడుతూ వెంటనే నిర్మాణం ప్రారంభించాలనీ సూచించారు. లబ్ధిదారులు వెంటనే నిర్మాణ పనులు చేపట్టి పూర్తి చేసేలా సంబంధిత అధికారులు సమన్వయంతో ప్రోత్సహించాలని అన్నారు. ఇందిరమ్మ ఇండ్ల పథకంలో నిర్మాణపు పనులు పూర్తి చేయడంలో జిల్లాను అగ్రగామిగా ఉంచాలని కోరారు. ఇందిరమ్మ ఇంటిని ఎంత త్వరగా పూర్తి చేస్తే అంతే త్వరగా బిల్లులు కూడా అందిస్తామని లబ్ధిదారులకు తెలియజేయాలన్నారు. ల అనంతరం అడవి రంగ పూర్ ఎర్రకుంట చెరువు మత్తడి క్రింద నున్న రోడ్డు కాజువే భారీ వర్షాల కారణంగా వరద ప్రవాహానికి తెగిపోయినందున తాత్కాలిక మరమ్మతు లను కలెక్టర్ ఇంజనీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఇరిగేషన్ ఈ ఈ నారాయణ, డి ఈ రవీందర్ రెడ్డి, ఎంపి డి ఓ రాజు, పంచాయితి కార్యదర్శులు, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయం

విశాలాంధ్ర - తొర్రూరు: తొర్రూరు లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయమని డిస్టిక్ చీఫ్ సెక్రటరీ లయన్ మార్గం ప్రభాకర్ అన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ తొర్రూరు క్లబ్ అధ్యక్షులు లయన్ డాక్టర్ సూర్నం రామ నర్సయ్య ఆధ్వర్యంలో హన్మకొండలోని భీమారంలో ఉన్న లార్డ్స్ వృద్ధాశ్రమలొ గల 40 మంది వృద్ధులకు ఒక రోజు భోజనం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ తొర్రూరు లయన్స్ క్లబ్ నిర్వాహకులు అవసరార్థులు ఎక్కడ ఉన్న అక్కడికి వచ్చి సేవ చేయడం అభినందనీయమని తెలిపారు. లైన్స్ క్లబ్ చేపట్టే సామాజిక సేవా కార్యక్రమాలకు చేతనందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాకతీయ రీజియన్ 3 ఆర్సి దుస్స శివ శంకర్, తొర్రూరు లయన్స్ క్లబ్ కార్యదర్శి ముదుపు రవీందర్ రెడ్డి, క్లబ్ కోశాధికారి వజినపల్లి శ్రీనివాస్, జాయింట్ సెక్రటరీ బోనగిరి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

యూరియా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర ప్రతినిధి-పెద్దపల్లి, సింగరేణి: రామగుండం ప్రాంతం పరిధిలోని రైతులందరికీ అవసరమైన మేర యూరియా అందుబాటులో ఉండేలా పటిష్ట కార్యాచరణ అమలు చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అధికారులను ఆదేశించారు. శనివారం రామగుండం మున్సిపల్ కార్యాలయంలో యూరియా లభ్యత, పంపిణీపై ఆయన రామగుండం, అంతర్గాం, పాలకుర్తి మండలాల వ్యవసాయ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రామగుండం ప్రాంతంలో గత సంవత్సరం కంటే ప్రస్తుతం అధికంగా యూరియా సరఫరా చేసినప్పటికీ రైతుల వద్ద కొరత ఉండటానికి గల కారణాలు పరిశీలించాలని కలెక్టర్ తెలిపారు. జిల్లాలోని పెద్ద రైతులు యూరియాకు ప్రత్యామ్నాయంగా నానో యూరియా వాడాలని సూచించారు. రైతుల అవసరాల మేరకు యూరియా అందుబాటులో ఉందని, రాష్ట్ర ప్రభుత్వంతో సంప్రదిస్తూ జిల్లాకు అవసరమైన యూరియాను ఎప్పటికప్పుడు స్టాక్ తెప్పిస్తున్నామని, రైతులు ఎవరు అనవసర ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అన్నారు. ఈ సమావేశంలో మండలాల వ్యవసాయ అధికారులు బండి ప్రమోద్ కుమార్, కల్వల సతీష్, కొప్పుల ప్రకాష్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఆయన అదనపు కలెక్టర్ అరుణశ్రీతో కలిసి రామగుండం నగర పారిశుధ్యం పై వివిధ ప్రాంతాలను పరిశీలించి మున్సిపల్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి పారిశుధ్యం పై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు.

హమాలీ కార్మికుల ఐక్యతే సంక్షేమ బోర్డుకు పునాది

విశాలాంధ్ర బ్యూరో -పెద్దపల్లి: హమాలి సంక్షేమ బోర్డు ఏర్పాటుకై కార్మికులు సంఘటితం కావాలని, కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫె స్టోలో హమాలీలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని తెలంగాణ హమాలీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు గుంటి సామ్రాజ్యం, అన్నడి వెంకట్ రెడ్డిలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని రైల్వే గుడ్ షెడ్ హమాలీల కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు జంగా సంపత్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్య అతిథులుగా హాజరైన రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు మాట్లాడుతూ కార్మిక క్షేత్రమైన పెద్దపల్లి జిల్లాలో వేల సంఖ్యలో హమాలీ కార్మికులు పనిచేస్తున్నారని కార్మికులకు భద్రత, భరోసా, కనీస సౌకర్యాలు కల్పించడంలో గత ప్రభుత్వాలు విఫలమయరని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడానికి ముందు హమాలీ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామని, హమాలీలకు గుర్తింపు కార్డులు ఇచ్చి భద్రత - భరోసా కల్పిస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఏ రాజకీయ పార్టీలకు సంబంధం లేకుండా హమాలీల పక్షాన తెలంగాణ హమాలీ వర్కర్స్ యూనియన్‌గా హమాలీ బోర్డ్ సాధనకు రాష్ట్రవ్యాప్తంగా పనిచేస్తున్న హమాలీ కార్మికులను సంఘటితం చేస్తూ ప్రతి జిల్లాలో మహా సభలు, సమావేశాలు నిర్వహిస్తూ అధికారుల దృష్టికి తీసుకు వెళ్తూ స్థానిక ఎమ్మెల్యే, ప్రజా ప్రతినిధులను ఆహ్వానిస్తూ మెమోరాండాలు అందజేస్తున్నామని పెద్దపల్లి జిల్లా కేంద్రంలో వచ్చే నెలలో పెద్ద ఎత్తున జిల్లా మహా సభ నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. తెలంగాణ హమాలీ వర్కర్స్ యూనియన్ జిల్లా బాధ్యులు జంగా సంపత్ యాదవ్, కామ భూమన్న, కొమ్ము మధు, కీసరి సదయ్య, చంద్రయ్య, బండారి రమేష్, కొమ్ము సందీప్, తిరుపతి, రవి, అంబటి శంకర్, పాల్గొన్నారు.

అక్రమంగా మట్టి తరలింపుపై చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర బ్యూరో -పెద్దపల్లి : పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలం కన్నాల శివారు సర్వే నెంబర్ 493, 494 లో సూర సంతోష్, మరికొందరు వ్యక్తులు అక్రమంగా మట్టి తరలింపు నిలిపివేయాలని కన్నాల, జీడి నగర్ గ్రామాల ప్రజలు అధికారులను కోరారు. ఈ మేరకు పాలకుర్తి తహసీల్దార్ కు వినతిపత్రం అందజేశామని పలువురు గ్రామస్తులు పేర్కొన్నారు. జెసిబిలు, ప్రోక్లెయిన్‌లతో ఎలాంటి అనుమతులు లేకుండా, ప్రభుత్వానికి రాయల్టీ చెల్లించకుండా పెద్ద ఎత్తున మట్టిని అక్రమంగా తరలిస్తున్నారని విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు. దీంతో మైనింగ్, రెవెన్యూ అధికారులు వచ్చి విచారణ జరిపారని అక్రమంగా మట్టి తరలింపు లెక్క తేల్చి జరిమానా వసూలు చేయాలని గ్రామస్తులు కోరారు. మట్టి తరలించడానికి అనుమతులు ఇవ్వవద్దని విలేఖరులకు అందజేసిన ప్రకటనలో పేర్కొన్నారు.

పదవీ విరమణ పొందిన

పోలీసు అధికారులకు సత్కారం

విశాలాంధ్ర - కొత్తగూడెం క్రైమ్ : పోలీస్ శాఖలో ఎన్నో ఏళ్లుగా పనిచేస్తూ ఎనలేని సేవలందించి పదవీ విరమణ పొందిన ముగ్గురు ఎస్ఐలు, ఇద్దరు ఏఎస్సైలు ఒక హెడ్ కానిస్టేబుల్‌ను శనివారం జిల్లా ఎస్పీ రోహిత్ రాజా ఘనంగా సత్కరించారు. హేమచంద్రాపురంలోని పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లొ ఈ కార్యక్రమం జరిగింది. కొత్తగూడెం టూ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న ఖాజా మక్సుద్ అలీ ఖాన్, అశ్వాపురం ఎస్ఐ కొత్తా నాగేశ్వరరావు, లక్ష్మీదేవిపల్లి ఎస్సై మందపల్లి ప్రసాద్ రావు, జూలూరుపాడు ఏఎస్ఐ కుక్కమళ్ళ కోటేశ్వరరావు, ఇల్లందు ఏఎస్ఐ చిన్న ధనపాల్ రవి, ములకలపల్లి హెడ్ కానిస్టేబుల్ కన్నిడి వెంకటేశ్వర్లు శనివారం పదవీ విరమణ పొందారు. ఈ ఆరుగురు అధికారులను జిల్లా ఎస్పీ రోహిత్ రాజు శాలువాలు కప్పి పూలమాలతో ఘనంగా సత్కరించారు. అనంతరం పోలీస్ శాఖలో వీరి అనుభవాలను జిల్లా ఎస్పీతో పంచుకున్నారు. ఈ ఆయన మాట్లాడుతూ పదవీ విరమణ పొందిన పోలీసు అధికారులు తమ శేషజీవితాన్ని కుటుంబ సభ్యులతో కలసి ఆనందంగా గడపాలని ఆకాంక్షించారు. అనంతరం పదవీ విరమణ పొందిన ఆరుగురు అధికారులకు ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో డిసిఆర్బి డిఎస్పి మల్లయ్య స్వామి, ఏఓ మంజ్యా నాయక్, ఎస్బి ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, సీఐలు వెంకటేశ్వర్లు, రమణా రెడ్డి, ఎంటిఓ సుధాకర్, అడ్మిన్ ఆర్ఐ లాల్ బాబు, పోలీస్ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

శాస్త్రీయ పద్ధతిలో మేకలు పెంచాలి : కలెక్టర్

విశాలాంధ్ర - కొత్తగూడెం : శాస్త్రీయ పద్ధతులు మేకలు పెంచడం వల్ల మంచి లాభాలు సాధించవచ్చని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. శనివారం క్యాంప్ కార్యాలయంలో సిఐఆర్ జి శిక్షణ పొందిన పశువైద్యాధికారులతో కలెక్టర్ సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా, జిల్లా పశువైద్య, పశుసంవర్ధక శాఖాధికారి డాక్టర్ ఎం. వెంకటేశ్వర్లు, ఉత్తరప్రదేశ్ రాష్ట్రం మత్తుర సమీపంలో మక్దూం లో మేకల పెంపకం, మేకపాలు, వాటి ఉత్పత్తుల తయారీపై శిక్షణ పొందిన ముగ్గురు పశు వైద్యాధికారులు పాల్గొన్నారు. ఈ సమావేశమైన కలెక్టర్ మాట్లాడుతూ స్థానిక మేక జాతుల అభివృద్ధి, కృత్రిమ గర్భధారణ, మెరుగైన విత్తనపు పోతుల లభ్యత, పశు గ్రాస రకాలు, దాణా మిశ్రమ పదార్థాల లభ్యత, సమయానుకూల ఆరోగ్య పరిరక్షణ చర్యలు వంటి అంశాలను చర్చించారు. గ్రామీణ ప్రాంతాల్లో మేకల పెంపకందారులకు అవగాహన కల్పించడం, షెడ్డు నిర్వహణ, పశుగ్రాస ఉత్పత్తి, అధిక మాంసకృతులు కలిగిన ఆహారం అందించడం అవసరం అన్నారు. స్థానిక మేకల జాతుల జన్యు అభివృద్ధి వంటి అంశాలను పైలెట్ ప్రాజెక్టుగా ఒక గ్రామం నుంచి ఇద్దరు ఔత్సాహిక పశుపోషక రైతుల ద్వారా అమలు చేయడానికి ప్రణాళిక సిద్ధం చేసి తదుపరి సమావేశానికి సమర్పించాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలొ డాక్టర్ జి. ఆనందరావు, డాక్టర్ సిహెచ్.బాలకృష్ణ పాల్గొన్నారు.

మాజీ మంత్రి కోనేరు జయంతి వేడుకలు

విశాలాంధ్ర - కొత్తగూడెం అర్బన్: కొత్తగూడెంకు చెందిన దివంగత మాజీ మంత్రి పోలేరు నాగేశ్వరరావు 89వ జయంతి వేడుకలను అభిమాని పొన్నేకంటి సంజీవరావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. శనివారం కొత్తగూడెం క్లబ్ ఆవరణలో సత్యం స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు సంజీవరాజు ఏర్పాట్లు చేసారు. ఈ కార్యక్రమానికి కొత్తగూడెం క్లబ్ కార్యదర్శి, కోనేరు తనయులు పూర్ణచంద్రరావు, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులైన కోనేరు సత్యనారాయణ లు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. కోనేరు చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. కేక్ కట్ చేసి అభిమానులకు పంచారు. కోనేరు రాజకీయంగా ఎలాంటి మచ్చలేని, కపటం లేని ముక్కుసూటి నాయకుడని సంజీవరావు అన్నారు. ఈ కార్యక్రమంలో తోలేరు అభిమానులు, నాయకులు ఎస్.కె.మసూద్, అన్వర్, ప్రభాకర్, ప్రసాద్, టెంట్ హౌస్ వెంకట్, బజాజ్ ప్రభాకర్, రిటైర్డ్ పోలీస్ అధికారి శివ, రావి రాంబాబు, యలమంచిలి శ్రీనివాస్, జర్నలిస్టు సుధాకర్, బుగుల రవిగౌడ్, జెపి సైమన్, లయన్ కె. నాగేశ్వరరావు ఎండి అజీమ్, గోపయ్య, అభినవ్, కంచం నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

యూరియా కోసం రైతుల ధర్నా

విశాలాంధ్ర - తుంగతుర్తి : తుంగతుర్తి మండల కేంద్రంలోని స్థానిక తహసిల్దార్ కార్యాలయం ముందు రైతులు తమ పంట పొలాలకు సరిపడ యూరియా అందించాలని డిమాండ్ చేస్తూ ధర్నా నిర్వహించారు. యూరియా కోసం రైతులు గంటల తరబడి క్యూ లైన్‌లో నిల్చుని ఉండాల్సిన పరిస్థితి నెలకొందని ప్రభుత్వం వెంటనే స్పందించి రైతులకు సరి పడా యూరియాను అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. రైతుల ధర్నాకు బిఆర్ఎస్, బిజెపి, సిపిఐ నాయకులు సంఘీభావం తెలియజేశారు.

మహిళా అధికారిణితో అసభ్య ప్రవర్తనపై అధికారి సస్పెన్షన్

విశాలాంధ్ర - సూర్యాపేట బ్యూరో : జిల్లాలో మహిళా వ్యవసాయ విస్తరణ అధికారిణి పట్ల అసభ్య ప్రవర్తన కేసు తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఈ నేపథ్యంలో మరో మండల వ్యవసాయ అధికారిపై కఠిన చర్యలు తీసుకున్నారు. సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ఆదేశాల మేరకు నూతనకల్ మండల వ్యవసాయ అధికారి పి. మురళి బాబును సస్పెండ్ చేశారు. మహిళా వ్యవసాయ విస్తరణ అధికారిణికి పదేపదే ఫోన్ కాల్స్ చేసి అసభ్యంగా ప్రవర్తించినట్లు ఆయనపై ఆరోపణలు ఉన్నాయి. ఈ ఆరోపణలను ప్రాథమికంగా సమీక్షించిన కలెక్టర్, వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులతో చర్చించి సస్పెన్షన్ ఆదేశాలు జారీ చేశారు. ఇదే కేసులో ఇప్పటికే తుంగతుర్తి మండల వ్యవసాయ అధికారి ఎన్.బాలకృష్ణను గత శుక్రవారం సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. వరుసగా అధికారులు ఇలాంటి చర్యలకు పాల్పడడంపై వ్యవసాయ శాఖలో కలకలం రేగింది. మహిళా సిబ్బంది భద్రత, గౌరవ పరిరక్షణ విషయాల్లో ఎలాంటి రాజీకి తావులేదని కలెక్టర్ స్పష్టం చేశారు. జిల్లాలోని అన్ని విభాగా అధికారులకు కలెక్టర్ హెచ్చరికలు జారీ చేశారు. ప్రభుత్వ ఉద్యోగులు తమ పద్ధతి, ప్రవర్తనలో జాగ్రత్తలు పాటించకపోతే కఠిన చర్యలు తప్పవని ఆయన స్పష్టం చేశారు.

సంపాదకీయం

మోదీ విద్యార్హతపై వింత తీర్పు

ఢిల్లీ హైకోర్టు గత సోమవారం ఓ విచిత్రమైన తీర్పు చెప్పింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఢిల్లీ విశ్వవిద్యాలయం నుంచి బీఏ ఉత్తీర్ణుడినయ్యాను అని చెప్తున్నారు. ఆ సర్టిఫికెట్ ఏదో చూపించాలని కేంద్ర సమాచార కమిషన్ 2017లో ఆదేశించింది. ఈ ఆదేశం చెల్లదని, మోదీ డిగ్రీ సర్టిఫికెట్ ఇతరులకు చూపించనవసరం లేదని ఢిల్లీ హైకోర్టు వింత తీర్పు ఇచ్చింది. అది వ్యక్తిగత సమాచారమట. విద్యార్హతకు సంబంధించిన సర్టిఫికెట్ వ్యక్తిగతం ఎలా అవుతుందో తెలియదు. పరీక్షలు ముగిసిన తరవాత ఆ ఫలితాలను సంబంధిత విశ్వవిద్యాలయాలు బహిర్గతం చేస్తాయి. అలాంటప్పుడు ఒక్క ప్రధానమంత్రి నరేంద్ర మోదీ డిగ్రీ వ్యక్తిగతం ఎలా అవుతుందో తెలియదు. ప్రధానమంత్రి మోదీ పట్టభద్రుడైన డిగ్రీ చూపించాలని కేంద్ర సమాచార కమిషన్ ఆదేశించి ఏళ్లు గడుస్తోంది. కానీ ఢిల్లీ విశ్వవిద్యాలయం కేంద్ర సమాచార కమిషన్ ఆదేశాన్ని సవాలు చేస్తూ ఢిల్లీ హైకోర్టుకెక్కింది. ఢిల్లీ విశ్వవిద్యాలయం పెట్టుకున్న పిటిషన్‌పై గత ఫిబ్రవరిలో విచారణ పూర్తి అయింది. గత ఫిబ్రవరి 27 న ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి సచిన్ దత్తా తీర్పు వెల్లడించడం వాయిదా వేశారు. సోమవారం మోదీ సర్టిఫికెట్ ఎవరికీ చూపించనవసరం లేదని అపూర్వమైన తీర్పు చెప్పారు. నీరజ్ అనే వ్యక్తి 2016 డిసెంబర్ 21 న మోదీ సర్టిఫికెట్ చూడడానికి అనుమతించాలని కేంద్ర సమాచార కమిషన్‌కు పిటిషన్ పెట్టుకున్నారు. ఈ పిటిషన్ పైనే కేంద్ర సమాచార కమిషన్ నీరజ్‌కు మోదీ డిగ్రీ సర్టిఫికెట్ చూసే అవకాశం కల్పించాలని ఆదేశించింది. ఈ ఉత్తర్వును సవాలు చేస్తూ ఢిల్లీ విశ్వవిద్యాలయం కోర్టుకెక్కింది. ఢిల్లీ విశ్వవిద్యాలయం నుంచి 1978 లో తాను బీఏ పూర్తి చేశానని మోదీ చెప్పుకున్నారు. ఆ తరవాత ఆయన గుజరాత్ విశ్వవిద్యాలయం నుంచి ఎంఎ. కూడా పూర్తి చేశానని చెప్పుకున్నారు. కేంద్ర మంత్రిగా పని చేసిన అరుణ్ జైట్లీ సజీవుడిగా ఉన్నప్పుడే అమిత్‌షాతో కలిసి మోదీ బీఏ, ఎంఎ. డిగ్రీల సర్టిఫికెట్లు విలేకరులకు ప్రదర్శించారు. ఇవి అసలైనవి కాదని అప్పటికి సర్టిఫికెట్లు కంప్యూటర్లను వినియోగించి సిద్ధం చేసే సదుపాయమే లేదన్న గట్టి వాదనలు బయలు దేరాయి. అంటే అమిత్ షా, అరుణ్ జైట్లీ జమిలిగా మీడియా సమావేశం ఏర్పాటు చేసి చూపించిన మోదీ సర్టిఫికెట్లు అసలైనవి కావని అనుకోవాలి. అది నిజం కూడా. రాజకీయాలలో ఉండేవారికి విద్యార్హత ఉండాలన్న నియమేమీ లేదు. నిరక్షరాస్యులు కూడా రాజకీయాలలో పాల్గొనవచ్చు. ఉన్నత పదవుల్లో ఉండనూ వచ్చు. తన విద్యార్హతలపై మోదీ ఇంతవరకు ఇదమిత్థమైన ప్రకటన ఏమీ చేయలేదు. పైగా ఆయన ఒకసారి ఎన్నికలలో పోటీ చేసినప్పుడు తాను బీఏ చదివానని ప్రమాణ పత్రంలో పేర్కొన్నారు. ఎన్నికలలో పోటీ చేసే వారు తమ పేరు, తల్లిదండ్రుల పేరుతో సహా ఉంటే తమ విద్యార్హతలేమిటో కూడా ప్రమాణ పత్రంలో పేర్కొనక తప్పదు. కానీ మోదీ ఒకసారి తాను బీఏ పాసయ్యానని, మరోసారి ఎంఏ పాస్ అయ్యానని చెప్పుకోవడం వివాదాలకే కాదు, అనుమానాలకు దారి తీసింది. ఆమ్‌ఆద్మీ పార్టీ నాయకుడు కేజ్రీవాల్ ఈ విషయమై కోర్టుకెక్కినప్పుడూ మోదీ సర్టిఫికెట్లు చూపించకపోగా కేజ్రీవాల్‌కు పాతిక వేల రూపాయల జరిమానా కూడా విధించారు. రాజకీయ నాయకులకు విద్యార్హత ఉండాలన్న నియమం లేదు కానీ ప్రమాణ పత్రంలో అసత్యం చెప్పడం చట్టరీత్యా నేరమే. ఈ అంశంపై మోదీని శిక్షించిన వారు లేరు కానీ ఈ వివాదం మాత్రం సమసి పోవడం లేదు. తొమ్మిదేళ్ల నుంచి ఈ వివాదం కొనసాగుతూనే ఉంది. సోమవారం ఢిల్లీ హైకోర్టు మోదీ సర్టిఫికెట్లు చూపించనవసరం లేదని, అది వ్యక్తిగత అంశమని, ఈ విషయంలో గోప్యతకు మోదీకి అవకాశం ఉందని తీర్పు చెప్పినప్పటికి వివాదమూ ముగియలేదు. అనుమానాలూ తీరలేదు. మోదీ బీఏనో, ఎంఏనో చదివి ఉంటే ఆయనతో పాటు చదువుకున్న తోటి విద్యార్థులెవరైనా ఉండి ఉండాలి. ఇప్పటిదాకా తాము మోదీకి సహ విద్యార్థులమని చెప్పుకున్న వ్యక్తి ఒక్కరు కూడా ముందుకు రాలేదు. కేంద్ర ఎన్నికల కమిషన్ ఉత్తర్వును 2017 జనవరి 23 న నిలిపివేసింది. ఆ వ్యవహారాన్ని తేల్చడానికి ఢిల్లీ హైకోర్టుకు ఎనిమిదేళ్లు పట్టింది.

నీరజ్ పెట్టుకున్న అర్జీపై ఢిల్లీ హైకోర్టులో విచారణ జరిగినప్పుడు సోలిసిటర్ జనరల్ తుషార్ మెహతా ఢిల్లీ హైకోర్టు తరపున వాదించారు. నీరజ్ పిటిషన్‌ను తోసి పుచ్చాలని కోరారు. అదే సమయంలో తుషార్ మెహతా మరో విచిత్రమైన వాదన చేశారు. కావాలంటే విశ్వవిద్యాలయ అధికారులు ఈ సర్టిఫికెట్లను న్యాయమూర్తికి చూపించడానికి సిద్ధంగా ఉన్నారని చెప్పారు. మోదీ సర్టిఫికెట్లను న్యాయమూర్తికి చూపిస్తాం కాని బహిరంగ పరచమని వాదించారు. ఇదేమి చోద్యమో అంతుపట్టదు. న్యాయమూర్తికి తెలిసిన సత్యం ప్రజలకు తెలిస్తే నష్టం ఏమిటో అంతు పట్టదు. అయితే తుషార్ మెహతా వితండవాదం చూస్తే మోదీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి న్యాయవ్యవస్థను గుప్పెట్లో పెట్టుకోవడానికి ప్రయత్నిస్తోందన్న ఆరోపణలకు మరింత బలం చేకూరింది. ఈ ఆరోపణలను తోసిపుచ్చలేని హైకోర్టు విచారణ అసలు ఆ సర్టిఫికెట్లు చూపించనవసరం లేదని వింతైన తీర్పు చెప్పింది. ఈ తీర్పు వల్ల మోదీ విద్యార్హతలపై రేగుతున్న వివాదం అంతం అవుతుందని అనుకోలేం. మోదీ ఎంఏ డిగ్రీకి సంబంధించిన కేసు ఇంకా గుజరాత్ హైకోర్టు విచారణలో ఉంది. గుజరాత్ హైకోర్టు తీర్పు భిన్నంగా ఉంటుందనుకోలేం. ఢిల్లీ హైకోర్టు తీర్పులో మరో విచిత్రమూ ఉంది. మోదీ డిగ్రీ చూపించాలన్న ఆసక్తిలో ప్రజా ప్రయోజనం ఏమీ లేదట. ప్రజా జీవనంలో ఉన్న వారికి, ఆ హోదాలో విధులు నిర్వహిస్తున్న వారికి విద్యార్హతలు ఉన్నాయా లేవా అన్న అంశానికి చట్టబద్ధత ఏమీ లేదని కూడా ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి సచిన్ దత్తా తన తీర్పులో తెలియజేశారు. మోదీ డిగ్రీల గురించిన సమాచారం వెల్లడించాలన్న నియమం ఏదీ లేని మాటమే నిజమే అయినా మోదీకి డిగ్రీలు ఉన్న మాట వాస్తవమే అయితే ఆ డిగ్రీలు చూపించడానికి అభ్యంతరం ఎందుకుండాలి. ఆయన డిగ్రీల గురించి తెలుసుకోవడంలో ప్రజా ప్రయోజనం ఏమీ లేదని హైకోర్టు న్యాయమూర్తి తీర్పు చెప్పాల్సిన అవసరం ఏముంది. ప్రజల ఆసక్తి చట్టానికి సంబంధించిన అంశం కాదుగా! న్యాయమూర్తి సచిన్ దత్తా సమాచార హక్కు చట్టంలోని సెక్షన్ 8(1)ని ఆధారంగా చేసుకుని ఇది వ్యక్తిగత విషయం అని కూడా తేల్చారు. మోదీకి డిగ్రీ ఉన్నా లేకపోయినా ఆయన పదవికి వచ్చిన ముప్పేమీ లేదు. కానీ లేని డిగ్రీలు ఉన్నట్టు మాట్లాడడం జనాన్ని మోసగించడమే అవుతుంది.

సీమ పెండింగ్ ప్రాజెక్టులపై ఒత్తిడి

వి. శంకరయ్య

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి సంవత్సరంపై బడుతున్నా మెట్ట ప్రాంతాల్లోని పెండింగ్ ప్రాజెక్టులను పట్టించుకోకుండా అదే సమయంలో 82 వేల కోట్ల భారీ బడ్జెట్‌తో బనకచర్ల అనుసంధానం ప్రతిపాదించిన నేపథ్యంలో ఆలోచనపరుల వేదిక అనే సంస్థ ప్రాజెక్టులు ప్రజల కోసం నిర్మించాలి అనే టాగ్‌లైన్‌తో పురుడుబోసుకొంది. వ్యక్తులుగా నలుగురైదుగురు ఈ సంస్థను ప్రారంభించినా ఏ రాజకీయ పార్టీకి చెందిన వారు కాకపోవడం, వారి నేపథ్యం మలినం కాకుండా వుండటం, మెట్ట ప్రాంతాలకు సాగునీరు ఆవశ్యకత లక్ష్యంగా స్వతంత్ర ప్రతిపత్తి కలిగి ఉండటంతో సంస్థ ప్రత్యేక ప్రాధాన్యత సంతరించుకొంది. మాజీ ఐఎఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావు కోస్తా జిల్లాల రైతు సంఘం నేత అక్కినేని భవానీ ప్రసాద్, రాజకీయ విశ్లేషకులు తుంగా లక్ష్మీనారాయణ (వీరొక్కరే రాయలసీమ వాసి) మాజీ ఇరిగేషన్ అధికారి పాపారావు వ్యవస్థాపకులైనా రాయలసీమ పర్యటనలో నల్లమోతు చక్రవర్తి, జొన్నలగడ్డ రామారావు, కృష్ణమూర్తి నాయుడు కూడా పాల్గొన్నారు. ప్రస్తుతం ఇది పొత్తిళ్లలో బిడ్డ అయినా ప్రధానంగా మెట్ట ప్రాంత ప్రజల దృష్టిని ఆకర్షించింది. నాలుగైదు లక్ష్యాలు నిర్దేశించుకొన్నట్లు వారి ప్రెస్‌మీట్‌లో విడుదల చేసిన ప్రకటనలు వెల్లడిస్తున్నాయి. బచావత్ ట్రిబ్యునల్ ప్రాజెక్టుల వారీగా కేటాయించిన నీటి వాటా బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ వద్ద కాపాడుకోవ దానికి కృషి చేయడం రెండు రాష్ట్రాల్లోని మెట్టప్రాంత ప్రజలకు చెంది పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులను పట్టాలకెక్కించేందుకు ప్రభుత్వంపై ఒత్తిడి తేవడం సంస్థ లక్ష్యంగా పెట్టుకున్నారు. సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం కాంట్రాక్టర్ల స్వార్థం కోసం కాకుండా రైతులకు సాగునీరు అందించే విధంగా పనులు జరిగేందుకు అంకుశంగా పని చేయదలచారు. ఈ సంస్థ ఆవిర్భావం కూడా ప్రత్యేక పరిస్థితుల్లో సంభవించింది. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టనున్న బనకచర్ల అనుసంధానం రాష్ట్రానికి గాని తుదకు రాయలసీమ తదితర మెట్ట ప్రాంతాలకు ఏ విధంగానూ ఉపయోగపడదని ఈ సంస్థ ప్రకటించింది.

రూ. 82 వేల కోట్లు వ్యయం చేయదలచిన ఈ పథకం ద్వారా రాయలసీమలో, ఇతర మెట్ట ప్రాంతాల్లో ఒక్క ఎకరాకు కూడా అదనంగా సాగునీరు లభ్యం కాదని ఈ సంస్థ తేల్చింది. ఈ పథకం కేవలం కాంట్రాక్టర్ల లబ్ధికోసం తప్ప వేరు విధంగా ఉపకరించదని ఈ సంస్థ ముఖ్యనేతగా వున్న ఏబీ వెంకటేశ్వరరావు గణాంకాలతో సహా వెల్లడించారు. రాష్ట్రంలో ప్రతి అంశానికి రాష్ట్ర ప్రభుత్వంతో ఢీ అంటే ఢీ అనే ప్రధాన ప్రతిపక్షం ఇంత జరుగుతున్నా ఈ పథకం పట్ల మౌనం దాల్చినా ఆలోచన పరుల వేదిక నిర్భయంగా ముందుకు రావడం నూతన ఒరవడికి శ్రీకారం చుట్టినట్లయింది. సాగునీటి ప్రాజెక్టుల విషయంలో రాష్ట్ర ప్రజలను చైతన్యపరుస్తూ రాయలసీమతో సహా మెట్ట ప్రాంతాల్లో పెండింగ్ ప్రాజెక్టుల దుస్థితి ప్రజల దృష్టికి తెచ్చేందుకు ఆగస్టు తొలివారంలో నాలుగు రోజులు పాటు రాయలసీమలోని అనేక ప్రాజెక్టులను ఒక బృందంగా సందర్శించారు. ఈ బృందం వెంబడి రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథరామిరెడ్డి తదితరులు వున్నారు. ఇంత వరకు రాయలసీమలో సాగునీటి ప్రాజెక్టుల కోసం ఆ ప్రాంతీయులే వివిధ సంఘాలుగా ఏర్పడి పోరాడుతుంటే ఆలోచనపరుల వేదిక ద్వారా కోస్తా జిల్లాలకు చెందినవారు కూడా రాయలసీమలో పర్యటించి గొంతెండిపోతున్న రాయలసీమ ప్రాజెక్టుల గురించి గళం విప్పడం నూతన పరిణామం. ఇది రాయలసీమ వాసుల్లో ఆత్మవిశ్వాసం పెంపొందేందుకు దోహదపడుతుంది. ప్రాంతీయ విభేదాలను తగ్గిస్తుంది.

ఆలోచన పరుల వేదిక బృందం పర్యటనలో మరో ఆసక్తికర సంఘటన చోటుచేసుకుంది. శ్రీశైలం జలాశయం నుంచి రోజూ పది టీఎంసీల నీళ్లు ఆంధ్రప్రదేశ్ తరలించుకు పోతోందని ఇటీవల తెలంగాణ మీడియాలో అవాస్తవ ప్రచారం సాగుతోంది. తుదకు తెలంగాణలోని ప్రతిపక్షంతో పాటు ప్రభుత్వం వేపు నుంచి కూడా ఇలాంటి ప్రచారం జరుగుతున్నా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వేపు నుంచి ఎట్టి స్పందనాలేదు. ఈ దుష్ప్రచారంతో ప్రభుత్వాల స్థాయిలోనే కాకుండా ప్రజల మధ్య కూడా చిచ్చు రేగే అవకాశం వుంది. ఈ పరిస్థితుల్లో రాయలసీమలో పర్యటించిన ఈ బృందం వాస్తవ పరిస్థితి గమనించి వెల్లడించింది. తెలంగాణలో జరుగుతున్న ప్రచారం మేరకు 80 వేల క్యూసెక్కులు పోతురెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ నుంచి తీసుకెళ్లడం లేదని కేవలం 30 వేల క్యూసెక్కులు మాత్రమే విడుదల చేస్తున్నారని తాము గుర్తించినట్లు ప్రకటించారు. వాస్తవంలో ముచ్చుమర్రి నుంచి ఎత్తిపోతలు మొదలు పెట్టలేదని తేల్చారు. జగన్ హయాంలో మొదలు పెట్టిన రాయలసీమ ఎత్తిపోతల పథకంలో ఒక కందకం దాని చివర్లో ఒక బావి మాత్రమే తవ్వారని దానికి 750 కోట్లు ప్రజాధనం వ్యయం చేసినట్లు ఈ బృందం గుర్తించింది. ఈ పథకం నుంచి 3700 క్యూసెక్కులు తరలిస్తున్నారని తెలంగాణ ప్రభుత్వం ఆరోపిస్తే రాష్ట్ర జల వనరులశాఖ నోరు విప్పక పోవడాన్ని ఈ బృందం ఖండించింది. శ్రీశైలం జలాశయం నుంచి ఏపీ తరలించుకు పోతున్నదని జరుగుతున్న ప్రచారం వాస్తవం కాదని తెలంగాణ నుంచి ఎవరు వచ్చినా తాము నిరూపించేందుకు సిద్ధంగా వున్నామని ఈ బృందం ప్రకటించింది. ఇలాంటి దుష్ప్రచారంతో ఇప్పటికే దిగజారిన రెండు రాష్ట్రాల మధ్య సంబంధాలు మరింతగా దెబ్బతింటాయని ఆందోళన వ్యక్తం చేసింది. ఇంతటితో తమ పర్యటన ఆగదని మెట్ట ప్రాంతాల్లోని ఇతర పెండింగ్ ప్రాజెక్టుల పర్యటన త్వరలో వుంటుందని ఈ బృందం తెలిపింది. ప్రజల్ని చైతన్యవంతులను చేయడం తమ లక్ష్యమని చెప్పారు. ప్రధానంగా 82 వేల కోట్ల చిత్తు లెక్కలతో ప్రతిపాదిస్తున్న బనకచర్ల అనుసంధానం విరమించుకొని వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి కేంద్రం ఇస్తామన్న పదివేల కోట్ల రూపాయలు తీసుకు వచ్చి రాయలసీమలోని అన్ని పెండింగ్ ప్రాజెక్టులు రెండేళ్ల కాలపరిమితితో పూర్తిచేస్తే పది లక్షల ఎకరాలు సాగులోనికి వస్తాయని సూచించింది.

– విశ్రాంత పాత్రికేయులు

సంక్షోభంలో పత్తి దిగుబడులు

డా. సోమ మర్ల

ఆంధ్రప్రదేశ్‌లో వరి తర్వాత పత్తి ప్రధాన పంట. విదేశాల నుంచి ముడిపత్తిపై 11శాతం దిగుమతి పన్నును రద్దు చేయాలని కేంద్ర ప్రభుత్వం ఇటీవల తీసుకున్న నిర్ణయం మార్కెట్‌లో ఇబ్బందుల్లో ఉన్న రైతులను మరింత బాధిస్తోంది. దేశీయ పత్తి ధరలను స్థిరీకరించడానికి ఇటీవలి సుంకాల బారినపడిన వస్త్ర పరిశ్రమకు మద్దతు ఇవ్వడానికి ఆగస్టు 18న దిగుమతి సుంకాలను మినహాయించాలని నిర్ణయం తీసుకున్నారు. కానీ వాస్తవం భిన్నంగా ఉంది. ఇది ధరలను మరింత దిగజార్చి, రైతులను మరింత కష్టాల్లోకి, అప్పుల్లోకి నెట్టివేస్తోంది. అలాగే దిగుమతి పన్ను మినహాయింపు పెద్ద వస్త్ర మిల్లులకు మాత్రమే సహాయపడుతుంది తప్ప లక్షలాది మంది కార్మికులు ఉద్యోగాలు కోల్పోతున్న తిరుపూర్‌లోని చిన్న, మధ్య తరహా పరిశ్రమల వస్త్ర ఎగుమతిదారులకు కాదు.

నేడు ప్రభుత్వం ముడి పత్తి దిగుమతి పన్ను రద్దును డిసెంబర్ చివరి వరకు పొడిగించింది. కానీ పత్తి కోతలు అక్టోబర్‌లో ప్రారంభమవుతాయి. ప్రభుత్వ నిర్ణయం పెద్ద వస్త్ర మిల్లులకు మాత్రమే సహాయపడుతుంది. మార్కెట్లలో రైతులను ఇబ్బందుల్లో పడేస్తుంది. గత పదకొండు సంవత్సరాలుగా, ఎంఎస్ స్వామినాథన్ కమిషన్ సిఫార్సు చేసిన C2 +50 సిఫార్సుల ప్రకారం ప్రభుత్వం ఎంఎస్‌పీలు ఇవ్వలేదని ఎస్‌కేఎంయూ పేర్కొంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రైతులకు ద్రోహానికి పాల్పడ్డారని విమర్శించింది. రైతులు తన ప్రభుత్వంలో అత్యున్నత ప్రాధాన్యత అని ఆయన గతంలో చేసిన ప్రకటనను వివరించమని కోరింది. సీఏసీపీ సిఫార్సుల ప్రకారం 2025-26 సంవత్సరానికి ప్రభుత్వం రూ.7,710 మద్దతు ధరను ప్రకటించింది. డీజిల్, విత్తనాలు, ఎరువులు, రసాయనాల ధరలు పెరుగుతున్నందున ప్రస్తుతం ఎంఎస్‌పీ రైతులకు లాభదాయకంగా లేదు. C2 +50 ప్రకారం, ధర కనీసం క్వింటాల్‌కు రూ. 10,075 ఉండాలి. అయితే, ప్రస్తుతం మార్కెట్లలో పత్తి ధరలు క్వింటాల్‌కు రూ. 5,500 నుంచి రూ. 6,500మధ్య ఉన్నాయి. అంచనాల ప్రకారం 2024-25లో పత్తి రైతుల నష్టం రూ. 18,850 కోట్లకు పైగా ఉంది. ఒక ఎకరానికి దాదాపు రూ. 31,500 వరకు నష్టపోయారు.

పత్తి సాగు చేసిన ప్రాంతంలో విత్తనాలు, పురుగు మందులు, డీఏపీ ఎరువుల ఇన్‌పుట్ ఖర్చులను పరోక్షంగా అమెరికా ఇతర వ్యవసాయ వ్యాపార బహుళజాతి కంపెనీలు, బేయర్, డూపాంట్ వంటి సంస్థలు నియంత్రిస్తాయి. ప్రతి సంవత్సరం సాగు ఖర్చులను తట్టుకోలేక, మార్కెట్లలో లాభదాయక ధరలను పొందలేక వరంగల్, గుంటూరు, చంద్రాపూర్ నుంచి భటిండా వరకు అప్పులపాలైన వేలాదిమంది చిన్న, కౌలు రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. దిగుమతి పన్ను మినహాయింపు ఫలితంగా మార్కెట్ ధర తగ్గడం వల్ల దేశంలో దాదాపు 60 లక్షలకు పైగా పత్తి రైతు కుటుంబాలు ప్రభావితమయ్యే అవకాశం ఉంది.

ప్రధాని మోదీ తన ప్రభుత్వం వ్యవసాయం, పాడి ఉత్పత్తులపై అమెరికా ఆంక్షలు, అధిక సుంకాలను వ్యతిరేకిస్తోందని చెప్పినప్పటికీ, పరోక్షంగా తెర వెనుక ముడి పత్తిని దిగుమతి చేసుకోవడం ద్వారా అమెరికన్ పెద్ద పత్తి రైతులకు సహాయం చేస్తోంది. భారతదేశానికి అమెరికా పత్తి ఎగుమతుల విలువ 2020లో 147.13 మిలియన్ డాలర్లు కాగా, 2022లో 491.20 మిలియన్ డాలర్లకు పెరిగింది. అయితే, 2025 మొదటి ఆరు నెలల్లో ఎగుమతులు 109% పెరిగి 181.46 మిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. ఈ సంవత్సరం చివరి నాటికి 400 మిలియన్ డాలర్లకు చేరుకునే అవకాశం ఉంది. దిగుమతి సుంకం కోతలను స్వాగతిస్తున్న అమెరికన్ వ్యవసాయ శాఖ (యూఎస్‌డీఏ) ఈ నిర్ణయం భారతీయ వస్త్ర ఎగుమతిదారులకు, అమెరికన్, భారతీయ రైతులకు ప్రయోజనం చేకూరుస్తుందని తెలిపింది. అమెరికాలో పత్తి రైతులకు సాగు ఖర్చులలో 12శాతం లభిస్తుంది, మన రైతులు ఎమ్ఎస్‌పీలు, యూరియా మొదలైన వాటి రూపంలో 2.37శాతం పొందుతారు. వాస్తవానికి ఇది రాజు, పేదవాడిని సమానంగా చూడటం లాంటిది. తక్కువ అయినప్పటికీ, అభివృద్ధి చెందుతున్న దేశాలలో పేద, చిన్న రైతుల ప్రయోజనాలను కాపాడటానికి రైతుల పోరాటాల తర్వాత డబ్ల్యూటీఓ ద్వారా ఈ సబ్సిడీలు అందుతున్నాయి. అధిక సుంకాలు విధించడం, దిగుమతి పన్ను మినహాయింపు అమెరికన్ పెద్ద కంపెనీలకు మన మార్కెట్లను తెరవడం వలన రైతులు మరింత తీవ్ర ఇబ్బందుల్లోకి నెట్టబడతారు. భారత వస్త్ర ఎగుమతులపై వాషింగ్టన్ 50శాతం సుంకం విధించిన తర్వాత, మోదీ ప్రభుత్వం భారతీయ పత్తి రైతులను శిక్షించాలని ఎంచుకుంది. మనం ఎక్కువగా అమెరికా నుంచి ముడి పత్తిని దిగుమతి చేసుకుంటాం. ప్రస్తుతం ఒక క్యాండీ (355.6 కిలోలు) ధర రూ. 50 నుంచి 51,000 మధ్య ఉంది. పత్తి కార్పొరేషన్ వస్త్ర మిల్లులకు క్యాండీని రూ. 56,000 చొప్పున విక్రయిస్తుంది. కానీ పత్తి రైతులకు కాటన్ కార్పొరేషన్ క్వింటాల్‌కు కేవలం రూ.7000 మాత్రమే చెల్లిస్తుంది. ధరలలో ఈ వక్రీకరణ ద్వారా రైతు ఎంత నష్టపోతున్నాడో స్పష్టంగా చూపిస్తుంది. కొంత ఉపశమనం కలిగించడానికి ప్రభుత్వం కాటన్ కార్పొరేషన్‌ను రైతులకు కనీసం క్వింటాల్‌కు రూ.11,000 ఎమ్ఎస్‌పీ చెల్లించాలని ఒత్తిడి చేయాలి. దిగుమతి పన్ను కోతలను వెంటనే ఉపసంహరించు కోవాలని లేదా దేశవ్యాప్తంగా రైతుల ఆందోళనను చేస్తుందని ఎస్‌కేఎంయూ ప్రభుత్వాన్ని హెచ్చరించింది. రైతులు అందరూ దీనికి మద్దతు ఇవ్వాలి.

> **సీఏసీపీ సిఫార్సుల ప్రకారం 2025-26 సంవత్సరానికి ప్రభుత్వం రూ.7,710 మద్దతు ధరను ప్రకటించింది. డీజిల్, విత్తనాలు, ఎరువులు, రసాయనాల ధరలు పెరుగుతున్నందున ప్రస్తుతం ఎంఎస్‌పీ రైతులకు లాభదాయకంగా లేదు. C2+50 ప్రకారం, ధర కనీసం క్వింటాల్‌కు రూ. 10,075 ఉండాలి. అయితే, ప్రస్తుతం మార్కెట్లలో పత్తి ధరలు క్వింటాల్‌కు రూ. 5,500 నుంచి రూ. 6,500మధ్య ఉన్నాయి. అంచనాల ప్రకారం 2024-25లో పత్తి రైతుల నష్టం రూ. 18,850 కోట్లకు పైగా ఉంది. ఒక ఎకరానికి దాదాపు రూ. 31,500 వరకు నష్టపోయారు.**

ఐసీఏఆర్ రిటైర్డు ప్రిన్సిపల్ సైంటిస్ట్ (జినోమిక్స్)

ముగ్గురు పిల్లల్ని కనాలంటున్న బ్రహ్మచారి...!

ఎం.కోటేశ్వరరావు

మీ కుటుంబంలో తరతరాల వారికి పుణ్యం రావాలంటే కాశీ దాకా తాటిపట్టె మీద దేకమన్నాడట ఒక సనాతనవాది. ఏమైనా చెబుతారు మీ పుణ్యం వద్దు మీరు వద్దు అంటూ ఒక పామరుడు చక్కాలేచిపోయాడని ఒక కథ. జనాభా తగ్గకుండా ఉండాలంటే ప్రతి మహిళ కనీసం ముగ్గురు పిల్లలను కనాలని బ్రహ్మచారి అయిన ఆర్‌ఎస్‌ఎస్ అధిపతి మోహన భగవత్ సంఘ్ వందేళ్ల సభలో చెప్పారు. మోసే గాడిదలకు తెలుస్తుంది మోసిన బరువెంతో అన్నట్లుగా పిల్లలున్న వారికి తెలుస్తుంది వారిని పెంచటంలో ఉన్న ఇబ్బంది. బ్రహ్మచారులు, కుటుంబ జీవనం లేని సాధువులు, సన్యాసులు, సాధ్విలకు ఏమి తెలుస్తుంది. మోహన్ భగవత్ ముగ్గురు పిల్లల గురించి చెప్పటం ఇదే మొదటిసారి కాదు. అయితే సంఘపరివార్ సభ్యులు లేదా దాని గురించి గొప్పగా చెప్పుకునే వారు ఎంత మంది ముగ్గురు పిల్లలను కంటున్నారన్నది ప్రశ్న. వారు ఎప్పటి నుంచో చెబుతున్నా జనాలు పట్టించుకోవటం లేదు. జననాల రేటు తగ్గుతూనే ఉంది. అయినా చెబుతూనే ఉండటం వెనుక పెద్ద ఓట్ల రాజకీయం ఉంది. అయితే జనాభా తగ్గుదల గురించి ఇతరులు అనేక మంది చెబుతున్నారు గదా భగవత్ చెప్పిందాంట్లో తప్పేముందని ఎవరైనా అడగవచ్చు. నిజమే, ముఖ్యమంత్రులు స్టాలిన్, చంద్రబాబు నాయుడు కూడా చెప్పారు తప్ప వారు మతాన్ని జోడించలేదు. అదే అసలు సమస్య. ఆర్‌ఎస్‌ఎస్ అధిపతి 2022 అక్టోబరులో జనాభా అదుపునకు సమగ్ర విధానం ఉండాలని, మత ప్రాతిపదికన అసమతూకం పెరిగిపోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. మన దేశంలోకి ఇస్లాం, క్రైస్తవం రాకముందు ఇక్కడ పుట్టిన మతాలు తప్ప మరొకటి లేవుగా, మరి అవి జనానికి ఒరగబెట్టిందేమిటి. అందరూ ఒకే మతం వారంటూ సమానంగా చూసిన పాపాన పోలేదు, ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా కులవివక్ష, పీడన అదనంగా ప్రసాదించటం తెలిసిందే.

నేడు దేశంలో ఉన్న వాతావరణం ఏమిటి? హిందూ మతం బతికి బట్టకట్టాలంటే హిందువులు ఎనిమిది నుంచి పది మంది పిల్లలను కనాలని ఆర్‌ఎస్‌ఎస్‌కు చెందిన విశ్వహిందూ పరిషత్ అధ్యక్షుడు ప్రవీణ్ తొగాడియా చెప్పారు. ఆయన కన్నది ఇద్దరిని, అలాంటి వారి కబుర్లన్నీ ఇలాగే ఉంటాయి. బీజేపీ ఎంపీ సాక్షి మహరాజ్ నలుగురిని కనాలన్నారు. టైమ్స్ ఆఫ్ ఇండియా 2006 ఏప్రిల్ 20 వ తేదీన "కాషాయ జనాభా శాస్త్రం " పేరుతో ప్రచురించిన విశ్లేషణ వివరాల ప్రకారం విశ్వహిందూ పరిషత్ అధ్యక్షుడు అశోక్ సింఘాల్ 2004 లో మాట్లాడుతూ హిందువులు ఎక్కువ మంది పిల్లల్ని కనకపోవటం ఆత్మహత్యా సదృశ్యమన్నారు. 2005 ఫిబ్రవరిలో వీహెచ్‌పీ మార్గదర్శక మండల్ సమావేశంలో శ్రీకృష్ణుడి తల్లిదండ్రుల మాదిరి సంతానాన్ని కనాలంటూ ఒక తీర్మానాన్ని ఆమోదించారు. సుభాష్ చంద్రబోస్ కృష్ణుడి మాదిరి ఎనిమిదవ సంతానమని, రవీంద్రుడు తొమ్మిదవ సంతానమని దానిలో పేర్కొన్నారు. హిందూ మహిళలు విచ్చల విడిగా అబార్షన్లు చేయించుకోకుండా చూడాలని వీహెచ్‌పీ కోరింది. ముస్లింల జనాభా అదుపులేకుండా పెరుగుతోందని, వారికి పోటీగా హిందువులు పిల్లలను ఎక్కువగా కనాలని హరిద్వార్‌లో జరిగిన విశ్వహిందూపరిషత్ మార్గదర్శక్ మండల్ పిలుపు ఇచ్చిందని రెడిఫ్ న్యూస్ 2006 జూన్ 15 న "హిందువులు జనాభాను పెంచాలని కోరిన వీహెచ్‌పీ" అనే శీర్షికతో వార్త ఇచ్చింది. ఇలా కాషాయ దళాల మాటలను ఎన్నయినా ఉటంకించవచ్చు. హిందూ జాతి అంతరిస్తున్నదని, మతానికి ముప్పు వచ్చిందని, త్వరలో ముస్లిం జనాభా మెజారిటీగా మారుతుందని హిందూ మహాసభ నుంచి ఆర్‌ఎస్‌ఎస్ నాయకులంతా పదే పదే చేస్తున్న గోబెల్స్ ప్రచారం తెలిసిందే. జనాభా సమతూకంలో ఉండాలని చెబుతారు. ఇప్పుడు ముస్లింల గురించి చెబుతున్నప్పటికీ తరువాత హిందువుల్లో ఏ కులం వారు ఎందరుంటే సమతూకం ఉంటుందో కూడా నిర్దేశించరని, సమాజం సమతూకంగా ఉండాలంటే చాతుర్వర్ణ వ్యవస్థ ఉండాలనే అజెండాను ముందుకు తీసుకురారనే హామీ ఏముంటుంది. అంటే వీరు

చెప్పినట్లే జనం కులం, మతాన్ని పాటించాలి, ఎందరు పిల్లల్ని కనమంటే ఆ సంఖ్యలోనే కనాలి.

జనాభా పెరుగుదల తరుగుదల సమస్యలను మతకోణంలో చూడటం అవాంఛనీయ వైఖరి. ముస్లిం ఛాందసులు అధికారంలో ఉన్న ఇరాన్‌లో సంతానోత్పత్తి రేటు పడిపోతున్నది. 1950లో అక్కడ 6.9 ఉండగా 2024లో 2.08కి తగ్గింది. క్రైస్తవుల్లో కూడా ఛాందసులు తక్కువేమీ కాదు, కానీ ఐరోపాలో సంతానోత్పత్తి రేటు 1.5, సగం ఐరోపా, సగం ఆసియాలో ఉన్న టర్కీ ముస్లిం దేశం, అక్కడ కూడా అంతే ఉంది. ముస్లింలు అధిక సంఖ్యలో ఉన్న దేశాలను ముస్లిం దేశాలని పిలుస్తున్నారు. 2011 నుంచి 21 సంవత్సరాల కాలంలో ఈ దేశాల్లో సంతనోత్పత్తి రేటు 3.3 నుంచి 2.7 కు తగ్గింది. విద్య, పట్టణీకరణ, ఆర్థిక, సామాజిక, ఆరోగ్య, శిశుమరణాలు తదితర పరిస్థితులను బట్టి తప్ప ప్రపంచంలో ఎక్కడా మత ప్రాతిపదికన పిల్లలను కనటం, మానటం లేదు. మేం సనాతనులం, పక్కా హిందువులం అని చెప్పుకుంటున్న కుటుంబాలలో తొగాడియా చెప్పినట్లు ఎంత మంది పదేసి మంది పిల్లలు కలిగి ఉన్నదీ చెప్పమనండి. తమ ఉన్మాద చర్యలకు ఉపయోగించుకోవటం తప్ప ఏ మతమూ పిల్లల బాగోగులకు బాధ్యత తీసుకోవటం లేదు.

2019 నుంచి 21 వరకు జరిగిన ఐదవ జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే ప్రకారం జాతీయ స్థాయిలో సంతానోత్పత్తి రేటు 2.1 ఉంటే దక్షిణాది రాష్ట్రాలలో 1.64, ఉత్తరాదిన 2.0, పశ్చిమాన 1.81, తూర్పున 2.0, మధ్య ప్రాంతంలో 2.1 ఈశాన్య ప్రాంతంలో 2.15 రేటులో ఉంది. రాష్ట్రాలన్నింటా ఒకే విధంగా లేదు. బీహార్‌లో 3.02 ఉండగా పక్కనే ఉన్న ఉత్తరప్రదేశ్‌లో 2.38, దాన్నుంచి ఏర్పాటు చేసిన ఉత్తరాఖండ్‌లో 1.87, పశ్చిమ బెంగాల్లో 1.56 పక్కనే ఉన్న ఒడిశాలో 2.14 చొప్పున ఉంది. ఒకే రాష్ట్రంలో చూస్తే గుజరాత్ గ్రామీణంలో 2.15, పట్టణాల్లో 1.63, మధ్యప్రదేశ్‌లో 2.23 -1.62, తెలంగాణాలో 1.95 - 1.63, ఆంధ్రప్రదేశ్‌లో 1.74 - 1.62 ఉంది. రెండు తెలుగు రాష్ట్రాలు, దేశమంతటా కాషాయదళాలు చెప్పినట్లుగా హిందువులు ఎనభైశాతం ఉన్నప్పటికీ సంతానోత్పత్తి ఒకే విధంగా ఎందుకు లేదు? 2015-16 జాతీయ కుటుంబ సర్వే వివరాల ప్రకారం అత్యంత ఎక్కువ విద్యావంతులున్న జైన్ సామాజిక తరగతిలో 1.2 శాతమే. ఇంత తక్కువ ఏ సామాజిక తరగతిలోనూ లేదు. అత్యంత పేదల్లో 3.2 ఉండగా ధనికుల్లో 1.5 మాత్రమే ఉంది. ముస్లిం సామాజిక తరగతిలో సంతానోత్పత్తి రేటు ఎక్కువగా ఉండటానికి వారు ఆలస్యంగా మేలుకోవటమే. దానికి కుట్ర సిద్ధాంతాలతో విద్వేష ప్రచారం చేయటం తగనిపని. దేశంలోని కొన్ని ప్రాంతాలలో మైనారిటీలు పైచేయి సాధించటాన్ని నివారించాలంటే పెద్ద హిందూ కుటుంబాలు ఉండాలని, ఉన్నత హిందూ కుటుంబాల వారు కుటుంబనియంత్రణ గురించి తీవ్రంగా సమీక్షించుకోవాని ఆర్‌ఎస్‌ఎస్ ప్రధాన కార్యదర్శి దత్తాత్రేయ హోసబలే కేరళలోని కొచ్చిలో 2013లో జరిగిన ఒక సభలో పిలుపునిచ్చారు. కుటుంబ నియంత్రణ అన్నది హిందువులకు ఇంకేమాత్రం వ్యక్తిగత సమస్య కాదని, ఒక బిడ్డ చాలని వారు అనుకుంటే ముస్లింలు దేశాన్ని స్వాధీనం చేసుకుంటారని విశ్వహిందూ పరిషత్ నేత చంపత్ రాయ్ 2015లో ఒక పత్రికా గోష్టిలో చెప్పారు.

ఆర్‌ఎస్‌ఎస్ పెద్దలు పిల్లల్ని కనాలని చెబుతున్నారు సరే, వారి బాగోగుల గురించి శ్రద్ధ తీసుకోవాలని తమ మార్గదర్శకత్వంలో నడిచే కేంద్రం, 15 రాష్ట్ర ప్రభుత్వాలు, వారికి మద్దతుగా ఉన్న మరో ఆరు మిత్ర ప్రభుత్వాలకు ఎందుకు చెప్పటం లేదు? ఎంత సేపటికీ మతం తప్ప శిశు సంరక్షణకు కేటాయింపులు, వివిధ పథకాల వైఫల్యం గురించి మీడియాలో వస్తున్న విశ్లేషణలు వారికి పట్టవా, కనిపించవు, వినిపించవా ! మతంతో నిమిత్తం లేకుండా ఎంతమంది పిల్లలు ఉన్నా ఈ ఏడాది జనవరి నుంచి ప్రతి ఒక్క బిడ్డకు ఏడాదికి రు.44వేల చొప్పున మూడు సంవత్సరాల పాటు నగదు ఇచ్చే పథకాన్ని చైనా ప్రవేశపెట్టింది. వారి జనాభా మనతో సమానంగా ఉంది. హంగరీలో ముగ్గురు అంతకంటే ఎక్కువ పిల్లలుంటే పన్నుల రాయితీ, గృహరాయితీ, పోలాండ్‌లో రెండవ బిడ్డ తరువాత ఎందరుంటే అందరికీ నెలవారీ నగదు, రష్యాలో 25 ఏళ్ల లోపు యువతులు పిల్లలను కంటే నగదు బదిలీ, అమెరికాలో తొలిసారి తల్లులయ్యే వారికి బేబీ బోనస్ పేరుతో ఐదువేల డాలర్లు, దక్షిణ కొరియాలో కూడా రాయితీలు ఇస్తున్నారు. నేటి పిల్లలే రేపటి పౌరులు అని కబుర్లు చెప్పటం తప్ప వారి సక్రమ పెరుగుదలకు మన దేశంలో తీసుకుంటున్న చర్యలేమిటి? కార్పొరేట్ కంపెనీలకు గణనీయంగా పన్ను మొత్తాలను తగ్గించిన కేంద్ర ప్రభుత్వం మరోవైపున శిశు సంరక్షణ కేటాయింపులకు కోత పెడుతున్నది.

విశాలాంధ్ర
5
ఆదివారం
31 ఆగస్టు 2025

భరతనాట్య కళాకారిణి విదుషి దీక్ష అరుదైన రికార్డు

బెంగళూరు: కర్నాటకలోని మంగళూరుకు చెందిన భరతనాట్య కళాకారిణి విదుషి దీక్ష అరుదైన ఘనత సాధించారు. 170 గంటలకు పైగా నిరంతరాయంగా భరతనాట్యం చేసి... 'గోల్డెన్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్'లో చోటుదక్కించుకున్నారు. ఆగస్టు 21 మధ్యాహ్నం 3.30 గంటలకు నాట్యం ప్రారంభించిన దీక్ష... ఇప్పటికే 170 గంటలు పూర్తి చేయగా... మొత్తం 216 గంటల పాటు నాట్యం చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు అధికారులు తెలిపారు. శనివారం సాయంత్రంతో ఆ రికార్డును ఆమె చేరుకున్నారు. ఇటీవల కర్నాటకకు చెందిన రెమోనా 170 గంటల పాటు భరతనాట్యం చేసి గోల్డెన్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లోకి ఎక్కిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం రెమోనా రికార్డును విదుషి దీక్ష అధిగమించారు. రత్న సంజీవ కళామండలి అధ్వర్యంలో విదుషి దీక్ష భరతనాట్య ప్రదర్శన ఇచ్చినట్లు నిర్వాహకులు తెలిపారు. గోల్డెన్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ ఆసియా అధ్యక్షుడు డాక్టర్ మనీశ్ విష్ణోయ్ మాట్లాడుతూ విదుషి దీక్ష అసాధారణ ప్రతిభను, పట్టుదలను అభినందించారు. చిన్న గ్రామం, సాధారణ కుటుంబం నుంచి వచ్చినప్పటికీ పట్టుదలతో ప్రపంచ రికార్డు సాధించడం గొప్ప విషయమన్నారు.

భారత్ ఎవరికీ తలవంచదు: గోయల్

న్యూఢిల్లీ: అమెరికా సుంకాలకు భారత్ తలవంచబోదని కేంద్ర వాణిజ్యశాఖ మంత్రి పీయూష్ గోయల్ స్పష్టం చేశారు. రష్యా నుంచి చమురు కొనుగోలుచేయడాన్ని కారణంగా చూపి భారత్‌పై అమెరికా 50 శాతం సుంకాలు విధిస్తూ నిర్ణయం తీసుకుంది. ఈనెల 27 నుంచి ఈ సుంకాలు అమలవుతున్నాయి. భారత్‌పై 50 శాతం సుంకాలు విధించడంపై దేశ ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. అమెరికా ప్రతీకార సుంకాలపై పీయూష్ స్పందిస్తూ ఈ అత్యవసర పరిస్థితుల్లో తాము కొత్త మార్కెట్లను కనుగొంటామని, ఎగుమతులు పెంచడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని చెప్పారు. భారతదేశం స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందానికి సిద్ధంగా ఉందని అన్నారు. అయితే అమెరికా ఒత్తిడికి మాత్రం తలొగ్గదని స్పష్టం చేశారు. ట్రంప్ సుంకాలకు భారతదేశం వంగి దండాలు పెట్టదు... దానికి బదులుగా కొత్త మార్కెట్లపై దృష్టిసారించి దేశీయ ఎగుమతులు పెంచుతుందన్నారు. ప్రతి రంగానికి మద్దతు ఇవ్వడానికి, దేశ ఎగుమతులు పెంచడానికి కేంద్ర ప్రభుత్వం రాబోయే రోజుల్లో అనేక కొత్త ప్రకటనలు చేస్తుందని చెప్పారు.

ఇక టీటీఈ దగ్గరే టికెట్లు

న్యూఢిల్లీ: రైల్వే ప్రయాణికులకు అధికారులు శుభవార్త చెప్పారు. టికెట్ల కోసం ఇకపై రైల్వే స్టేషన్లలో క్యూలైన్లలో నిల్చోవాల్సిన అవసరం లేదు. బస్సుల్లో మాదిరిగానే రైలులోనే ఇకపై టికెట్లను తీసుకోవచ్చు. టీటీఈలు, టికెట్ తనిఖీ బృందాలు ఈ టికెట్లను జారీ చేయనున్నాయి. రైల్వే స్టేషన్లలోని టికెట్ కౌంటర్ల వద్ద రద్దీ నుంచి ఉపశమనం కలిగించేందుకు రైల్వే అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ మొబైల్ టికెటింగ్‌ను రాయ్‌పూర్ రైల్వే స్టేషన్లలో ప్రయోగాత్మకంగా ప్రారంభించారు. టీటీఈ, టికెట్ తనిఖీ బృందానికి అరచేతిలో ఇమిడి ఉండే పరికరాన్ని అందజేశారు. వాటి సాయంతో ప్రయాణికులు ఎంతమంది, ఎక్కడి నుంచి ఎక్కడికి వెళ్లాలన్న వివరాలను నమోదు చేస్తున్నారు. అనంతరం వారికి అందజేసిన ప్రింటర్ల ద్వారా టికెట్లు జారీ చేస్తున్నారు.

చొరబాట్ల స్పెషలిస్ట్ బాగూఖాన్ కాల్చివేత

జమ్ము: జమ్మూకశ్మీర్‌లోని నౌషెరా సెక్టార్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో కీలక ఉగ్రవాది హతమయ్యాడు. 100పైగా ఉగ్రవాద చొరబాట్లకు కారకుడు, మానవ జీపీఎస్‌గా పిలవబడే బాగూఖాన్‌ను కాల్చిచంపినట్లు సైనికవర్గాలు వెల్లడించాయి. మరో ఉగ్రవాదితో కలిసి బాగూఖాన్ దేశంలోకి చొరబడేందుకు యత్నిస్తుండగా ఎన్‌కౌంటర్ జరిగింది. 1995 నుంచి పాక్ ఆక్రమిత కశ్మీర్ నుంచి బాగూఖాన్ కార్యకలాపాలు నిర్వహిస్తున్నాడు. గురెజ్ సెక్టార్‌లోని వివిధ ప్రాంతాల నుంచి 100కు పైగా చొరబాట్లకు సూత్రధారిగా వ్యవహరించినట్లు తెలిపాయి. ఎలాంటి కఠిన మార్గాల్లోనైనా ఉగ్రమూకలు భారత్‌లోకి చొరబడేందుకు ఇతడు సహాయం చేసేవాడని, అందులో ఎక్కువభాగం విజయవంతమయ్యాయని వెల్లడించాయి. అతడు హిజ్బుల్ కమాండర్‌గా ఉన్నప్పటికీ... ఈ నైపుణ్యత కారణంగా అన్ని ఉగ్రసంస్థలకు అతడు కీలకంగా మారాడు. కొన్నేళ్లుగా భద్రతా బలగాల కన్నుగప్పుతున్న అతడు... ఇప్పుడు మాత్రం తప్పించుకోలేకపోయాడు. గురువారం గురెజ్ సెక్టార్ నుంచి నియంత్రణ రేఖ వెంబడి దేశంలోకి చొరబడుతోన్న ఇద్దరు ఉగ్రవాదులను భారత సైన్యం హతమార్చింది.

50 ఆయుధాలకే దిగొచ్చిన పాక్

ఎయిర్ మార్షల్ తివారీ

న్యూఢిల్లీ: పహల్గాం ఉగ్రదాడికి గట్టి బదులిస్తూ భారత బలగాలు చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌కు సంబంధించిన సరికొత్త వివరాలను ఎయిర్ స్టాఫ్ వైస్ చీఫ్ ఎయిర్ మార్షల్ నర్మదేశ్వర్ తివారీ శనివారం వెల్లడించారు. ఓ జాతీయ మీడియా సదస్సులో ఆయన మాట్లాడుతూ ఆపరేషన్ సిందూర్‌తో భారత బలగాలు అత్యంత కచ్చితత్వంతో పాక్ ఆక్రమిత కశ్మీర్, పాకిస్థాన్‌లోని లక్ష్యాలను ఛేదించాయన్నారు. దాంతో పాక్ కాళ్లబేరానికి వచ్చిందని, అందుకోసం వైమానిక దళం 50 కంటే తక్కువ ఆయుధాలనే ప్రయోగించిందని ఆయన వెల్లడించారు. 'యుద్ధం ప్రారంభించడం సులభమే. ముగించడం అంత సులువైన పని కాదు. దానిని దృష్టిలోపెట్టుకొని మన బలగాలను సంసిద్ధంగా ఉంచాం. ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనేలా మోహరింపులు చేపట్టాం' అని ఆయన వెల్లడించారు. నియంత్రణ రేఖ వెంట నాలుగు రోజులపాటు కచ్చితమైన లక్ష్యాలతో చేసిన క్షిపణి దాడులతో మే 10న పాకిస్థాన్ కాల్పుల విరమణకు దిగొచ్చిందని చెప్పారు. ఆపరేషన్‌లో హతమైన ఉగ్రవాదులకు ప్రభుత్వం అంత్యక్రియలు నిర్వహించిన దృశ్యాలతో పాటు మరికొన్ని కొత్త విజువల్స్‌ను ఆయన ప్రదర్శించారు. ఏప్రిల్ 22న జరిగిన పహల్గాం దుర్ఘటనకు ప్రతీకారం తీర్చుకునేందుకు ఏప్రిల్ 29న ఉగ్ర లక్ష్యాలను నిర్దేశించుకున్నామని, ఆపరేషన్ నిర్వహించాలనుకుంటున్న తేదీ, సమయం మే 5న నిర్ణయమైందన్నారు.

వినియోగదారులకు 'జీఎస్టీ' ఫలాలు

ప్రతిపక్ష పాలిత ఎనిమిది రాష్ట్రాల డిమాండ్

న్యూఢిల్లీ: ప్రజలు ఎక్కువగా వినియోగించే వస్తువులపై వస్తు సేవల పన్ను (జీఎస్టీ) రేటు స్లాబులకు ప్రతిపక్ష పాలిత రాష్ట్రాలు మద్దతు ప్రకటించాయి. తద్వారా వచ్చే ప్రయోజనాలను వినియోగదారులకు అందించేలా యంత్రాంగం ఉండాలని డిమాండ్ చేశాయి. ఈ మేరకు కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ శనివారం వెల్లడించారు. వచ్చే వారంలో జరగబోయే జీఎస్టీ మండలి సమావేశం కేవలం వార్తాల్లో నిలిచేందుకు జరగకూడదని అన్నారు. రేట్లలో కోతల కారణంగా ప్రభావం ఉంటుంది కాబట్టి అన్ని రాష్ట్రాలకు 2024-25 బేస్ సంవత్సరంగా పరిగణిస్తూ ఐదేళ్ల కోసం పరిహారాన్ని ఎనిమిది ప్రతిపక్ష పాలిత రాష్ట్రాలు డిమాండ్ చేసినట్లు జైరాం రమేశ్ తెలిపారు. ప్రతిపాదిత 40 శాతానికి మించితే విలాసవంతమైన ఉత్పత్తులపై అదనపు లెవీలను అన్ని రాష్ట్రాలకు ఇవ్వాలన్న డిమాండ్ కూడా ఉందన్నారు. జీఎస్టీ రేటు స్లాబులకు మద్దతిచ్చిన 8 రాష్ట్రాల్లో కర్నాటక, హిమాచల్ ప్రదేశ్, జార్ఖండ్, కేరళ, పంజాబ్, తమిళనాడు, తెలంగాణ, పశ్చిమ బెంగాల్ ఉన్నాయని ఎక్స్‌లో పేర్కొన్నారు. ఈ రాష్ట్రాల డిమాండ్లు న్యాయమైనవి, కేంద్ర ఆర్థిక శాఖ పరిధిలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఫైనాన్స్ అండ్ పాలసీ (ఎన్ఐపీఎఫ్‌పీ) బలపరిచినవిగా జైరాం రమేశ్ వెల్లడించారు. జీఎస్టీ 2.0 కోసం కాంగ్రెస్ దీర్ఘకాలంగా డిమాండ్ చేస్తోందన్నారు. తద్వారా రేటు స్లాబులు తగ్గడం, రేట్లలో కోతలు మాత్రమే కాకుండా సంబంధిత విధానం సరళమవుతుందని తెలిపారు. అలాగే సంస్థలు నిబంధనలకు కట్టుబడి నడుచుకోవడానికి, ప్రజా భద్రతను కాపాడటానికి, వ్యక్తుల హక్కులను రక్షించడానికి, నైతిక వ్యాపార పద్ధతులను పాటించడానికి వీలు కలుగుతుందని జైరాం రమేశ్ అన్నారు. తదుపరి జీఎస్టీ సమావేశం సహకార సమాఖ్య స్ఫూర్తికి కట్టుబడాలని ఆకాంక్షించారు. కాగా, జీఎస్టీ మండలి సెప్టెంబరు 3-4 తేదీల్లో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అధ్యక్షతన న్యూఢిల్లీలో భేటీ కానున్నది. ఈ సమావేశంలో రెండు పన్ను స్లాబులపై చర్చిస్తారు. దీపావళి నాటికి నిత్యావసరాలపై జీఎస్టీ తగ్గిస్తామన్న ప్రధాని ప్రకటన క్రమంలో విపక్షాలు కొన్ని డిమాండ్లు చేశాయి.

శాశ్వత మిత్రులు...శత్రువులు ఉండరు

రక్షణమంత్రి రాజ్‌నాథ్‌సింగ్



న్యూఢిల్లీ: దేశాల మధ్య శాశ్వత మిత్రత్వం, శత్రుత్వం అంటూ ఏమీ ఉండదని, అలాగే శాశ్వత మిత్రులు కానీ, శత్రువులు కాని ఉండరని రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ శనివారం చెప్పారు. కేవలం ఆ దేశానికి ఉపయోగపడే శాశ్వత ప్రయోజనాలే ఉంటాయని ఆయన వ్యాఖ్యానించారు. రక్షణరంగంలో ఆత్మనిర్భరత సాధించడం ముఖ్యమని ఓ జాతీయ మీడియా సదస్సులో వ్యాఖ్యానించారు. పహల్గాం ఉగ్రదాడి-ఆపరేషన్ సిందూర్ తదనంతర పరిణామాలు, ట్రంప్ టారిఫ్‌లు, ప్రధాని మోదీ చైనా పర్యటన నేపథ్యంలో భారత్ అనుసరిస్తోన్న వైఖరిని వెల్లడించారు. 'ప్రపంచం వేగంగా మారుతోంది. అదే సమయంలో కొత్త సవాళ్లు పుట్టుకొస్తున్నాయి. మహమ్మారులు, ఉగ్రవాదం, ప్రాంతీయ ఘర్షణలు వంటి వాటితో ఈ శతాబ్దం అత్యంత సవాలుతో కూడి ఉందని అర్థమవుతోంది. దీంతో మన వ్యూహాత్మక అవసరాల దృష్ట్యా ఆత్మనిర్భరత అనేది అత్యావశ్యకం. మనకు శాశ్వత శత్రువులు, మిత్రులు ఉండరు. శాశ్వత ప్రయోజనాలే ఉంటాయి. భారత్ ఎవరినీ శత్రువుగా పరిగణించదు. మన రైతులు, వ్యాపారవేత్తల ప్రయోజనాలే మనకు ముఖ్యం. మారుతున్న భౌగోళిక రాజకీయాల కారణంగా రక్షణపరంగా విదేశాలపై ఆధారపడటం సరైన ఎంపిక కాదని స్పష్టమవుతోంది. స్వావలంబన అనేది మన ఆర్థిక వ్యవస్థకు, భద్రతకు అత్యవసరం. 2014లో మన రక్షణ రంగం ఎగుమతుల విలువ రూ.700 కోట్లు. ఇప్పుడు రూ.24 వేల కోట్లకు చేరింది. భారత్ ఒక కొనుగోలుదారుగానే మిగలకుండా ఎగుమతిదారుగా మారుతుందని ఈ గణాంకాలు సూచిస్తున్నాయి. మన బలగాలు స్వదేశీ పరికరాలతో లక్ష్యాలపై కచ్చితత్వంతో చేసిన దాడులు... దూరదృష్టి, సమన్వయానికి నిదర్శనం. అలాంటి సన్నద్ధత లేకపోతే ఏ మిషన్ విజయవంతం కాదు' అని మంత్రి చెప్పుకొచ్చారు. 'ఆత్మనిర్భర్ భారత్' లక్ష్యం సాకారమయ్యేలా భవిష్యత్తులో భారత యుద్ధ నౌకలన్నీ స్వదేశంలో తయారవుతాయని రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు.

ఢిల్లీలో ఆలయ సేవకుడి దారుణహత్య

న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలో ప్రసాదం వివాదం కారణంగా ఒకరు హత్యకు గురయ్యారు. కొందరు దుండగులు ఆలయ సేవకుడిని అత్యంత దారుణంగా కర్రలతో కొట్టి చంపేశారు. ఇందుకు సంబంధించిన దృశ్యాలు సీసీటీవీలో నమోదయ్యాయి. ప్రముఖ కల్కాజీ ఆలయానికి కొందరు వ్యక్తులు దర్శనానికి వచ్చారు. ఆలయ సేవకుడు యోగేంద్ర సింగ్(35)ను ప్రసాదం అడిగారు. ఆయన ప్రసాదం అందజేశాడు. మరింత ఇవ్వాలని డిమాండ్ చేశారు. అందుకు యోగేంద్ర సింగ్ నిరాకరించాడు. దీంతో గొడవకు దిగారు. విచక్షణ మరిచిన గ్యాంగ్ కర్రలతో ఆలయ సేవకుడిపై దాడికి పాల్పడ్డారు. దీంతో యోగేంద్ర సింగ్ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. బాధితుడు ఉత్తరప్రదేశ్‌లోని హర్దోయ్ జిల్లా ఫట్టేపూర్ ప్రాంతానికి చెందినవాడిగా పోలీసులు గుర్తించారు. 15 సంవత్సరాలుగా కల్కాజీ ఆలయంలో సేవాదార్‌గా ఆయన పనిచేస్తున్నాడు. భక్తులకు ఆచారాలు, నైవేద్యాల విషయంలో సహాయం చేస్తుంటాడు. పోలీసులు కేసు నమోదు చేసి నిందితుల కోసం గాలిస్తున్నారు. స్థానికులు బాధితుడిని ఆస్పత్రికి తీసుకెళ్లినా ప్రయోజనం లేకుండా పోయింది. అప్పటికే మరణించినట్లుగా వైద్యులు నిర్ధారించారు. దక్షిణపురి నివాసి అయిన అతుల్ పాండే (30) అనే నిందితుడిని స్థానికులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. మిగిలిన నిందితుల కోసం గాలిస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

ఢిల్లీ ప్రజలకు రక్షణ కరువు: కేజ్రీవాల్

న్యూఢిల్లీ: ఢిల్లీలోని కల్కాజీ ఆలయంలోని సేవకుడు దారుణ హత్యకు గురికావడంపై మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ స్పందించారు. బీజేపీ ప్రభుత్వంపై ఆయన తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రాష్ట్రంలో హత్యలు జరుగుతున్నా బీజేపీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆయన మండిపడ్డారు. ఢిల్లీలో ఎవరైనా సురక్షితంగా ఉన్నారా అని కేజ్రీవాల్ ప్రశ్నించారు. ఆలయంలో సేవకుడిని హత్య చేసేముందు ఆ దుర్మార్గుల చేతులు వణకలేదా అని అన్నారు. ఇది శాంతి భద్రతల వైఫల్యం కాకపోతే మరేమటని ఆయన ఎక్స్ పోస్టులో బిజెపి ప్రభుత్వాన్ని నిలదీశారు. బీజేపీ నాలుగు ఇంజిన్లు ఢిల్లీని ఇంతటి స్థితికి తీసుకువచ్చాయి. ఇప్పుడు దేవాలయాల్లోనూ ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో ఢిల్లీలో ఎవరైనా సురక్షితంగా ఉన్నారా? లేదా అని కేజ్రీవాల్ ప్రశ్నించారు. కాగా, ఢిల్లీలో పరిస్థితి రోజురోజుకీ దిగజారుతోందని ఆప్ ఢిల్లీ అధ్యక్షుడు సౌరభ్ భరద్వాజ్ అన్నారు. రాష్ట్రంలో పోలీసులు రాజకీయ పనులతో బిజీగా ఉన్నారని, పోలీసులు చట్టాలను గౌరవించే ప్రజలను బెదిరిస్తున్నారని, దొంగలు, గూండాలు, గ్యాంగ్‌స్టర్లకు పోలీసులంటే భయం కనిపించలేదని ఆరోపించారు.

రాజ్యాంగ సవరణతో 'కోటా' పరిష్కారం

శరద్ పవార్

అహల్యానగర్ (మహారాష్ట్ర): ముంబైలో మరాఠా కోటా ఆందోళన తిరిగి ప్రారంభమైన నేపథ్యంలో మొత్తం రిజర్వేషన్లపై పరిమితి ఉన్నందున, ఈ సమస్యలను పరిష్కరించడానికి రాజ్యాంగ సవరణ అవసరమని ఎన్‌సీపీ (ఎస్‌పీ) అధ్యక్షుడు శరద్ పవార్ శనివారం తెలిపారు. 80 శాతం మంది మరాఠాలు వ్యవసాయంపై ఆధారపడి ఉన్నారని, కానీ వ్యవసాయం మాత్రమే వారి భవిష్యత్‌ను భద్రపరచలేదని, రిజర్వేషన్లను ఏకైక ఎంపికగా చేసుకుంటున్నారని ఆయన అన్నారు. రాజ్యాంగ సవరణ అవసరం గురించి తాను ఇతర ఎంపీలతో చర్చలు జరుపుతున్నానని ఇక్కడ జరిగిన ఒక కార్యక్రమంలో పవార్ అన్నారు. సుప్రీం కోర్టు రిజర్వేషన్లపై 52 శాతం పరిమితిని విధించిందని, కానీ కోర్టు తమిళనాడులో 72 శాతం కోటాను ఆమోదించిందని పవార్ ఎత్తి చూపారు. ఈ విషయంలో కేంద్రం పాత్ర పారదర్శకంగా, స్పష్టంగా ఉండాలన్నారు. సమాజంలో ఎటువంటి ద్వేషం లేకుండా చూసుకోవడానికి దేశానికి ఏకరీతి విధానం అవసరమని ఆయన అన్నారు.

రిటైర్డ్ జడ్జిల లేఖ సరికాదు: రిజిజు

బెంగుళూరు: ఉపరాష్ట్రపతిని ఎన్నుకునే ప్రక్రియలో రిటైర్డ్ హైకోర్టు న్యాయమూర్తుల ప్రమేయాన్ని కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు శనివారం ప్రశ్నించారు. వారి సంతకాల ప్రచారం, కేంద్ర హోం మంత్రి అమిత్ షాపై వ్యాఖ్యలను తప్పుపట్టారు. ఉపరాష్ట్రపతి ఎన్నిక ఒక రాజకీయ విషయమని, రిటైర్డ్ న్యాయమూర్తుల భాగస్వామ్యం వారి పదవీకాలంలో కూడా వారికి సైద్ధాంతిక మొగ్గు ఉందని అభిప్రాయాన్ని ఇస్తుందని ఆయన అన్నారు. రాజ్యాంగ అధికారులపై ఇటువంటి ప్రచారాలను ప్రారంభించడం తగదని రిజిజు వాదించారు. విధానసౌధలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ 'కొంతమంది రిటైర్డ్ న్యాయమూర్తులు హోం మంత్రికి వ్యతిరేకంగా ఏదో రాశారు. ఇది మంచిది కాదు. ఉపరాష్ట్రపతి ఎన్నిక రాజకీయ అంశం. రిటైర్డ్ న్యాయమూర్తులు ఎందుకు జోక్యం చేసుకోవాలి? వారు న్యాయమూర్తులుగా ఉన్నప్పుడు కూడా ఇటువంటి ప్రత్యేకమైన భావజాలం ఉందని ఇది ఒక అభిప్రాయాన్ని ఇస్తుంది. హోం మంత్రికి వ్యతిరేకంగా సంతకాల ప్రచారం ప్రారంభించి లేఖ రాయడం సరైనది కాదు' అని అన్నారు. న్యాయవాదుల సమావేశంలో ప్రసంగించడానికి బెంగళూరుకు వచ్చిన మంత్రి, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీపై కాంగ్రెస్ నాయకులు దుర్భాషను ఉపయోగించారని కూడా ఆరోపించారు. 'మేము ప్రజాస్వామ్య ప్రజలం, మేము గౌరవంగా మాట్లాడతాం. ప్రతిపక్ష నాయకులు... అది రాహుల్ గాంధీ అయినా లేదా మహువా మొయిత్రాతో సహా కొంతమంది ఎంపీలు అయినా దూషణకు దిగారు. ప్రధాన మంత్రిని, ఆయన తల్లిని దుర్భాషలాడడం దేశ భవిష్యత్తుకు మంచిది కాదు' అని ఆయన అన్నారు. బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ రాజ్యాంగ పరిధిలోనే ఎన్నికల్లో పోటీ చేస్తుందని, ఎన్నికల నష్టాలకు ఎన్నికల కమిషన్‌ను కాంగ్రెస్ నిందించడం వల్ల ప్రయోజనం ఏమిటి? అని అన్నారు. 30 రోజుల జైలు శిక్ష విధించినట్లయితే ప్రధాన మంత్రి, ముఖ్యమంత్రి, మంత్రులను తొలగించాలని ఆదేశించే ప్రతిపాదిత చట్టం రాజకీయ ప్రత్యర్థులను తొలగించడమే లక్ష్యంగా పెట్టుకుందనే ప్రతిపక్ష ఆరోపణలను తోసిపుచ్చిన రిజిజు... తప్పు చేయని ఎవరికైనా భారతదేశ న్యాయ వ్యవస్థ రక్షణ కల్పిస్తుందని తెలిపారు.

మహిళా జడ్జిలకు ప్రాతినిధ్యమేది?

సుప్రీం కోర్టు బార్ అసోసియేషన్

న్యూఢిల్లీ: సుప్రీం కోర్టు, హైకోర్టులలో మహిళా న్యాయమూర్తుల ప్రాతినిధ్యం తక్కువగా ఉండటంపై సుప్రీం కోర్టు బార్ అసోసియేషన్ శనివారం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది.

సుప్రీం కోర్టు, హైకోర్టులలో రాబోయే న్యాయ నియామకాల దశల్లో ఎక్కువ మంది మహిళా న్యాయమూర్తులను నియమించడంపై అత్యవసరంగా, తగిన పరిశీలన ఇవ్వాలని భారత ప్రధాన న్యాయమూర్తి, కొలీజియంను అభ్యర్థించాలని బార్ బాడీ ఆమోదించిన తీర్మానం నిర్ణయించింది. ఉత్తరాఖండ్, త్రిపుర, మేఘాలయ, మణిపూర్ వంటి అనేక హైకోర్టులలో ప్రస్తుతం మహిళా న్యాయమూర్తులు లేరని, దేశ వ్యాప్తంగా దాదాపు 1,100 మంజూరయిన హైకోర్టు న్యాయమూర్తుల పోస్టులు ఉన్నాయని, వాటిలో దాదాపు 670 మంది పురుషులు, 103 మంది మహిళలు మాత్రమే ఉన్నారని, మిగిలినవి ఖాళీగా ఉన్నాయని బార్ బాడీ పేర్కొంది.

'సుప్రీం కోర్టుకు ఇటీవల జరిగిన నియామకాల రౌండ్‌లో బార్ లేదా బెంచ్ నుంచి ఒక్క మహిళా న్యాయమూర్తి కూడా పదోన్నతి పొందకపోవడంపై సుప్రీం కోర్టు బార్ అసోసియేషన్ (ఎస్‌సీబీఏ) తీవ్ర నిరాశను వ్యక్తం చేస్తోంది. 2021 నుంచి సుప్రీం కోర్టుకు మహిళా న్యాయమూర్తిని నియమించలేదు. ప్రస్తుతం సుప్రీం కోర్టు బెంచ్‌లో ఒకే ఒక మహిళా న్యాయమూర్తి పని చేస్తున్నారు' అని తెలిపింది.

ఎన్డీయేలో సీట్ల సర్దుబాటు

జేడీయూకు 102... బీజేపీకి 101 సీట్లు

పట్నా: బీహార్‌లో ఈ ఏడాది చివరిలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. దీంతో రాష్ట్రంలో రాజకీయ సందడి నెలకొంది. తాజాగా ముఖ్యమంత్రి నితీష్ కుమార్ నేతృత్వంలో ఢిల్లీలో ఉన్నతస్థాయి చర్చల తర్వాత సీట్ల కేటాయింపును ఎన్డీయే ఖరారు చేసింది. దీనిపై త్వరలో అధికారిక ప్రకటన వెలువడనుంది. ఎన్డీఏలో కుదిరిన ఏకాభిప్రాయం ప్రకారం నితీష్ కుమార్ జనతాదళ్ (యునైటెడ్) 102 నియోజకవర్గాల్లో పోటీ చేయనుంది. బీజేపీ 101 సీట్లలో అభ్యర్థులను నిలబెట్టనుంది. చిరాగ్ పాశ్వాన్‌కు చెందిన లోక్ జనశక్తి పార్టీ (రామ్ విలాస్) 20 సీట్లలో పోటీ చేయనుంది. హిందుస్తానీ అవామ్ మోర్చా (హెచ్ఏఎం), రాష్ట్రీయ లోక్‌మోర్చా (ఆర్ఎల్ఎం) 10 సీట్లలో పోటీ చేయనున్నాయి. సీట్ల పంపకంలో ఎన్డీఏ ఒక వ్యూహాన్ని అనుసరించింది. దానిలో భాగంగా కూటమికి జేడీయూ పెద్దన్న పాత్ర పోషిస్తోంది. నితీష్ కుమార్ నాయకత్వంలోని కూటమి ఈ ఎన్నికల్లో కీలక పాత్ర పోషించనుంది. ఈసారి చిన్న పార్టీలకు కూడా తగినన్ని సీట్లు కేటాయించినట్లు బీజేపీ వర్గాలు చెబుతున్నాయి. కూటమిలో సమతుల్యతను కాపాడుకునేందుకు, ఎన్నికల్లో సత్తా చాటేందుకు ఎన్డీఏ ప్రత్యేక వ్యూహం అనుసరిస్తోంది. వాస్తవంగా లోక్ జనశక్తి పార్టీ (చిరాగ్ పాశ్వాన్) 40కి పైగా సీట్లు డిమాండ్ చేసింది. కానీ జేడీయూ ఆ పార్టీకి 20 సీట్లు కేటాయించింది. కూటమిలో ఆ పార్టీ ప్రాముఖ్యతను పరిగణనలోకి తీసుకుంది. 2020 అసెంబ్లీ ఎన్నికల్లో చిరాగ్ పాశ్వాన్ ఎన్డీఏతో పొత్తు లేకుండా 134 స్థానాల్లో పోటీ చేశారు. అయితే అతని పార్టీ ఒక స్థానంలో మాత్రమే విజయం సాధించగలిగింది. నాటి ఎన్నికల్లో చిరాగ్ వ్యూహం జేడీయూకు దాదాపు 30 స్థానాల్లో ఓటమి అందించిందనే వాదన ఉంది. ఈసారి చిరాగ్ పాశ్వాన్ ఎన్డీఏలో భాగస్వామి. కాగా, రాబోయే బీహార్ అసెంబ్లీ ఎన్నికలు నితీష్ కుమార్ నాయకత్వంలో జరగనున్నాయని ఎన్డీఏ స్పష్టం చేసింది. ఈ ఎన్నికల్లో కూటమి గెలిస్తే... ముఖ్యమంత్రి నితీష్ కుమార్ భవిష్యత్తు వ్యూహాన్ని నిర్ణయిస్తారని పార్టీ వర్గాలు సూచిస్తున్నాయి. నితీష్ కుమార్ నాయకత్వం ఎన్నికల్లో ఎన్డీఏకి బలాన్ని అందిస్తుందని కూటమిలోని సభ్యులందరూ ఏకగ్రీవంగా చెబుతున్నారు. మరోవైపు రాష్ట్రీయ జనతాదళ్ (ఆర్జేడీ), కాంగ్రెస్, వామపక్ష పార్టీలతో కూడిన మహా కూటమి కూడా తన ఎన్నికల సన్నాహాలను ముమ్మరం చేసింది. రాహుల్ గాంధీ, తేజస్వీ యాదవ్ 'ఓటర్ అధికార్ యాత్ర'తో ఓటర్ల జాబితాలో జరిగిన అవకతవకలను, స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్)కు వ్యతిరేకంగా ప్రజా అవగాహన ప్రచారం ప్రారంభించారు. ఈ ప్రచార లక్ష్యం ఓటర్లకు అవగాహన కల్పించడం, అసెంబ్లీ ఎన్నికల్లో వారు చురుకుగా పాల్గొనేలా చూడటమని కాంగ్రెస్ నేతలు చెబుతున్నారు.

ఉత్తరాదిన వరద బీభత్సం

- జమ్మూకశ్మీర్ రాంబన్‌లో వరదలు
- కొండ చరియలు విరిగిపడి 11 మంది మృతి
- ఉత్తరాఖండ్‌లోనూ తీవ్ర విధ్వంసం
- పంజాబ్‌లో ముంపుకు గురైన 100 గ్రామాలు

శ్రీనగర్/డెహ్రాడూన్/చండీగఢ్: ఉత్తర భారతదేశంలో వరద ఉత్పాతం విధ్వంసం సృష్టిస్తోంది. భారీ వర్షాలకు జమ్మూకశ్మీర్, ఉత్తరాఖండ్, హిమాచల్ ప్రదేశ్ వంటి కొండచరియల రాష్ట్రాలలో విస్తృత విధ్వంసం సృష్టించాయి. జమ్మూకశ్మీర్‌కు చెందిన రాంబన్ ప్రాంతంలో మేఘ విస్ఫోటనం కారణంగా ఆకస్మిక వరదలు సంభవించాయి. ఉత్తరాఖండ్‌లో, చమోలి జిల్లాలోని ఐదు వేర్వేరు ప్రదేశాలలో కొండచరియలు విరిగిపడి బద్రీనాథ్ జాతీయ రహదారిని దిగ్బంధించాయి. కాగా, హిమాచల్ ప్రదేశ్‌లో తీవ్రమైన వరదలు గణనీయమైన నష్టాన్ని కలిగించాయి. మనాలి ఎక్కువగా ప్రభావితమైన ప్రాంతం. బియాస్ నది ఉగ్ర ప్రవాహం వల్ల ప్రసిద్ధి చెందిన షేర్ పంజాబ్ ధాబా దాదాపు పూర్తిగా కొట్టుకుపోయిందని, దాని ముందు భాగం మాత్రమే ప్రమాదకరంగా ఉందని సమాచారం. ఫలితంగా కనీసం 11 మంది మరణించగా, ఒక వ్యక్తి గల్లంతయ్యాడు. అనేక ఇళ్లు దెబ్బతినగా... కొన్ని చోట్ల వరద ధాటికి కొట్టుకుపోయాయి.

రియాసిలో కొండచరియల విధ్వంసం

జమ్మూకశ్మీర్‌లో శనివారం జరిగిన రెండు వేర్వేరు వాతావరణ సంబంధిత విషాద సంఘటనలలో కనీసం 11 మంది ప్రాణాలు కోల్పోయారు. రాంబన్ జిల్లాలో మేఘ విస్ఫోటనం సంభవించింది. రియాసిలో కొండచరియలు విరిగిపడిన ఇల్లు నేలమట్టమైందని అధికారులు తెలిపారు. రాంబన్‌లోని పర్వత రాజ్‌గఢ్ ప్రాంతంలో, శుక్రవారం రాత్రి 11.30 గంటల ప్రాంతంలో సంభవించిన మేఘవిస్ఫోటనం కారణంగా ఆకస్మిక వరదలు సంభవించాయి. దీంతో ద్రుబ్లా-గుడ్‌గ్రామ్ గ్రామంలోకి వరదలు వచ్చాయి. దీంతో నివాస గృహాలు, ఒక గోశాల, ఒక పాఠశాల భవనం దెబ్బతిన్నాయి. 'స్థానిక స్వచ్ఛంద సేవకులు, పోలీసులు, ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాలు తీవ్రంగా శోధించిన తర్వాత శిథిలాల కింద నుంచి నలుగురి మృతదేహాలను వెలికితీశారు' అని రాంబన్ డిప్యూటీ కమిషనర్ మహ్మద్ అలియాస్ ఖాన్ పీటీఐకి చెప్పారు. మృతులను అశ్వని శర్మ (24), అతని సోదరుడు ద్వారకా నాథ్ (55), మేనకోడలు విర్తా దేవి (26), వారి అతిథి, రాజ్‌గఢ్‌లోని బన్హారా నివాసి ఓం రాజ్ (38) గా గుర్తించారు. శర్మ వదిన బిద్యా దేవి (55) కోసం సహాయక బృందాలు వెతుకుతున్నాయి. అలాగే రియాసిలోని మహోర్ ప్రాంతానికి చెందిన బద్దర్ గ్రామంలోని నజీర్ అహ్మద్ (38) ఇంటిని కొండచరియలు విరిగి పడటంతో విషాదం సంభవించింది. అహ్మద్, అతని భార్య వజీరా బేగం (35), వారి ఐదుగురు పిల్లలు బిలాల్ అహ్మద్ (13), మొహమ్మద్ ముస్తఫా (11), మొహమ్మద్ ఆదిల్ (8), మొహమ్మద్ ముబారక్ (6), మొహమ్మద్ వసీం (5) నిద్రిస్తున్నప్పుడు మరణించారు. స్థానికులు, పోలీసులు తరువాత ఏడు మృతదేహాలను శిథిలాల నుంచి వెలికితీశారు. జమ్మూకశ్మీర్‌లో గత పక్షం రోజుల్లో వర్ష సంబంధిత విపత్తుల్లో 160 మందికి పైగా మరణించారు. వీరిలో మచైల్ మాతా యాత్ర సందర్భంగా కిష్త్వార్‌లోని చిషోటి గ్రామంలో 65 మంది యాత్రికులు, కత్రాలోని వైష్ణో దేవి మందిరం సమీపంలో జరిగిన ఘటనలో 30 మంది ఉన్నారు. అలాగే మౌలిక సదుపాయాలకు భారీ నష్టం వాటిల్లింది. శ్రీనగర్-జమ్మూ జాతీయ రహదారిని అనేక పాయింట్ల వద్ద బ్లాక్ చేశారు. కత్రాకు రైలు సర్వీసులను వరుసగా ఐదవ రోజూ నిలిపివేశారు. కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్, లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా, ముఖ్యమంత్రి అబ్దుల్లా విచారం వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాలకు అన్ని విధాలుగా సహాయం చేస్తామని హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా పరిస్థితిని సమీక్షిస్తూ, విధ్వంసం స్థాయిపై ఆందోళన వ్యక్తం చేశారు. 'నాలుగు రోజులు వర్షం పడి ఉంటే, మన పరిస్థితి 2014లో ఉన్నట్లుగానే ఉండేది. మనం భయంతో జీవించడం కొనసాగించలేము. అందువల్ల మనం అంచనా వేసుకోవాలి' అని ఆయన పీటీఐతో అన్నారు. ఇదిలాఉండగా, కత్రా మందిరం సమీపంలో ఇటీవల జరిగిన కొండచరియల మరణాలపై ప్రభుత్వం దర్యాప్తు జరుపుతామని ప్రకటించింది.

వరద ముంపులో పంజాబ్ గ్రామాలు

పంజాబ్‌లో వరదలు బీభత్సం సృష్టిస్తున్నాయి. సట్లెజ్ నది వరదల కారణంగా జిల్లాలోని దాదాపు 100 గ్రామాలు తీవ్రంగా ప్రభావితమయ్యాయని, జిల్లా యంత్రాంగం, సైన్యం, సరిహద్దు భద్రతా దళం (బీఎస్ఎఫ్), జాతీయ విపత్తు ప్రతిస్పందన దళం (ఎన్‌డీఆర్ఎఫ్), పంజాబ్ పోలీసులు 24 గంటలూ సహాయ చర్యలు చేపడుతున్నారని డిప్యూటీ కమిషనర్ దీపికా శర్మ తెలిపారు. 'జిల్లా అంతటా సహాయ శిబిరాలను ఏర్పాటు చేశాము. ప్రస్తుతం దాదాపు 350 మందికి ఆహారం, నిత్యావసర సామాగ్రిని అందిస్తున్నారు. దాదాపు 3 వేల కుటుంబాలకు రేషన్ అందించాం' అని ఆమె తెలిపారు. 'వరద ముంపు ప్రాంతాల్లో చిక్కుకున్న నివాసితులను తరలించడానికి ఎన్‌డీఆర్ఎఫ్, సైన్యం, బీఎస్ఎఫ్ సహాయక బృందాలు పడవలు, ఇతర వనరులను ఉపయోగిస్తున్నాయి' అని చెప్పారు. రుక్నే వాలా గ్రామంలో వరద ఇళ్లను చుట్టుముట్టడంతో చిక్కుకున్న దాదాపు 100 మందిని రక్షించడానికి ఐదు పడవలను మోహరించారు. ఒక గర్భిణిని పడవ ద్వారా రక్షించి... తక్షణ వైద్య సహాయం అందించారని డిప్యూటీ కమిషనర్ తెలిపారు. హిమాచల్ ప్రదేశ్, జమ్మూకశ్మీర్‌లోని వాటి పరివాహక ప్రాంతాలలో భారీ వర్షాలు కురుస్తున్నందున సట్లెజ్, బియాస్, రావి నదులు పొంగిపొర్లుతున్నందున పంజాబ్‌లోని అనేక జిల్లాల్లోని గ్రామాలు భారీ వరదల ముప్పులో ఉన్నాయి.

విశాలాంధ్ర హైదరాబాద్

మాదకద్రవ్య రహిత భారతదేశ ప్రచారంలో ప్రతిఒక్కరు భాగస్వాములు కావాలి

కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి

విశాలాంధ్ర - హైదరాబాద్ : భారత దేశాన్ని మాదకద్రవ్య రహితంగా మార్చడానికి ప్రతియొక్కరు దృఢమైన నిర్ణయం తీసుకొని భాగస్వాములు కావాలని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి పిలుపునిచ్చారు. నాషా ముక్త్ భారత్ అభియాన్ కింద ఐక్యమై, సమాజం, కుటుంబం, స్నేహితులు మాత్రమే కాకుండా మనమందరం మాదకద్రవ్య రహితంగా ఉంటామని ప్రతిజ్ఞ చేయాలనీ, ఎందుకంటే మార్పు మనతోనే ప్రారంభం కావాలన్నారు. హైదరాబాద్, ఉస్మానియా యూనివర్సిటీ, పీజీఆర్ఆర్‌సీడీఈ హాల్‌లో శనివారం ఓయూ, కాలేజ్ ఆఫ్ లా విజన్ 2047 పిఎఫ్ లు సంయుక్తంగా "భారతదేశంలో మాదకద్రవ్య దుర్వినియోగాన్ని ఎదుర్కోవడం, చట్టపరమైన, విధాన దృక్పథాలు" అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు విజన్ 2047 పిఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ జి. హరిచరణ్ అధ్యక్షత వహించగా కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ మాదకద్రవ్యాల దుర్వినియోగం వ్యక్తి, వారి కుటుంబం, సమాజం, దేశంపై ప్రభావం చూపుతుందని, మాదక ద్రవ్యాలపై ఆధారపడిన పదార్థాల డిమాండ్‌ను నివారించాల్సిన అవసరం ఉందని, కేంద్ర ప్రభుత్వం మాదకద్రవ్యాల కట్టడికి తీవ్రంగా ప్రయత్నిస్తుందని చెప్పారు. 2047 నాటికి మాదకద్రవ్య రహిత దేశాన్ని సాధించడానికి దేశ పౌరులందరూ కృషి చేయాలన్నారు. డాక్టర్ జి. హరిచరణ్ మాట్లాడుతూ యువత ఏ దేశానికైనా శక్తి అని, యువత శక్తి సమాజం, దేశం అభివృద్ధిలో ముఖ్యమైన సహకారాన్ని కలిగి ఉంటుందని, ఈ సదస్సు యువతకు అవగాహన కల్పించడం, మాదకద్రవ్య దుర్వినియోగం దాని ఆరోగ్య ప్రభావాలు, చట్టపరమైన అంశాలు, శాంతిభద్రతల సమస్యల గురించి అవగాహన కల్పించడం కోసం ఉద్దేశించబడిందని తెలిపారు. ఈ సదస్సులో ఓయూ కాలేజ్ ఆఫ్ లా ప్రిన్సిపల్ ప్రొఫెసర్ రాంప్రసాద్, ప్రొఫెసర్ రత్నాకర్ రావు, ప్రొఫెసర్ ఎన్ వెంకటేశ్వర్లు, విజన్ 2047 పిఎఫ్ కోశాధికారి రాజేందర్ నల్లరి రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల నియంత్రణకు పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలి

విశాలాంధ్ర - హైదరాబాద్ : ఇటీవల కురుస్తున్న వర్షాలకు సీజనల్ వ్యాధులు వ్యాపిస్తున్న నేపథ్యంలో అన్ని మున్సిపాలిటీలు, గ్రామాలలో కీటక జనిత డెంగీ, మలేరియా, చికున్ గున్యా వంటి వ్యాధుల నియంత్రణకై పారిశుధ్య చర్యలు విస్తృతంగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలకు, వైద్యాధికారులను ఆదేశించారు. జిల్లాలో డెంగీ కేసులు ప్రబలే హాట్స్పాట్లను గుర్తించి డెంగీ, మలేరియా, చికున్ గున్యా నివారణకు వైద్య ఆరోగ్య శాఖ, మున్సిపల్, పంచాయితీ అధికారులు సమన్వయంతో విస్తృతంగా పారిశుద్ధ్య చర్యలు, ఫాగింగ్, రెసిడ్యుయల్ స్ప్రే చేపట్టి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఖాళీ స్థలాల యజమానులకు చెత్త తొలగించాలని, ఒక వేళ శుభ్రం చేయకుంటే నోటీసులు జారీ చేసి జరిమానాలు విధించాలని మున్సిపల్ కమిషనర్లు, పంచాయితీ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఆశా వర్కర్లు ప్రతి రోజు 50 ఇండ్లను సందర్శించి జ్వర సర్వే, యాంటీ లార్వా ఆపరేషన్ చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సెప్టెంబరు వరకు ప్రతి ఇంటిని నాలుగుసార్లు సందర్శించాలన్నారు. మున్సిపాలిటీల్లో స్వచ్ఛ ఆటోలు ద్వారా, గ్రామాలలో పంచాయితీల కార్యదర్శులు ట్రాక్టర్ల ద్వారా ఆడియో క్లిప్ ప్లే చేసి కీటక జనిత వ్యాధుల నివారణ, పారిశుద్ధ్యంపై ప్రత్యేకంగా అవగాహన కల్పించాలని కలెక్టర్ తెలిపారు. ప్రతి శుక్రవారం డ్రైడే రోజున ఉదయం 10 గంటలకు ప్రతి ఇంటిని పరిశుభ్రం చేసుకోవాలని, దోమలు వృద్ధి చెందకుండా చెత్త, నీరు నిల్వకుండా చూసుకోవడంతో పాటు కూలర్లు, కొబ్బరి చిప్పలు, కుండీలను ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలని కలెక్టర్ ప్రజలకు సూచించారు.

ఘనంగా చంద్రశేఖర్ గౌడ్‌కు సన్మానం

విశాలాంధ్ర - హైదరాబాద్ : పదవి విరమణ సందర్భంగా అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ కే.చంద్రశేఖర్ గౌడ్‌ను జిల్లా నాలుగో తరగతి ఉద్యోగుల అధ్యక్షులు వి.సత్యనారాయణ, సభ్యులు ప్రవీణ్ కుమార్, శ్రీధర్, విశ్వనాథ్ పదవి విరమణ శుభాకాంక్షలు తెలిపి శాలువాలతో ఘనంగా సన్మానించారు. చేసేట ప్రతిచోట కూడా ప్రజల నుంచి మంచి మన్ననలు పొందారని ఈ సందర్భంగా అధ్యక్షులు వారి సేవలను కొనియాడారు.

వినాయక మండపాల్లో కార్పొరేటర్ హమీద్ పూజలు

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి : వినాయక చతుర్థి నవరాత్రుల పండుగ సందర్భంగా కొండాపూర్ డివిజన్ పరిధిలోని శ్రీరాంనగర్ కాలనీ ఏ బ్లాక్, గోపాల్ రెడ్డి నగర్, ఓయూ కాలనీ, రాజా రాజేశ్వరి నగర్‌లోని పార్క్ అవెన్యూ కాలనీలలో పలు గణేష్ మండపాలకు కొండాపూర్ డివిజన్ కార్పొరేటర్ హమీద్ పటేల్ హాజరై, ప్రత్యేక పూజలు చేసి, భక్తులకు అన్న ప్రసాద వితరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆ గణనాథుడు ప్రజలందరినీ చల్లగా చూడాలని, ప్రతి ఒక్కరు అనుకున్న పనిలో విజయం సాధించాలని, అందరికీ ఆ విఘ్నేశ్వరుని ఆశీర్వాదాలు కలగాలని ఆకాంక్షించారు. ప్రతి ఒక్కరికి కూడా వినాయక చతుర్థి నవరాత్రుల పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ హమీద్ పటేల్‌తో పాటు సీనియర్ జర్నలిస్ట్ శేఖర్ సాగర్, కొండాపూర్ డివిజన్ సీనియర్ నాయకులు జే. బలరాం యాదవ్, రమేష్ యాదవ్, టీ.వెంకటేష్, మొహ్మద్, నాగరాజు, అశోక్, శ్రీనివాస్, అవదీష్ నారాయణ, హనుమంత్ రెడ్డి, నరసింహ రెడ్డి, యాదిరెడ్డి, గడ్డం ప్రశాంత్, ప్రవీణ్, రిటైర్డ్ జడ్జి గోవింద్ రెడ్డి, రజనీకాంత్, శివారెడ్డి, శ్రీకాంత్, జీ. వెంకటేష్, భక్తులు, ప్రజలు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఉరితాడుగా మారిన చట్టం

42శాతం బీసీ రిజర్వేషన్‌పై కాంగ్రెస్ కట్టుబడి ఉంది : మంత్రులు

విశాలాంధ్ర - హైదరాబాద్ : గత ప్రభుత్వం అనాలోచితంగా 2018లో తెచ్చిన చట్టం నేడు ఉరితాడుగా మారిందని రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాసరెడ్డిలు అన్నారు. 2018 పంచాయతీ రాజ్ చట్టం, 2019లో మున్సిపల్ యాక్ట్ 50 శాతం సీలింగ్ ఎత్తివేయడానికి ఆర్డినెన్స్ తెచ్చామని చెప్పారు. ఆర్డినెన్స్ పై సభ లో పెట్టి అన్ని రాజకీయ పార్టీల ఒపీనియన్ తీసుకుంటామని, ఆర్డినెన్స్ పై చర్చిస్తామని, దీనికి అన్ని రాజకీయ పార్టీలు, ప్రజలు సహకరించాలని కోరారు. శనివారం మంత్రివర్గ భేటీ తరువాత రాష్ట్ర సచివాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో వారు మాట్లాడుతూ బీసీ లకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని మా ప్రభుత్వం చిత్తశుద్ధిగా పని చేస్తుందన్నారు. కామారెడ్డి డిక్లరేషన్ నుండి ఇంటింటా సర్వే చేసి సబ్ కమిటీ ఏర్పాటు చేసి కేబినెట్ ఆమోదం చేసుకొని శాసన సభలో చర్చించి అన్ని రాజకీయ పార్టీల ఆమోదంతో గవర్నర్ ద్వారా రాష్ట్రపతి దగ్గరకు వెళ్ళిందన్నారు. ఇప్పటికే ఎన్నికల త్వరగా ముగించాలని సెప్టెంబర్ 30 లోపు ఎన్నికలు పూర్తి చేయాలని కోర్టు సూచిస్తుందని గుర్తు చేశారు. ఇటీవల బీసీ లకు 42 శాతం రిజర్వేషన్ల పై డిప్యూటీ సీఎం ఆధ్వర్యంలో సబ్ కమిటీ న్యాయ కోవిదులతో చర్చించామన్నారు. బీసీలకు 42 శాతానికి స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని కేబినెట్ నిర్ణయం తీసుకుందని అన్నారు. ఎస్సీ, ఎస్టీ జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు ఉంటాయని, బలహీన వర్గాలకు 42 శాతం రిజర్వేషన్లపై ముందుకు పోవడానికి కేబినెట్ నిర్ణయం తీసుకున్న ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, సహచర మంత్రులు పీసీసీ అధ్యక్షుడు కి ధన్యవాదాలు తెలిపారు. బలహీన వర్గాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని, న్యాయ కోవిదులు నిపుణులతో చర్చించిన తరువాతనే 42 శాతం రిజర్వేషన్ల పై ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. బీసీ లకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించడానికి చట్టంను క్షుణ్ణంగా పరిశీలించిన తరువాతనే ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని స్పష్టం చేశారు.

జర్నలిస్టు వృత్తి ఎంతో బాధ్యతాయుతమైనది

విశాలాంధ్ర - హైదరాబాద్ : జర్నలిస్టు వృత్తి సమాజంలో ఎంతో బాధ్యతయుతమైనదని, ప్రజల సమస్యలను పరిష్కరింప చేయడంలో వారి పాత్ర ఎంతో కీలకమని, అలాంటి జర్నలిస్టులు ప్రజలకు సేవ చేయాలంటే ఆరోగ్యం ముఖ్యమని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ తెలిపారు. యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ (ఐజేయూ) ఆధ్వర్యంలో నారాయణపేట లైన్స్ క్లబ్, హైదరాబాద్ మలక్ పేట్ యశోద హాస్పిటల్, శ్రీ నేత్రా సనత్ నగర్ వారి సహకారంతో జిల్లా కేంద్రంలోని ఎస్.ఆర్. గార్డెన్‌లో శనివారం జర్నలిస్టులు, వారి కుటుంబ సభ్యులకు ఉచిత మెగా వైద్య ఆరోగ్య శిబిరాన్ని ఏర్పాటు చేయగా ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్, జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నలుగురు వైద్య నిపుణులతో కూడిన 12 మంది మలక్ పేట్ యశోద ఆస్పత్రి వైద్య బృందం ఇక్కడికి వచ్చి జర్నలిస్టులకు, వారి కుటుంబీకులకు వైద్య పరీక్షలు నిర్వహించడం సంతోషకరమైన విషయమని, ఇదో అద్భుత కార్యక్రమమని ఐజేయూ యూనియన్ సభ్యులను ఆమె అభినందించారు. జర్నలిజం అనేది ఒత్తిడి తో కూడుకున్న వృత్తి అని, వార్తా సేకరణలో నిమగ్నమై సమయానికి తినకుండా జర్నలిస్టులు పని చేస్తారని, ఇలాంటి శిబిరాల సమయంలో వారు ఆరోగ్య పరీక్షలు చేసుకోవాలని ఆమె సూచించారు. ఫోర్త్ ఎస్టేట్‌లో (శాసన సభ, కార్య నిర్వాహక శాఖ, న్యాయ వ్యవస్థ) మీడియా నాలుగవది అని ఆమె గుర్తు చేశారు. జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ మాట్లాడుతూ జర్నలిజం అనేది చాలా బాధ్యతతో చేసే పని అన్నారు. ఒత్తిడితో కూడిన ఈ వృత్తిలో ఆహారపు అలవాట్లు, దినచర్య అలవర్చుకోవాలని కోరారు. ఈ ఉచిత వైద్య శిబిరంలో జర్నలిస్టులతో పాటు వారి కుటుంబీకులు పరీక్షలు చేసుకోవడం శుభ పరిణామం అని పేర్కొన్నారు. యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఐజేయూ సభ్యులు, లయన్స్ క్లబ్ సభ్యులు, యశోద ఆసుపత్రి వైద్య సిబ్బందిని ఈ సందర్భంగా ఎస్పీ అభినందించారు. కార్యక్రమంలో వర్కింగ్ జర్నలిస్ట్ ఐ జే యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మధు గౌడ్ మాట్లాడుతూ.. ఒకప్పటి జర్నలిజానికి, నేటి జర్నలిజానికి చాలా మార్పు వచ్చిందని, పోటీ తత్వం పెరిగిందని తెలిపారు. జర్నలిస్టులు ఉచిత సేవ చేస్తూ తమ ఆరోగ్యాన్ని పట్టించుకోకుండా కేవలం పేరు కోసం వార్తలు ఇస్తుంటారని తెలిపారు. ఇదో పవిత్రమైన వృత్తి అని, జర్నలిస్టుల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాసరెడ్డి, తమ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు విరహత్ అలీ సూచన మేరకు నారాయణపేటలో యూనియన్ ఆధ్వర్యంలో ఈ ఉచిత ఆరోగ్య శిబిరాన్ని నిర్వహిస్తున్నామని చెప్పారు. జిల్లా పౌర సంబంధాల శాఖ అధికారి ఎంఏ రషీద్, టి యు డబ్ల్యు జే ఐజే యూ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కోయిలకొండ నారాయణరెడ్డి, శివశంకర్, యూనియన్ వైద్య విభాగ కన్వీనర్ గద్వాల సంజీవ్ కుమార్, సభ్యులు నక్క శ్రీనివాస్, గణప రఘు, రాజేష్ కుమార్, సులిగం సురేష్ కుమార్ తో పాటు యూనియన్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

గ్రేటర్ పరిధిలో చైల్డ్ రైట్స్ కమిషన్ ఆకస్మిక తనిఖీలు

విశాలాంధ్ర - హైదరాబాద్ : గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో మధ్యాహ్న భోజనం సరఫరా చేసే మన ట్రస్ట్‌ను చైల్డ్ రైట్స్ కమిషన్ ఆకస్మికంగా తనిఖీ చేసింది. మన ట్రస్ట్ ఆధ్వర్యంలో గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో దాదాపు 970కు పైగా ప్రభుత్వ పాఠశాలలకు మధ్యాహ్న భోజనం సరఫరా చేస్తున్నారు. కమిషన్ ప్రధానంగా ఆహారం తయారీ, వంటగది మరియు దాని పరిసరాలు పరిశుభ్రంగా ఉన్నాయా లేకపోతే అన్నదానిపై తనిఖీ చేసింది. అలాగే, వంట పాత్రలు ఎలా కడుకుతున్నారో, రైస్ స్టోరేజ్ మరియు సరుకుల స్టోరేజ్‌ను ప్రాపర్‌గా నిర్వహిస్తున్నారో లేదా అన్నదీ తనిఖీ చేశారు. రికార్డులు ప్రతిరోజూ నిర్వహించబడుతున్నాయా లేదా అన్న అంశం కూడా పరిశీలించారు. మిగిలిపోయిన ఆహారాన్ని ట్రాక్ చేయడం ఎలా జరుగుతోందో, పెస్ట్ కంట్రోల్ ఎన్ని రోజులకో ఒకసారి జరుగుతుందో, ఆహారం రవాణా ఎలా జరుగుతుందో, ఆహారం పెట్టె పాత్రల శుభ్రత ఏమిటి అనే అంశాలను కూడా తనిఖీ చేశారు. అలాగే, అక్కడ పనిచేస్తున్న ఉద్యోగుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆహారం ఉండే ప్రదేశాలు, ఆహారాన్ని వాహనాల్లో ఎక్కించేటప్పుడు వ్యక్తిగత శుభ్రత పాటిస్తున్నారా లేదా అన్న అంశం కూడా పరిశీలించబడింది. సరుకుల నిల్వ చేసే గోదాములు శుభ్రంగా ఉన్నాయా లేదా, సరుకుల క్వాలిటీ పరిశీలన కూడా జరిగింది. వంటకు ఉపయోగించే నీరు శుద్ధి చేసినదా, ఆర్వో లేదా బోరువెల్ నీరు వాడుతున్నామా అన్నది కూడా తనిఖీ చేశారు. తాజా కూరగాయలు వాడుతున్నారా లేదా, అలాగే కూరగాయలను యంత్రాల ద్వారా కట్ చేస్తున్నారా అన్నది కూడా పరిశీలించారు. మన ట్రస్ట్‌ను పరిశీలించిన కమిషన్, అక్కడ పూర్తిగా పరిశుభ్రమైన వాతావరణంలో ఆహారం ఉండడం లేదని, ప్రాపర్ రికార్డులు నిర్వహించడం లేదని, మైనర్ బాలలను పనికి నియమించుకు న్నారని తెలిపారు. దీనిపై సంబంధిత అధికారులను పిలిచి మాట్లాడతామని కమిషన్ తెలియజేసింది. చైల్డ్ రైట్స్ కమిషన్ సభ్యులు వచన్ కుమార్, వందన గౌడ్, చందన, అపర్ణ, సరిత, ప్రేమలత అగర్వాల్ పాల్గొన్నారు.

లాలాగూడ సెంట్రల్ రైల్వే హాస్పిటల్ డైరెక్టర్ జనరల్ తనిఖీ

విశాలాంధ్ర - హైదరాబాద్ : డిజి (ఐఆర్‌హెచ్ఎస్) 2డి ఎకో, ఆక్సిజన్ మ్యాని ఫోల్డ్ రూమ్ సౌకర్యాన్ని ప్రారంభించారు. రైల్వే బోర్డు, ఇండియన్ రైల్వే హెల్త్ సర్వీసెస్ (ఐఆర్‌హెచ్ఎస్) డైరెక్టర్ జనరల్ డాక్టర్ జగదీష్ చంద్ర శనివారం సికింద్రాబాద్‌లోని లాలా గూడలోని సెంట్రల్ రైల్వే హాస్పిటల్‌లో నూతన సౌకర్యాలను తనిఖీ చేసి ప్రారంభించారు. దక్షిణ మధ్య రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ నిర్మలా రాజారాం లాలా గూడ సెంట్రల్ హాస్పిటల్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ ఐ.శివనాగ ప్రసాద్, సీనియర్ వైద్యులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. డాక్టర్ జగదీష్ చంద్ర అధునాతన 2డి ఎకో మెషినరీ, ఆక్సిజన్ ప్లాంట్ మ్యాని ఫోల్డ్ రూమ్, పునరుద్ధరించిన ఫిజియోథెరపీ రూమ్, డెడికేటెడ్ కార్పొరేట్ బిల్లింగ్ సెక్షన్ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఇది ప్రస్తుతం సర్వీసులోనున్న పదవీ విరమణ చేసిన ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులకు ఎంతో ప్రయోజనం చేకూరుస్తుంది. కొత్త ఓ.పి.డి బ్లాక్ గ్రౌండ్ ఫ్లోర్‌లో పునరుద్ధరించబడిన ఫిజియోథెరపీ సెంటర్ ప్రారంభోత్సవం రైల్వే లబ్ధిదారులకు వివిధ వ్యాధులకు సంబంధించిన ఆధునిక మెరుగైన ఫిజియోథెరపీ సేవలను అందించడంలో సహాయపడుతుంది. డాక్టర్ జగదీష్ చంద్ర వైద్యులను ఉద్దేశించి మాట్లాడుతూ, సేవలందిస్తున్న / పదవీ విరమణ చేసిన ఉద్యోగులు వారిపై ఆధారపడిన కుటుంబ సభ్యులకు ఎంతో ప్రయోజనం చేకూర్చే సౌకర్యాలను అభివృద్ధి చేసినందుకు వైద్య శాఖను ప్రశంసించారు. ఈ అధునాతన రోగనిర్ధారణ సౌకర్యాలు సేవలు చాలా ఉపయోగకరంగా సౌకర్యవంతంగా ఉంటాయని ఆయన పేర్కొన్నారు. ప్రాణాలను రక్షించే వైద్య అవసరాన్ని తీర్చే ఆసుపత్రి ప్రాంగణంలో ఆక్సిజన్ ప్లాంట్‌ను అభివృద్ధి చేసేందుకు తీసుకున్న చొరవకు వైద్య బృందాన్ని ఆయన అభినందించారు.

తప్పు చేయకుంటే మామా, అల్లుడికి భయమెందుకు...

విశాలాంధ్ర - హైదరాబాద్ : కాళేశ్వరం విషయంలో ఎలాంటి తప్పు జరగనప్పుడు మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్ రావు ఎందుకు బయపడుతున్నారో అర్థం కావడం లేదని ఎమ్మెల్సీ డాక్టర్ బల్మూర్ వెంకట్ అన్నారు. అసెంబ్లీ మీడియా పాయింట్ లో మాట్లాడిన బల్మూర్ వెంకట్ బీఆర్ఎస్ నేతల తీరును తప్పు పట్టారు. 2016లో అసెంబ్లీలో ఆనాటి సీఎం కేసీఆర్ ప్రాజెక్టులపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారని, అదే సమయంలో సీఎల్పీ నేత పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇస్తామంటే అనుమతి ఇవ్వలేదని గుర్తు చేశారు. అసెంబ్లీలో అనుమతి ఇవ్వకుంటే ప్రజలకు వాస్తవాలు చెప్పేందుకు ఆనాడు రావి నారాయణ రెడ్డి ఆడిటోరియంలో ఈనాటి బీఆర్ఎస్ ఎమ్మెల్సీ, ఆనాడు కాంగ్రెస్ నేత దాసోజు శ్రవణ్ పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. గతంలో చేసింది మరచిపోయి...ఇప్పుడు బీఆర్ఎస్ నేతలు అసెంబ్లీలో తమకు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇవ్వడానికి అనుమతివ్వాలని స్పీకర్ ను కోరడం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. కాళేశ్వరంపై వాస్తవాలను ప్రజలకు చెప్పేందుకు ఈ అసెంబ్లీ సమావేశాలు నిర్వహిస్తున్నాము, కమిషన్ రిపోర్టుపై కేసీఆర్, హరీశ్ రావు భయపడుతున్నారు.

అందుకే అడ్డుకునేందుకు హైకోర్టును ఆశ్రయించారు. ఏ తప్పు చేయనప్పుడు కోర్టుకు వెళ్లాల్సిన అవసరం ఎందుకో చెప్పాలన్నారు. ప్రధాన ప్రతిపక్ష నేతగా చట్టసభకు వచ్చి చేసిన తప్పులను ఒప్పుకుని తెలంగాణ ప్రజలను కేసీఆర్, బీఆర్ఎస్ నేతలు క్షమాపణ కోరాలని ఎమ్మెల్సీ బల్మూర్ వెంకట్ డిమాండ్ చేశారు. కనీసం సొంత పార్టీ ఎమ్మెల్యే చనిపోతే కూడా కేసీఆర్ సభకు వచ్చి సంతాపం తెలపలేదని విమర్శించారు.

ఒకటవ తరగతి ప్రవేశంకై ఫైనల్ ఎంపిక

విశాలాంధ్ర - హైదరాబాద్ : కమిషనర్ గిరిజన సంక్షేమ శాఖ గిరిజన విద్యార్థుల కొరకు 2025-26 విద్యా సంవత్సరమునకు హైదరాబాదు పబ్లిక్ స్కూల్ బేగంపేట్, రామంతపూర్ పబ్లిక్ స్కూల్‌లో 1వ తరగతి ప్రవేశముల కోసం జిల్లా స్థాయిలో ఎంపికైన విద్యార్థిని, విద్యార్థులందరికి రాష్ట్ర స్థాయిలో లాటరీ విధానం ద్వారా అభ్యర్థులను ఫైనల్ ఎంపిక చేయబడునని జిల్లా గిరిజన సంక్షేమ అధికారి కోటాజి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ లాటరీ విధానం హైదరాబాద్ కలెక్టర్ ఆధ్వర్యంలో తేది 1 సెప్టెంబర్ సోమవారం మధ్యాహ్నం 2.30 గంటలకు నిర్వహించబడునని తెలిపారు.

జిల్లా స్థాయిలో ఎంపికైన విద్యార్థిని, విద్యార్థులు రాష్ట్ర స్థాయి లాటరీ కార్యక్రమంనకు హైదరాబాద్ కలెక్టరేట్‌కి తప్పక హాజరుకాగలని ఒక ప్రకటనలో తెలిపారు.

ఉర్దూ జర్నలిస్టులకు ప్రభుత్వం నుండి వంద కంప్యూటర్లు : మంత్రి

విశాలాంధ్ర - హైదరాబాద్ : ఉర్దూ జర్నలిస్టులకు ప్రభుత్వం నుండి 100 కంప్యూటర్లు సమకూర్చడానికి, వెనుకబడిన తరగతులు మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అంగీకరించారని ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హమ్దన్ తెలిపారు. తెలంగాణ మీడియా అకాడమీ హైదరాబాదులో నిర్వహిస్తున్న ఉర్దూ జర్నలిస్టుల పునఃచరణ తరగతుల ప్రారంభ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మీడియా అకాడమీ చైర్మన్ కే.శ్రీనివాస్ రెడ్డి మార్గదర్శకత్వంలో రాష్ట్ర జర్నలిస్టులకు ముఖ్యంగా ఉర్దూ జర్నలిస్టుల నైపుణ్యాన్ని పెంచే విధంగా ఈ శిక్షణా తరగతులు ఉపయోగపడుతున్నాయని అన్నారు. రాష్ట్రంలోని ఉర్దూ జర్నలిస్టుల కోసం ఉర్దూ అకాడమీ ద్వారా సహాయం చేయడానికి తనవంతు కృషి చేస్తానని ఈ సందర్భంగా ఆయన హామీ ఇచ్చారు. తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కే. శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ మాతృభాషకు తగినంత ప్రేరణ, ఆదరణ ఇవ్వాలని అన్నారు. యూరప్ ఖండంలోని ఫ్రెంచ్, జర్మనీ, క్యూబా, ఇటలీ దేశాల ప్రజలు ప్రభుత్వం వారి మాతృభాషలో అన్ని కార్యకలాపాలు చేస్తున్నారని అన్నారు. మన రాష్ట్ర అధికారిక భాషలైన తెలుగు, ఉర్దూ భాషలకు మనమంతా ప్రాధాన్యత నిచ్చి అన్ని కార్యకలాపాలు మాతృభాషలోనే చేయాలని తెలిపారు. మీడియా అకాడమీ జిల్లాలలో పనిచేస్తున్న జర్నలిస్టులకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నదని, ఇప్పటి వరకు నాగర్ కర్నూల్, సిద్దిపేట, వరంగల్ జిల్లాలలో తరగతులు నిర్వహించామని, హైదరాబాద్ మీడియా అకాడమీ ఆడిటోరియంలో మేడ్చల్-మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల జర్నలిస్టులకు, గిరిజన జర్నలిస్టులకు ప్రత్యేకంగా తరగతులు నిర్వహించినట్లు ఆయన తెలిపారు. సెప్టెంబర్, 3వ తేదీన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఫ్యాక్ట్ చెక్, సైబర్ నేరాలపై ప్రత్యేక వర్క్ షాప్ అకాడమీ నిర్వహిస్తున్నదని ఈ సందర్భంగా తెలియజేశారు. ప్రముఖ ఉర్దూ జర్నలిస్ట్ మాజీద్ మాట్లాడుతూ, జర్నలిస్టులు ఆధునిక టెక్నాలజీని నేర్చుకుంటూ తమ రిపోర్టింగ్లో మెలుకువలు పెంచుకోవాలని అన్నారు. కార్యక్రమంలో మీడియా అకాడమీ కార్యదర్శి నాగులపల్లి వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఖైరతాబాద్ వినాయకుని దర్శించుకున్న కమిషనర్ దంపతులు

విశాలాంధ్ర - హైదరాబాద్ : ఖైరతాబాద్ గణేశుడినీ జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్‌వి కర్ణన్ దంపతులు శనివారం దర్శించుకు న్నారు. 69 అడుగులతో నిర్మించిన విశ్వశాంతి మహాశక్తి గణపతికి ఆర్ వి కర్ణన్, ఐ అండ్ పి ఆర్ ప్రత్యేక కమిషనర్ సి. హెచ్.ప్రియాంక లు సంయుక్తంగా పూజలు నిర్వహించారు. అనంతరం ఖైరతాబాద్ విఘ్నేశ్వరుడి వద్ద బారికేడ్లు, క్యూలైన్‌లు, భద్రతా ఏర్పాట్లను కమిషనర్ ఆర్‌వి కర్ణన్ పరిశీలించారు. రాష్ట్ర నలుమూలల నుంచే కాకుండా వివిధ రాష్ట్రాలకు చెందిన భక్తులు మహాగణపతిని దర్శించుకునేందుకు వస్తున్నందున దర్శనం సజావుగా, వేగంగా జరిగేలా చూడాలని నిర్వాహకులను, అధికారులకు సూచించారు.

అల్లు అరవింద్‌కు మాతృ వియోగం

విశాలాంధ్ర - హైదరాబాద్ : ప్రముఖ నిర్మాత అల్లు అరవింద్ తల్లి అల్లు రామలింగయ్య సతీమణి అల్లు కనకరత్నం (94) కన్నుమూశారు. శనివారం తెల్లవారుజామున ఆమె తుది శ్వాస విడవగా. మధ్యాహ్నం కోకాపేటలో అంత్యక్రియలు కుటుంబ సభ్యులు నిర్వహించారు. దివంగత నటుడు అల్లు రామలింగయ్య భార్య కనకరత్నం గతకొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. అనారోగ్యం కారణంగా ఆమె శనివారం తెల్లవారుజామున కన్నుమూశారు. అయితే అల్లు అర్జున్ ప్రస్తుతం ముంబైలో అట్లీ దర్శకత్వం వహిస్తున్న సినిమా పనుల్లో ఉన్నారు. ఆయనకు విషయం తెలిసిన వెంటనే ముంబై నుంచి బయలుదేరి హైదరాబాద్‌కు చేరుకున్నట్లు సమాచారం. సినీ పరిశ్రమలో ప్రముఖ ప్రొడ్యూసర్ అయిన అల్లు అరవింద్ తల్లి కన్నుమూయడంతో టాలీవుడ్‌లో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. పలువురు సినీ ప్రముఖులు, నేతలు అల్లు కనకరత్నం మృతికి సంతాపం తెలుపుతున్నారు.

ఘనంగా అన్నప్రసాద పంపిణీ

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి : హెూప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రతి శనివారం నిర్వహిస్తున్న అన్న ప్రసాద (భోజ) కార్యక్రమం శనివారం 147వ వారం పూర్తి చేసుకుంది. శనివారం చేపట్టిన ఆన్న ప్రసాద కార్యక్రమంలో సుమారు 2000 పాల్గొని భోజనం చేయడం జరిగింది. తమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేపడుతున్న భోజన కార్యక్రమంలో వాలంటీర్లు భాధ్యతతో వ్యవహరిస్తూ ముందుకు సాగడం పట్ల ప్రతి ఓక్క వాలంటరీకి హెూప్ ఫౌండేషన్ చైర్మెన్ కొండ విజయ్ కుమార్ తెలిపారు. హెూప్ పౌండేషన్ అధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్న దాన కార్యక్రమంలో భాగంగా 2 వేల మంది ప్రజలు భోజనం అందుకోవడం జరిగిందని అన్నారు. ఉచిత భోజనం అందజే యడం పట్ల కూలీలు సంతోషం వ్యక్తం చేస్తున్నరని, కోంతమంది కూలిలు మాట్లాడుతు తాము రోజంతా కష్టపడితేగాని పూట గడవదని కానీ ప్రతి వారం కొండ విజయ్ కుమార్ సారు భోజనం అందజేయడం గోప్ప ఉరట అని, భావోద్వేగంతో చెప్పరు. ఆకలితో అలమటిస్తున్న ఎందరో జీవితాలలో హెూప్ పౌండేషన్ ఒక ఆశను నింపిందని అన్నారు. ఈ కార్యక్రమంలో హెూప్ పౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

గణేష్ నిమజ్జనం ప్రశాంతంగా జరిగేలా చూడాలి : కమిషనర్

విశాలాంధ్ర - హైదరాబాద్ : గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో గణేష్ నిమజ్జన కార్యక్రమం సురక్షితంగా, ఎకో ఫ్రెండ్లీ విధానంలో సాఫీగా జరిగేలా చూడాలనీ జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్ అధికారులకు సూచించారు. శనివారం జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్, అదనపు కమిషనర్ రఘు ప్రసాద్, సంబంధిత ప్రభుత్వ శాఖలు, విభాగాల అధికారులతో కలిసి సనత్‌నగర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ వద్ద తవ్విన కుంట, నెక్లెస్ రోడ్ పీపుల్స్ ప్లాజా బేబీ పాండ్, అమీర్‌పేట్, నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో ఏర్పాటు చేసిన పోర్టబుల్ పాండ్లను వాటి నాణ్యతను ప్రత్యక్షంగా పరిశీలించారు. భద్రతా, శుభ్రత, స్మూత్ నిమజ్జన విధానాలను సమీక్షించారు. నిర్వాహకులు, కమ్యూనిటీ నాయకులు, భద్రతా ఏజెన్సీల మధ్య సమన్వయంను కమిషనర్ సమీక్షించారు. బారికేడింగ్, లైటింగ్, క్యూలైన్‌లు, కంట్రోల్ రూం ఏర్పాట్లను పరిశీలించి నిమజ్జనం సజావుగా జరిగేలా అధికారులకు దిశా నిర్దేశం చేశారు. గత లోటుపాట్లను సమీక్షించుకుంటూ భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా నిమజ్జనం జరగాలనే లక్ష్యంతో మౌలిక సదుపాయాలు, శుభ్రత, ఆరోగ్య పరిరక్షణ, భద్రత, ట్రాఫిక్ నిర్వహణ అంశాలపై బహుముఖ వ్యూహంతో ఏర్పాట్లు చేస్తున్నామని కమిషనర్ తెలిపారు. ప్రధాన నీటి వనరుల పై ఒత్తిడి తగ్గేలా చూడడం, ట్రాఫిక్ ఇబ్బందులు దూరం చేసే ఉద్దేశ్యంతో భక్తులకు అందుబాటులో ఉండేలా నగరవ్యాప్తంగా 72 కృత్రిమ నిమజ్జన పాయింట్లు సిద్ధం చేశామన్నారు. గణేష్ ఉత్సవాలు, నిమజ్జన పాయింట్ లలో 56,187 తాత్కాలిక లైట్లు, 309 మొబైల్ టాయిలెట్లు, బారికేడింగ్, త్రాగునీటి సదుపాయం, మైక్ సిస్టం, సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. ప్రతిమల నిమజ్జనం వేగంగా, స్మూత్ గా జరిగేలా చూసేందుకు 134 స్టాటిక్ క్రేన్లు, అదనంగా 269 మొబైల్ క్రేన్లు వినియోగిస్తున్నామని చెప్పారు. 160 గణేష్ అసిస్టెన్స్ టీంలు పనిచేస్తున్నాయి. 14,486 శానిటేషన్ సిబ్బంది, 160 గణేశ్ యాక్షన్ టీమ్‌లు మూడు షిఫ్ట్ లలో నిరంతరాయంగా విధులు నిర్వర్తిస్తున్నారనీ కమిషనర్ చెప్పారు. గణేష్ మండపాల వద్ద వ్యర్థాల సేకరణకు 5 లక్షల ట్రాష్ బ్యాగులు పంపిణీ చేశారు. అదనంగా 2,000 స్వీపర్లు, 102 మినీ టిప్పర్లు, 125 జేసీబీలు, 30 స్వీపింగ్ మెషిన్లు నిమజ్జన దినాన చెత్త తొలగింపులో పాల్గొంటాయన్నారు. ప్రత్యేక శుభ్రతా డ్రైవ్‌లో 1,400 మెట్రిక్ టన్నుల చెత్త, శిథిలాలు తొలగింపు చేశామని తెలిపారు. 839 కి.మీ. మేర రహదారులు, అంతర్గత రోడ్లకు అర వైపుల చెట్ల కొమ్మల కత్తిరింపు చేశామన్నారు.

ఎకో ఫ్రెండ్లీ విధానంలో వేడుకలు జీహెచ్ఎంసీ ప్రోత్సాహం...

వేడుకలను పర్యావరణహితంగా జరుపుకునేలా జీహెచ్ఎంసీ ప్రోత్సాహం అందిస్తుందనీ కమిషనర్ ఆర్ వి కర్ణన్ అన్నారు. ఈ వేడుకల్లో 2 లక్షల వినాయక మట్టి ప్రతిమలను పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ తో కలిసి జీహెచ్ఎంసీ భక్తులకు పంపిణీ చేసిందన్నారు. నీటి వనరులు కలుషితం కాకుండా నగర వ్యాప్తంగా మొత్తం 74 కృత్రిమ నిమజ్జన కొలనులను ఏర్పాటు చేసిందన్నారు. వీటిలో 28 పోర్టబుల్ పాండ్స్, 21 ఎక్స్కావేషన్ పాండ్ లు, 28 బేబీ పాండ్ లు ఉన్నాయన్నారు. 56 వేల ఇళ్లలో యాంటీ లార్వల్ ఆపరేషన్లు పూర్తి చేశామని, వైద్యారోగ్య పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. వ్యర్థాలు పేరుకునే ప్రాంతాలను పూర్తిగా శుభ్రపరిచినట్లు కమిషనర్ చెప్పారు. గణేష్ ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో భక్తి భావం పెంపొందించేలా జరిగేందుకుప్రతి రోజు క్షేత్రస్థాయి పరిశీలనలు, అధికారులతో సమీక్షా సమావేశాలు నిర్వహిస్తున్నామనీ తెలిపారు . రియల్ టైమ్ మానిటరింగ్ ద్వారా నిమజ్జన ఏర్పాట్లు జరుగుతున్నాయని కమిషనర్ వివరించారు. పోలీసులతో కలిసి కంట్రోల్ రూమ్స్ ఏర్పాటు చేసి, నిమజ్జనం సజావుగా సాగేందుకు పర్యవేక్షణ చేస్తున్నట్లు తెలిపారు. రోడ్డు సేఫ్టీ డ్రైవ్‌లో భాగంగా ఊరేగింపు జరిగే మార్గాల తో పాటు నగరంలో 10,300 కు పైగా గుంతలను జీహెచ్ఎంసీ ఇంజనీరింగ్ విభాగం పూడ్చివేసిందన్నారు. రోడ్డు మరమ్మతులు కూడా పూర్తి చేసిందనీ చెప్పారు. గత సంవత్సరం మాదిరే ఈ సంవత్సరం కూడా గణేశ్ నిమజ్జనం ఎటువంటి అవాంఛనీయ ఘటనలు లేకుండా విజయవంతంగా జరిగేలా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్ వి కర్ణన్ స్పష్టం చేశారు. గణేష్ నిమజ్జనం ఆధ్యాత్మిక వాతావరణంలో సజావుగా, సురక్షితంగా జరిగేలా చూసేందుకు జీహెచ్ఎంసీ విస్తృత ఏర్పాట్లు చేస్తుంది. పర్యావరణ హిత సదుపాయాలను వినియోగించుకోవాలని, అధికారులు చేస్తున్న కృషికి సహకరించాలని నగర ప్రజలు, భక్తులకు కమిషనర్ ఆర్.వి. కర్ణన్ విజ్ఞప్తి చేశారు.

గణనాథుడికి ప్రత్యేక పూజలు

విశాలాంధ్ర-కుత్బుల్లాపూర్: శనివారం వినాయక నవరాత్రులు పురస్కరించుకొని కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట్ జర్నలిస్ట్ కాలనీలో ఏర్పాటు చేసిన గణనాథుని వద్ద తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆస్కాని మారుతి సాగర్, మాధవి దంపతులు తమ కుటుంబ సభ్యులతో కలిసి వినాయకుని దర్శించుకుని ప్రత్యేక పూజాలు, అన్న ప్రసాద కార్యక్రమాలను నిర్వహించారు.

ఏబీ న్యూ లైఫ్ హాస్పిటల్లో భక్తులకు అన్నప్రసాద వితరణ

విశాలాంధ్ర - మేడిపల్లి : పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఉప్పల్ డిపో వద్ద గల ఏబీ న్యూ లైఫ్ హాస్పిటల్ ఆధ్వర్యంలో గణపతి నవరాత్రి ఉత్సవాలలో భాగంగా శనివారం సుమారు 2000 అన్నదానం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, బోడుప్పల్ మాజీ మేయర్ అజయ్ యాదవ్, సీఐ మక్బూల్ జానీ, బండి యాదగిరి గౌడ్, బండి శ్రీరాములు, దర్గా దయాకర్ రెడ్డి, బొడిగె స్వాతి కృష్ణ గౌడ్, కోత సాయి తేజ్ గౌడ్, పైళ్ళ సుధీప్ రెడ్డిలు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నప్రసాదాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏబీ న్యూ లైఫ్ హాస్పిటల్ మ్యానేజింగ్ డైరెక్టర్ డా. కె. అనిల్ కుమార్, చైర్మన్ డా. బాలకృష్ణ మాట్లాడుతూ వినాయక నవరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నామని, సమాజ సేవలో భాగంగా ఏబి న్యూ లైఫ్ హాస్పిటల్ వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుందని, వినాయక నవరాత్రి ఉత్సవాలు భాగంగా సుమారు 2000 మందికి అన్నదానం నిర్వహించమని అన్నారు. ఈ కార్యక్రమంలో అంజన్ కుమార్, శరత్ గౌడ్, దినేష్, మాచగిరి గౌడ్, శేషు, శ్రీనివాస్, శ్రీధర్, ప్రవీణ్, శ్రీహరి, భరత్, హేష్, శ్రీకాంత్ రెడ్డి, అన్వేష్ పాల్గొన్నారు.

కీసర 108 వాహనం ఆకస్మిక తనిఖీ

విశాలాంధ్ర - ఘట్ కేసర్: మేడ్చల్ జిల్లా కీసర ప్రభుత్వ హాస్పిటల్ ఆవరణలో ఉంటున్న కీసర 108 వాహనాన్ని అకస్మిక తనిఖీ చేసారు. మేడ్చల్ జిల్లా 108 కో ఆర్డినేటర్ తిరుపతి గారు కీసర అంబులెన్స్ ద్వార ప్రజలకు అందుతున్న అత్యవసర సేవలపై ఆయన ఆరా తీశారు. అంబులెన్స్‌లో ఉన్న వైద్య పరికరాలను పరిశీలించి వాటి పనితీరును తెలుసుకున్నారు. ఆక్సిజన్ ఎమర్జెన్సీ మందులు అందుబాటులో ఉన్నాయి లేవా అని పరిశీలించారు. అత్యవసర పరిస్థితుల్లో ఉన్న రోగులకు, క్షత గాత్రులకు అందుతున్న సేవలపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. కీసర అంబులెన్స్‌లో అన్ని వైద్య పరికరాలు అందుబాటులో ఉన్నాయి అని వాటి పనితీరు కూడా సక్రమంగా ఉందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో కీసర 108 సిబ్బంది ఈ.ఎం.టి చిత్రం రవి పైలట్ రాంబాబులు పాల్గొన్నారు

హాథీరాంజీ బాబా మఠం ఆస్తులను కాపాడాలి



విశాలాంధ్ర, బషీర్ బాగ్: తిరుమల తిరుపతిలోని హాథీరాంజీ బాబా మఠం ఆస్తులను కాపాడాలని, మఠం పునర్నిర్మాణం చేపట్టాలని భారత్ బంజారా ఏపీ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఏపీ సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ విజ్ఞప్తి చేయడం జరిగిందని మాజీ ఎంపీ రవీంద్రనాయక్, భారత్ బంజారా చైర్మన్ జగన్నాయక్ తెలిపారు. శనివారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఈ మఠంకు కోట్లాది రూపాయలు విలువగల వేల ఎకరాల భూములు ఉన్నాయని, అంతేకాకుండా బంగారం, వజ్రవైడుర్యాలు దేశంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్నాయని, వీటిని దుర్వినియోగం కాకుండా ఏపీ ప్రభుత్వం కాపాడాలని విజ్ఞప్తి చేశారు. కొన్ని భూములను కబ్జాదారులు అక్రమించుకున్నారని, వాటిని కాపాడాలని, లేకపోతే బంజారాల మనోభావాలు దెబ్బతింటాయని ఆవేదన వ్యక్తం చేశారు. లంబాడీ, బంజారా, సుగాలీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని, ఎమ్మెల్యే వెంకట్రావు, మాజీ ఎంపీ సోయం బాబురావు కోర్టుకు వెళ్లడాన్ని వారు తీవ్రంగా అభ్యంతరం వ్యక్తం చేశారు. కేవలం డబ్బుల కోసమే వారు నాటకాలు ఆడుతున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో జోహార్ నాయక్, భావన నాయక్, రాజు నాయక్, ఎస్వీ నాయక్, గోపాల్ నాయక్, నాగరాజు నాయక్, కళ్యాణ్ నాయక్, రామచంద్ర నాయక్, రవి రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.

నిజాలను నిక్కచ్చిగా రాసేలా జర్నలిస్టులు కృషి చేయాలి

విశాలాంధ్ర - షాద్ నగర్, రూరల్: నిజాలను నిక్కచ్చిగా రాసేందుకు జర్నలిస్టులు కృషి చేయాలని రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో టీయూడబ్ల్యూజే ఐజేయూ డివిజన్ నూతన కార్యవర్గం ప్రింట్ మీడియా, ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్ష, ఉపాధ్యక్షులతో పాటు కమిటీ సభ్యులను ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. అంతకుముందు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు జర్నలిస్టు యూనియన్ సభ్యులు శాలువాతో సత్కరించి, పూలబొకే అందజేశారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ నిజాలను నిర్భయంగా రాయడంతో పాటు సమాజానికి విలువైన సందేశాలను ఇచ్చేందుకు కృషి చేయాలని సూచించారు. జర్నలిస్టులు వృత్తి నైపుణ్యంతో పాటు జర్నలిస్టుల విలువలను పెంపొందించుకోవాలని ఆయన తెలిపారు. జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు తాను కృషి చేస్తానని, త్వరలోనే జర్నలిస్టులకు తీపి కబురు అందించనున్నట్లు వివరించారు. కొంతమంది జర్నలిస్టులు అడ్డదారులు తొక్కడమే కాకుండా విలువలను దిగదర్చే విధంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. బ్లాక్మెయిల్ వార్తలను రాయడం మానుకొని సమాజ అభివృద్ధి కోసం వార్తలు రాయాలని, వాస్తవాలను రాస్తేనే ప్రజల్లో ఆదరణ పొందవచ్చని పేర్కొన్నారు. జర్నలిస్టులను తాను ఎప్పుడు గౌరవిస్తానని, ఏ సమస్య ఉన్న జర్నలిస్టులు తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరించేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రింట్ మీడియా రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు భాస్కర్, ఎలక్ట్రానిక్ మీడియా రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు చెక్కల శ్రీశైలం, కార్యదర్శి రాఘవేందర్ యాదవ్, సీనియర్ జర్నలిస్ట్ ఆకుల శ్రీనివాస్, ప్రింట్ మీడియా జిల్లా కార్యదర్శి సభ్యులు దన్నారం రమేష్, ఈసీ మెంబర్ ఇలియాస్, ప్రింట్ మీడియా డివిజన్ అధ్యక్షులు కృష్ణయ్య గౌడ్, ప్రింట్ మీడియా అధ్యక్షుడు బూర్గుల ఫణీంద్ర, ఉపాధ్యక్షుడు మల్లికార్జున్, బంగారు మల్లేష్, సంతోష్, ప్రధాన కార్యదర్శి నీరటి శివకుమార్, ప్రచార కార్యదర్శి శేఖర్ యాదవ్, సంయుక్త కార్యదర్శులుగా అల్వాల దర్శన్ గౌడ్, జగన్, కోశాధికారిగా గోవిందు శ్రీనివాస్, కార్యవర్గ సభ్యులు యాదగిరి, సమీ, రవి, ఎలక్ట్రానిక్ మీడియా డివిజన్ అధ్యక్షులు నరసింహ, ఉపాధ్యక్షులు శివకుమార్ గౌడ్, శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి ఫయాజ్, సంయుక్త కార్యదర్శులు సవాళ్ల రాజు, సాబేర్, విష్ణు, కోశాధికారి రజాక్ తో పాటు పలువురు జర్నలిస్టులు తదితరులు పాల్గొన్నారు.

విఘ్నేశ్వరుడి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలి

విశాలాంధ్ర - మొయినాబాద్: విఘ్నేశ్వరుడి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి గౌరీ సతీష్, నియోజకవర్గ ఇంచార్జీ భీమ్ భరత్ లు ఆకాక్షించారు. మండల పరిధిలోని కనకమామిడి గ్రామంలోని వినాయక పూజలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... భక్తి భావంతో మనసుకు ప్రశాంతత నిస్తుందని తెలిపారు. నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో రవీందర్ రెడ్డి, బాలకృష్ణారెడ్డి, మానయ్య, విఠల్, కుమార్ యాదవ్, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

విశాలాంధ్ర - మొయినాబాద్: అనారోగ్య సమస్యలతో బాధపడుతూ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారి కోసం సీఎం రిలీఫ్‌ఫండ్ కింద మంజూరైనా చెక్కులను శనివారం చేవెళ్ల నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ పామెన భీమ్ భరత్ లబ్దిదారులకు అందజేశారు. ఈ. సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. వారికి అవసరమైన సాయాన్ని అందించేందుకు ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో మొయినాబాద్ మండలం అధ్యక్షులు మాణయ్య, మాజీ ఎంపీటీసీ కేబుల్ రాజు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ జైపాల్ రెడ్డి, బాకారం మాజీ సర్పంచ్ వెంకట్ రెడ్డి, ఫిషర్ మెన్ మండల అధ్యక్షులు బిక్షపతి, విఠల్ యాదవ్, అజీజ్ నగర్ గ్రామ అధ్యక్షులు మహిపాల్ రెడ్డి, నరేందర్, మాజీ ఎంపీటీసీ గణేష్, సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

హైదరాబాద్‌లో సీబీ125 హార్నెట్, మోటర్ ఆవిష్కరణ

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి : హెూండా మోటర్ సైకిల్, స్కూటర్ ఇండియా (హెచ్ఎంఎస్ఐ) తమ తాజా ద్విచక్ర వాహన ఆవిష్కరణలు - సరికొత్త హెూండా సీబీ 125 హార్నెట్ మరియు హెూండా షైన్ 100 డీఎక్స్‌లను హైదరాబాద్ నగరంలో వైభవంగా విడుదల చేసింది. ఈ భారీ ఆవిష్కరణ కార్యక్రమం కూకట్‌పల్లిలోని నెక్సస్ మాల్‌లో హెచ్ఎంఎస్ఐ జోనల్ హెడ్ (సేల్స్) సునీల్ రెడ్డి, డీలర్ భాగస్వాములు, ఏరియా సేల్స్, సర్వీస్ మేనేజర్లు, కస్టమర్ల సమక్షంలో జరిగింది. భారతీయ కస్టమర్ల మారుతున్న ఆకాంక్షలకు అనుగుణంగా అత్యాధునిక డిజైన్, అధునాతన సాంకేతికత, ఉన్నతమైన సవారీ అనుభవాలను అందించడంలో తమ నిబద్ధతను హెచ్ఎంఎస్ఐ వెల్లడించింది. తదుపరి తరం రైడర్ల కోసం రూపొందించబడిన హెూండా సీబీ 125 హార్నెట్, "రైడ్ యువర్ రిజ్" అనే యువత స్ఫూర్తిని ముందుకు తీసుకువెళ్తోంది. ఇది గోల్డెన్ యుఎస్‌డీ ఫ్రంట్ ఫోర్కులు, కీ-ఆన్-ట్యాంక్ ఇగ్నిషన్ సిస్టమ్, యుఎస్‌బీ ఛార్జింగ్ పోర్ట్ , చురుకైన హ్యాండ్లింగ్ కోసం 5-స్టెప్ అడ్జస్టబుల్ మోనో-షాక్ అబ్జార్బర్ వంటి ఫీచర్లను ఈ విభాగంలో మొట్టమొదటి సారిగా కలిగి వుంది. దాని స్పోర్టీ ఆకర్షణకు తోడు, సీబీ 125 హార్నెట్ డీఆర్ఎల్ లతో కూడిన సిగ్నేచర్ ట్విన్-ఎల్ఈడీ హెడ్‌ల్యాంప్, హై-మౌంటెడ్ టర్న్ ఇండికేటర్‌లు, సౌకర్యవంతమైన నావిగేషన్, కాల్స్ , ఎస్ఎంఎస్ హెచ్చరికల కోసం బ్లూటూత్-అనుసంధానిత హెూండా రోడ్‌సింక్‌తో 4.2-అంగుళాల టీఎఫ్‌టీ డిస్ప్లేను కలిగి ఉంది. బ్రాండ్ యొక్క ఐకానిక్ కమ్యూటర్ వారసత్వం ముందుకు తీసుకెళ్తూ, హెూండా షైన్ 100 డీఎక్స్ రోజువారీ రైడర్‌ల కోసం రూపొందించిన తాజా , ప్రీమియం డిజైన్‌ను తెస్తుంది. క్రోమ్ గార్నిషింగ్‌తో కొత్తగా స్టైల్ చేయబడిన హెడ్‌ల్యాంప్, బోల్డ్ బాడీ గ్రాఫిక్స్‌తో ఇంధన ట్యాంక్, పూర్తిగా బ్లాక్ ఇంజిన్, గ్రాబ్ రైల్ మరియు క్రోమ్ మఫ్లర్ కవర్ దీనిలో ప్రధాన ఆకర్షణలు. దీని పొడవైన, సౌకర్యవంతమైన సీటు దీనిని రైడర్ , పిలియన్ ఇద్దరికీ సరైన రోజువారీ సహచరుడిగా చేస్తుంది.

గణనాథుని ఆశీస్సులు అందరిపై ఉండాలి

విశాలాంధ్ర - జవహర్ నగర్ : గణనాథుని ఆశీస్సులు అందరిపై ఉండాలని అంబేడ్కర్ నగర్ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు నంగునూరు అశోక్ కుమార్ గుప్తా అన్నారు.వినాయక నవరాత్రి ఉత్సవాలలో భాగంగా అంబేడ్కర్ నగర్ ఆర్యవైశ్య సంఘంలో ఏర్పాటు చేసిన గణనాథునికి ప్రత్యేక పూజలు నిర్వహించిన ఆర్యవైశ్య మహాసభ మేడ్చల్ జిల్లా కోశాధికారి బల్లి శ్రీధర్ దంపతులు, కాప్రా మండల అధ్యక్షులు పెద్ది మురళీకృష్ణ దంపతులు, గణనాథునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఏటా నవరాత్రి ఉత్సవాలలో భాగంగా ఆర్యవైశ్య సంఘ సభ్యులతో కలసి నవరాత్రి ఉత్సవాలను నిర్వహిస్తున్నామని పర్యావరణ పరిరక్షణ కోసం మట్టి వినాయకులకు పూజించి నీటి కాలుష్యాన్ని నియంత్రించే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో వేద పండితులు సుబ్రహ్మణ్యేశ్వర సిద్ధాంతి కాప్రా మండల మాజీ అధ్యక్షులు అంబేద్కర్ నగర్ ఆర్యవైశ్య సంఘం సభ్యులు సకుటుంబ సమేతంగా పూజా కార్యక్రమంలో పాల్గొని స్వామివారి తీర్థప్రదాయాలను స్వీకరించారు.

కాకతీయనగర్ కాలనీ నూతన కమిటీకి సన్మానం

విశాలాంధ్ర - మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 2వ డివిజన్ కాకతీయ నగర్ కాలనీ అధ్యక్షులుగా రెండోసారి ఎన్నికైన భాగ్యలక్ష్మి శంకర్ రెడ్డి, నూతన కమిటీ సభ్యులకు శనివారం ఉదయం 2వ డివిజన్ మాజీ కార్పొరేటర్ సుభాష్ నాయక్ నూతన కమిటీ సభ్యులను సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఆదివారం జరగబోయే కాకతీయనగర్ కాలనీలో వినాయక మండపం వద్ద అన్న ప్రసాద కార్యక్రమంలో పాల్గొనవలసిందిగా మాజీ కార్పొరేటర్ సుభాష్ నాయక్‌ను నూతన కమిటీ సభ్యులు ఆహ్వానించారు.

నిబద్ధత గల నాయకుడు మాగంటి గోపీనాథ్

విశాలాంధ్ర-దుండిగల్: నమ్ముకున్న ప్రతి ఒక్కరిని ఆదుకొని ముందుకు నడిపించిన ప్రజా నాయకుడు జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ అని బిఆర్ఎస్ పార్టీ వీప్, ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ పేర్కొన్నారు. అసెంబ్లీ వర్షాకాల సమావేశాల్లో భాగంగా శనివారం ప్రవేశపెట్టిన జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ సంతాప తీర్మానంపై బిఆర్ఎస్ పార్టీ విప్,ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ఆయన సంతాపాన్ని తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేపీ వివేకానంద మాట్లాడుతూ రాజకీయాల్లో సుదీర్ఘ అనుభవం, ప్రజాసేవలో నిబద్ధత గల నాయకుడని, 1983 నుంచి రాజకీయాల్లో ఉంటూ చురుగ్గా పనిచేస్తూ అంచెలంచెలుగా ఎదిగిన నాయకులు మాగంటి గోపీనాథ్ అని తెలిపారు. పార్టీ నుంచి సభ్యత్వ నమోదు, బూత్ కమిటీల ఏర్పాటు వంటి ఏ కార్యక్రమానికి పిలుపునిచ్చిన రెండు మూడు రోజుల్లో పనిని పూర్తి చేసి అందరికీ ఆదర్శవంతంగా పనిచేసే వారని, తనను నమ్ముకున్న వారు, అభిమానులు, కార్యకర్తలను సొంత ఖర్చుతో ఆదుకుని ముందుండి నడిపించిన ప్రజా నాయకుడు గోపీనాథ్ అన్నారు. హైదరాబాద్ నగరాభివృద్ధిలో నగరంలోని ఎమ్మెల్యేలను అంతా జట్టుగా ఏర్పాటు చేసి హైదరాబాద్ నగరాభివృద్ధిలో కీలకపాత్ర పోషించి మాలాంటి నాయకులను ప్రోత్సహించిన గొప్ప నాయకులు మాగంటి గోపీనాథ్ అని వ్యక్తం చేశారు. మాగంటి గోపీనాథ్ బిఆర్ఎస్ పార్టీకి, జూబ్లీహిల్స్ ప్రజలకు తీరని లోటు. వారి ఆత్మకు శాంతి చేకూర్చాలని, వారి కుటుం బ సభ్యులకు మనోధైర్యాన్ని కలిగించాలని ఆ దేవుడిని కోరుకుంటునట్టు తెలిపారు.

రెవిన్యూ శాఖకు అందించిన సేవలు స్ఫూర్తిదాయకం

విశాలాంధ్ర - హైదరాబాద్ : జిల్లాలోని వివిధ మండలాల్లో తహసీల్దార్లుగా పనిచేసి మంచి సేవలందించి ప్రజల మన్ననలు పొందారని జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి అన్నారు. శనివారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో ఏవో కె. చంద్రశేఖర్ గౌడ్, మారేడుపల్లి తాసిల్దార్ టి. భీమయ్య గౌడ్ పదవీ విరమణ సన్మాన కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ముకుంద రెడ్డితో కలసి కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రెవిన్యూ శాఖకు అందించిన సేవలు స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయని అన్నారు. ఉద్యోగంలో చేరిన తర్వాత పదోన్నతులు, బదిలీలు, పదవీ విరమణాలు సాధారణంగా స్వీకరించాలని అలాగే పదవి విరమణ ఉద్యోగానికి మాత్రమేనని తదుపరి శేష జీవితంలో కూడా మంచి ఆరోగ్యంతో ఉంటూ ప్రజాసేవలో భాగస్వాములు కావాలని అన్నారు. ఈ సందర్భంగా కలెక్టరేట్ ఏవో, మారేడుపల్లి తాసిల్దార్‌ను ఘనంగా సన్మానించి పదవీ విరమణ శుభాకాంక్షలు తెలిపారు. తదుపరి అదనపు కలెక్టర్ ముకుంద రెడ్డి, ఇంచార్జ్ డి. ఆర్. ఓ శ్రీధర్, ఎస్ డి సి సూర్యప్రకాష్, ఆర్ డి ఓ సాయిరాం, జిల్లా అధికారులు, వివిధ మండలాల తహసీల్దార్లు, సహ ఉద్యోగులు, సిబ్బంది ఘనంగా సన్మానించి తమ మనోభావాలు ఈ సందర్భంగా తెలియచేసారు.

బాధితుల పక్షాన న్యాయస్థానం తీర్పు హర్షణీయం

విశాలాంధ్ర - బషీర్ బాగ్ : ధన్వంతరి ఫౌండేషన్ ఇంటర్నేషనల్ సంస్థ కేసులో నాంపల్లి మెట్రోపాలిటన్ క్రిమినల్ కోర్టు వెల్లడించిన తీర్పు పట్ల ధన్వంతరి బాధితుల ఫోరం హర్షం వ్యక్తం చేసింది. అందుకు సహకరించిన సీసీఎస్ పోలీసులకు ఫోరం అధ్యక్షుడు గిరిప్రసాద్ శర్మ ధన్యవాదాలు తెలిపారు. శనివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో బాధితులు ఎం.విజయ్ కుమార్, కృష్ణ మూర్తి, రామచంద్రం, శ్రీనివాస సాయి, పద్మ తదితరులతో కలిసి గిరిప్రసాద్ శర్మ మాట్లాడారు. ధన్వంతరి సంస్థ అధినేత కమలాకర్ శర్మ 1500 మంది బాధితుల నుండి అధిక వడ్డీలు ఆశచూపి కోట్లలో డబ్బులు వసూలు చేశారని ఆరోపించారు. ఈ విషయంపై సీసీఎస్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, నిందితుడు కమలాకర్ శర్మ ఆస్తులను అమ్మి బాధితులకు డబ్బులు చెల్లించాలని నాంపల్లి న్యాయస్థానం ఈనెల 29 తీర్పు ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. ఇటువంటి వైట్ కాలర్ కేసులలో బాధితులకు త్వరితగతిన న్యాయం జరగాలంటే, సీసీఎస్ పోలీసులకు స్వయం ప్రతిపత్తి అధికారాలు ఇవ్వాలని రాష్ట్ర డిజిపిని కోరారు.

ఖైరతాబాద్ గణేష్‌ని దర్శించుకున్న నగేష్ ముదిరాజ్

విశాలాంధ్ర - జూబ్లీహిల్స్ : ఖైరతాబాద్ మహా గణేష్ ని దర్శించుకున్న బి ఆర్ ఎస్ రాష్ట్ర నాయకులు నగేష్ ముదిరాజ్. ఈ సందర్భంగా ఆయన తెలంగాణ రాష్ట్ర లో పంటలు బాగా పండి రైతులు సుఖ సంతోషాలతో ఉండాలని గణేశ్ మహారాజ్ ని కోరుకున్నారు. అలాగే ఈ రాష్ట్రంలో వరదలు తగ్గు ముఖం పట్టి, ప్రజలకు ఏ విధమైన వ్యాధులు రాకుండా చూడాలని గణపతిని కోరుకున్నారు.

చెన్నపురం చెరువుని కాలుష్యం నుండి కాపాడాలి

విశాలాంధ్ర - జవహర్ నగర్ : జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఆధ్వర్యంలో శనివారం జవహర్ నగర్ మున్సిపల్ కమిషనర్ అందుబాటులో లేకపోవడంతో మేనేజర్ నగేష్‌బాబు చెన్నపురం చెరువుని కాలుష్యం నుండి కాపాడాలని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం కార్యవర్గ సభ్యులు సిహెచ్ దశరథ మాట్లాడుతూ చెన్నపురం చెరువును గత ప్రభుత్వంలో మినీ ట్యాంక్ బండ్‌గా తీర్చిదిద్ది ప్రజలకు వాకింగ్ ట్రాక్ చెరువు సుందరీకరణ పనుల కోసం కోట్ల రూపాయలు ఖర్చు చేసి చెరువు కట్ట మాత్రమే తూతూ మంత్రంగా మరమ్మతులు చేసి చేతులు దులుపుకున్నారు అని ఎద్దేవా చేశారు. నేడు చెరువులో చెత్తాచెదారం మురుగనీరు చేరి గుర్రపుడెక్కతో చెత్త కుప్పలు తగులబెట్టడంతో చెరువు పరిసరాలు దుర్గంధం వెదగలుగుతున్నాయి అటు ప్రజల ప్రాణాలకు ప్రమాదాల నిలయంగా మారిందని అన్నారు. చెరువు అంతా గుర్రపుడెక్కలతో చెరువు అంత విస్తరించి ఉందని అధికార యంత్రాంగం కూడా ఇటువైపు కన్నెత్తి చూడకపోవడం శోచనీయమని గుర్రపు డెక్క తొలగించడానికి చర్యలు చేపట్టకపోవడం పట్ల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు అని ఆయన అన్నారు.వెంటనే సంబంధిత అధికారులు యుద్ధ ప్రాతిపదికన గుర్రపు డెక్క తొలగించి చర్యలు చేపట్టాలని వారు అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం మేడ్చల్ జిల్లా కార్యదర్శి నిమ్మల నరసింహ, అధ్యక్షులు డి జంగయ్య, ప్రజా కళాకారుడు వెంకటాచారి, సిపిఐ మండల కార్యవర్గ సభ్యులు పి లక్ష్మణ్, సిపిఐ శివానగర్ కార్యదర్శి పి కిరణ్, రైతు సంఘం నాయకులు ఎం బాలయ్య,ఏ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

భార్యను హత్య చేసిన నరరూప రాక్షసునికి ఉరిశిక్ష విధించాలి

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి : నిందితుడు మహేందర్ రెడ్డిని ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ద్వారా కేసును విచారణ జరిపించి అతడికి ఉరి శిక్ష విధించాలని బీసీ సంఘం రాష్ట్ర ఐక్యవేదిక అధ్యక్షుడు భేరి రామచందర్ యాదవ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం వికారాబాద్ జిల్లా వికారాబాద్ మండల పరిధిలోని కామారెడ్డి గూడాలో ఇటీవల స్వాతి యాదవ్‌ను అదే గ్రామానికి చెందిన మహేందర్ రెడ్డి అనే నరరూప రాక్షసుడు ప్రేమ పేరుతో ఆమెకు మాయమాటలు చెప్పి లొంగపరచుకొని రెండు సంవత్సరాల క్రితం ప్రేమ వివాహం చేసుకొని ఈనెల 23వ తేదీన తల, కాళ్ల, చేతులు నరికి అతి గోరంగా హత్య చేసి మూసిలో పడవేసాడు. ఈ విషయమై బిసి ఐక్యవేదిక తరపున, వికారాబాద్ జిల్లా నాయకులతో కలిసి మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం జిల్లా ఎస్పీ నారాయణరెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నరహంతకుడికి ఫాస్ ట్రాక్ కోర్టు ద్వారా విచారణ జరిపి ఉరిశిక్ష పడేంత వరకూ బీసీ ఐక్య వేదిక కుటుంబానికి అండగా ఉంటుందని ఆయన అన్నారు. ఇలాంటి సంఘటనలు తిరిగి పునరావృతం కాకుండా ఉంటుందని ఆయన అన్నారు. వీరితో పాటు బీసీ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్కే సాయన్న ముదిరాజ్, గొర్రెల మేకల పెంపకం దారుల వనపర్తి జిల్లా అధ్యక్షులు మధు యాదవ్, పూడూరు మండల్ మాజీ ఎంపీపీ మల్లేష్, బీసీ సంఘం జిల్లా కన్వీనర్ శంకర్ యాదవ్, దేవనోనిగూడెం మాజీ సర్పంచ్ నారాయణ యాదవ్, సిరిగాయిపల్లి మాజీ సర్పంచ్ వెంకట దాసు, వికారాబాద్ బీసీ సంఘం నియోజకవర్గ కన్వీనర్ శ్రీశైలం యాదవ్, బీసీ సంఘం ధారూర్ మండల కన్వీనర్ సుధాకర్ యాదవ్, బీసీ సంఘం వికారాబాద్ మండల కన్వీనర్ యాదగిరి యాదవ్, సంపత్ యాదవ్ పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా: ఆర్‌సీబీ

బెంగళూరు: ఆర్‌సీబీ విజయోత్సవాల వేళ బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియం వద్ద జరిగిన తొక్కిసలాటలో మృతిచెందిన 11 మంది కుటుంబాలకు రాయల్ చాలెంజర్స్ బెంగళూరు యాజమాన్యం అండగా నిలిచింది. తొక్కిసలాటలో ప్రాణాలు కోల్పోయిన మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.25 లక్షలు ఎక్స్‌గ్రేషియా ప్రకటించింది. 'జూన్ 4, 2025న మా హృదయాలు ముక్కలయ్యాయి. ఆ రోజు ఆర్‌సీబీ కుటుంబంలోని పదకొండు మంది సభ్యులను మేము కోల్పోయాము. వారంతా మాలో భాగమే. మా జట్టును ప్రత్యేకంగా తీర్చిదిద్దడంలో వారిది కీలక పాత్ర. వారు లేని లోటు పూడ్చలేనిది. ప్రతి ఒక్కరిలోనూ వారి జ్ఞాపకాలను చూసుకుంటాము. కానీ మా మొదటి అడుగుగా వారి కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.25 లక్షలు నష్టపరిహారంగా ఇచ్చాము. కేవలం ఆర్థిక సహాయం మాత్రమే కాకుండా భవిష్యత్తులో వారికి అన్ని విధాలుగా మద్దతుగా ఉంటాము. అందు కోసం 'ఆర్‌సీబీ కేర్స్' పని చేస్తుంది' అని ఓ ప్రకటనలో పేర్కొంది.

బీజేపీ మత అజెండా దేశానికి ముప్పు

సీపీఐ కార్యదర్శి నారాయణ

దుబ్రా: బీజేపీ, ఆర్ఎస్ఎస్ అనుసరించే మత అజెండాతో దేశానికి పెద్ద ముప్పు ఏర్పడిందని సీపీఐ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ విమర్శించారు. మతం పేరిట సమాజాన్ని విభజిస్తూ, కార్పొరేట్లకు ఊడిగం చేస్తున్నాయంటూ దుయ్యబట్టారు. మధ్యప్రదేశ్, దుబ్రాలో సీపీఐ రాష్ట్ర మహాసభల సందర్భంగా నారాయణ మాట్లాడుతూ తమ మత అజెండాతో దేశ సామాజిక నిర్మాణాన్ని బీజేపీ, ఆర్ఎస్ఎస్ వ్యూహాత్మకంగా నాశనం చేస్తున్నాయని అన్నారు. ప్రజాస్వామిక వ్యవస్థలను మోదీ ప్రభుత్వం బలహీనపరుస్తోందని, సామాజిక న్యాయాన్ని మంటగలుపుతోందని, రైతులు, వర్కర్ల సమస్యలు, సంక్షేమాన్ని నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. ప్రజా వ్యతిరేక విధానాలు, విభజన సిద్ధాంతాల వల్ల రైతుల్లో, కార్మికుల్లో, దళితుల్లో, మైనారిటీలలో అభద్రతా భావం రోజురోజుకు పెరిగిపోతోందని నారాయణ ఆందోళన వ్యక్తంచేశారు. కార్మికులు, కర్షకలు, ప్రజాస్వామిక శక్తులు ఏకం కావాలన్నారు. వామపక్ష ఐక్యతకు నారాయణ పిలుపునిచ్చారు. ప్రజలను విభజించే విధానాలను, కార్పొరేట్ల దోపిడీని ప్రతిఘటించాలని, ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. తొలుత అరుణ పతాకాన్ని సీనియర్ నాయకులు ఎగురవేశారు. అనంతరం నిర్వహించిన సెషన్లలో రైతులు, కార్మికులు, విద్య, ఆరోగ్యం, ఉపాధి సంబంధిత తీర్మానాలను ఆమోదించారు.

ఏడేళ్ల తర్వాత చైనాకు మోదీ

ఎర్ర తివాచీ పరిచి స్వాగతం పలికిన జిన్‌పింగ్ ప్రభుత్వం

తియాంజిన్: భారత ప్రధాని నరేంద్ర మోదీ చైనాలో ఏడేళ్ల తర్వాత అడుగుపెట్టారు. షాంఘై సహకార సంస్థ శిఖరాగ్ర సదస్సు (ఎస్‌సీఓ)లో పాల్గొనేందుకు తియాంజిన్‌కు చేరుకున్నారు. విమానాశ్రయంలో ఎర్ర తివాచీ పరిచి ఆయనను ఆత్మీయంగా స్వాగతించింది. ఆటపాటలతో ఆహ్వానం పలికింది. చైనా ఉన్నత స్థాయి అధికా రులకు విమానాశ్రయంలో మోదీకి స్వాగతం పలికారు. ఈ పర్యటనలో భాగంగా చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో ద్వైపాక్షిక సమావేశాన్ని మోదీ నిర్వహిస్తారు. భారత్-చైనా ఆర్థిక సంబంధాలపై ఇద్దరు అధినేతలు చర్చిస్తారు. మరిన్ని కీలక అంశాల్లోనూ సంప్రదింపులు జరుపుతారు. గత ఘర్షణలు, సరిహద్దు వివాదాల నేపథ్యంలో భారత్, చైనా సంబంధాలు మరింత మెరుగయ్యే దిశగా ఈ భేటీలో జిపింగ్, మోదీ తమ అభిప్రాయాలు పంచుకుంటారని తెలిసింది. అయితే అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారీ సుంకాలతో విరుచుకుపడుతున్న క్రమంలో ఆదివారం జరగబోయే మోదీ-జిన్‌పింగ్ భేటీకి అత్యంత ప్రాధాన్యత ఏర్పడింది. ప్రపంచ ఆర్థిక సుస్థిరత కోసం చైనా, భారత్ కలిసి పనిచేయడం ముఖ్యమని తన పర్యటనకు ముందు మోదీ వెల్లడించారు. ప్రాదేశిక, అంతర్జాతీయ శాంతి, సుస్థిరపై సానుకూల ప్రభావం ఉండాలంటే భారత్, చైనా మధ్య ద్వైపాక్షిక బంధం బలంగా ఉండాలన్నారు. 2020లో లద్దాఖ్ సరిహద్దుల్లో భారత్-చైనా సైనికుల మధ్య ఘర్షణల అనంతరం మోదీ ఆ దేశాన్ని సందర్శిస్తుండటం ఇదే మొదటిసారి. చివరిగా 2018లో ఎస్‌సీఓ సదస్సు కోసం చైనాలో పర్యటించారు. జపాన్ పర్యటన అనంతరం మోదీ చైనా చేరుకున్నారు. ఆది-సోమవారాలు ఆ దేశంలో పర్యటిస్తారు. తియాంజిన్ వేదికగా నిర్వహించనున్న ఎస్‌సీఓ సదస్సులో పాల్గొంటారు. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ సహా ఎస్‌సీఓ సభ్యదేశాల అధినేతలతో భేటీ అవుతారు. భారత ప్రజలకు ప్రయోజనం చేకూర్చేలా జపాన్ పర్యటన సాగిందని మోదీ 'ఎక్స్'లో పేర్కొన్నారు. చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీ ఇటీవల భారత్‌లో పర్యటించడం విదితమే. జిన్‌పింగ్ 2019 అక్టోబరులో భారత్ వచ్చారు.

పోలవరం-బనకచర్లతో కరువు దూరం

సీఎం చంద్రబాబు



విశాలాంధ్ర-చిత్తూరు: పోలవరం-బనకచర్ల ప్రాజెక్టు ద్వారా వంశధార-పెన్నా నదుల అనుసంధానం చేయవచ్చని, ఇదే జరిగితే రాయలసీమకే కాదు... రెండు తెలుగు రాష్ట్రాలకు శాశ్వతంగా కరువు అనేది ఉండదని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. తెలంగాణా ప్రజలు, నేతలు కూడా నదుల అనుసంధానం వల్ల కలిగే ప్రయోజనాలను అర్థం చేసుకోవాలని కోరారు. శనివారం చిత్తూరు జిల్లా కుప్పంలో పర్యటించిన సీఎం తన నివాసం నుంచి కుప్పం బ్రాంచ్ కెనాల్ వద్దకు ఆర్టీసీ బస్సులో మహిళలు, రైతులతో కలిసి చేరుకుని కృష్ణమ్మకు జలహారతి ఇచ్చారు. ఈ సందర్భంగా పరమసముద్రం చెరువు సమీపంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ 'రాయలసీమ అభివృద్ధికి బ్లూ ప్రింట్ సిద్ధం చేసుకున్నాం. అన్ని రంగాల్లోనూ సీమను అభివృద్ధి చేసేలా మా దగ్గర ప్రణాళికలున్నాయి. దీనిలో భాగంగానే రాయలసీమకు హంద్రీ-నీవా కాల్వల విస్తరణ ద్వారా కుప్పం చిట్ట చివరి భూములకు నీటిని అందించాం. రాయలసీమకు నీళ్లు వస్తే వైసీపీకి జీర్ణం కాదు. వైసీపీకి నాటకాలు ఆడడం అలవాటు... ఎన్డీఏకు నీళ్లు తేవడం అలవాటు' అని చెప్పారు. హంద్రీ-నీవా కాల్వల విస్తరణ ద్వారా కృష్ణా జలాలు కుప్పం చివరి భూములకు చేరాయని, కుప్పం ప్రజల చిరకాల కోరిక నెరవేరిందన్నారు. 'నా కుప్పం నియోజకవర్గానికి కృష్ణా జలాలు తీసుకురావడంతో నా సంకల్పం నెరవేరింది. కృష్ణా పుష్కరాలు 2028లో వస్తుంటే కుప్పానికి మాత్రం రెండేళ్లు ముందే వచ్చాయి. కుప్పం ప్రజలు నన్ను ఇంటి బిడ్డగా ఆదరించారు. వారికి నేను ఏం చేసినా తక్కువే' అని చంద్రబాబు అన్నారు. ఎన్టీఆర్ కృష్ణా మిగులు జలాలు సీమకు తీసుకువచ్చి సస్యశ్యామలం చేయాలని కలలు కన్నారని తెలిపారు. సీమలో పశువులను బతికించుకోవడానికి రైళ్లలో నీళ్లను తెప్పించిన పరిస్థితి నాడు ఉండేదని, వేరుశనగ పంట వేస్తే కనీసం విత్తనాల ఖర్చు కూడా వచ్చేది కాదని అన్నారు. సీమలో ఇలాంటి పరిస్థితిని మార్చాలనే సంకల్పంతో 1999లో హంద్రీ-నీవాను తానే ప్రారంభించానని, 2025 నాటికి పరమసముద్రానికి కృష్ణా జలాలు తెచ్చామని చంద్రబాబు చెప్పారు. 2014-19 మధ్య సీమలో ఇరిగేషన్ ప్రాజెక్టులపై రూ.12,441 కోట్లు ఖర్చు పెట్టామని, వైసీపీ కేవలం రూ.2 వేల కోట్లు మాత్రమే ఖర్చు పెట్టిందని, ఎన్నికల ముందు గేట్లతో సెట్టింగులు వేసి డ్రామాలాడారని అన్నారు. ప్రతి చెరువుకు నీరిచ్చే బాధ్యత తనదని సీఎం హామీ ఇచ్చారు. టీడీపీకి నీటి విలువ తెలుసునని, 100 రోజుల కార్యాచరణ లక్ష్యంతో రూ.3,850 కోట్లు మంజూరు చేశామని చెప్పారు. కాల్వలు వెడల్పు చేశామని, నాలుగు నెలల్లో 40 టీఎంసీల నీటిని తీసుకువచ్చి 10 రిజర్వాయర్లను నింపామని, చెరువులను నింపుతున్నామన్నారు. సీమ జిల్లాల్లో 6 లక్షల ఎకరాలకు సాగునీరు, 33 లక్షల మందికి తాగునీరు అందుతుందని, పరిశ్రమలకు కూడా నీరు లభిస్తుందని తెలిపారు. వచ్చే ఏడాదికి చిత్తూరు చివరి భూములకు కూడా నీరందిస్తామన్నారు. రాష్ట్రాభివృద్ధికి యజ్ఞం చేస్తుంటే... కొందరు రాక్షసుల్లా అడుగడుగునా అడ్డుపడుతున్నారని విమర్శించారు. ప్రతిపక్షం అని చెప్పుకుంటున్న వైసీపీ విషవృక్షంలా తయారయ్యిందన్నారు. పార్టీ ఆవిర్భావం నుంచి కుప్పంలో తెలుగుదేశాన్నే గెలిపిస్తున్నారని, ప్రశాంతంగా ఉన్న కుప్పంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించాలని ప్రయత్నించారని అన్నారు. పులివెందుల, ఒంటిమిట్ట ఎన్నికల్లో రప్పా రప్పా రాజకీయం ఎలా ఉంటుందో... ప్రజలే వారికి చూపించారని తెలిపారు. ఎన్ని అడ్డంకులు కల్పించినా అభివృద్ధి చేస్తున్నామని, సంక్షేమమూ చేపడుతున్నామని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఉచిత బస్సు ప్రయాణంతో ఆడబిడ్డలంతా సంతోషంగా ఉన్నారని అన్నారు. స్త్రీ శక్తితో ఆటో డ్రైవర్లు ఇబ్బంది పడకుండా చూస్తామని, వారిని కూడా ఆదుకుంటామని తెలిపారు. ఆటో డ్రైవర్లకు మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలు చేస్తామన్నారు. మెగా డీఎస్సీ ద్వారా టీచర్ల నియామకాలు చేపడుతున్నామని, ఇప్పుడు కుప్పం యువతీయువకులే టీచర్లయ్యారని అన్నారు. కుప్పానికి 12 పరిశ్రమలు వచ్చాయని, రూ.3,908 కోట్లు పెట్టుబడులు, 15,600 మందికి ప్రత్యక్ష ఉద్యోగాలు, 26,581 మందికి పరోక్ష ఉపాధి లభిస్తుందన్నారు. ఐ-ఫోన్ ఛాసిస్ ఉత్పత్తి చేసేలా హిందాల్కో సంస్థ యూనిట్టును ప్రారంభించబోతోందని సీఎం తెలిపారు. కుప్పాన్ని ఇతర రాష్ట్రాలకు అనుసంధానం చేస్తూ పెద్ద ఎత్తున రహదారుల నిర్మాణం జరుగుతోందని, ప్రపంచంలోని టెక్నాలజీనంతా కుప్పానికి తెస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, చిత్తూరు జిల్లా ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

జపాన్ ప్రధాని దంపతులకు మోదీ ప్రత్యేక కానుకలు

న్యూఢిల్లీ: రెండు రోజుల పర్యటనలో భాగంగా జపాన్‌కు వెళ్లిన భారత ప్రధాని నరేంద్ర మోదీ ఆ దేశ ప్రధాని షిగేరు ఇషిబాతోకు, ఆయన సతీమణికి ప్రత్యేక కానుకలు ఇచ్చారు. ఆంధ్రప్రదేశ్‌లో దొరికే అరుదైన చంద్రకాంత రాయితో చేసిన రామెన్ బౌల్స్‌ను, వెండి చాప్‌స్టిక్స్‌ను ఇషిబాతోకు బహూకరించిన మోదీ... జమ్మూకశ్మీర్ హస్తకళల విశిష్టతను చాటే పశ్మీనా శాలువను జపాన్ ప్రధాని సతీమణికి బహుమతిగా అందజేశారు. కాగితపు గుజ్జు, జిగురు, ఇతర సహజ సామగ్రి కలిపి చేతితో కళాత్మకంగా తయారుచేసిన అందమైన పెట్టెలో ఈ శాలువాను అందించారు. రామెన్ బౌల్స్ తయారీకి ఉపయోగించిన చంద్రకాంత రాయి ప్రేమ, సమతుల్యత, రక్షణను సూచిస్తుంది. రామెన్ బౌల్ అడుగు భాగాన్ని రాజస్థాన్‌లోని పార్చిన్ కారి శైలిలో... అరుదైన రాళ్లతో పొదిగిన మక్రానా పాలరాయితో తయారు చేసినట్లు తెలుస్తోంది. శనివారం జపాన్ నుంచి చైనాకు బయల్దేరే ముందు మోదీ ఈ బహుమతులు అందించారు. శనివారంతో జపాన్‌లో తన రెండు రోజుల పర్యటనను ముగించుకున్న మోదీ అక్కడినుంచి చైనా వెళ్లారు. ఆదివారం తియాజింగ్ వేదికగా జరగనున్న షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీవో) శిఖరాగ్ర సదస్సులో ఆయన పాల్గొంటారు. భారత ప్రజలకు ప్రయోజనం చేకూర్చేలా తన జపాన్ పర్యటనలో అద్భుతమైన ఫలితాలు సాధించానని మోదీ ఎక్స్ ద్వారా పేర్కొన్నారు. ఈ పర్యటనను తాను ఎప్పటికీ మరచిపోలేనన్నారు. జపాన్ ప్రధానితో సహా అక్కడి ప్రజలు తనపై ఎంతో ఆప్యాయత చూపించారన్నారు.

పండుగల వేళ 150 ప్రత్యేక రైళ్లు

న్యూఢిల్లీ: రాబోయే వరుస పండుగల సీజన్‌కు ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని భారతీయ రైల్వే 150 ప్రత్యేక రైళ్లను నడుపనుంది. దేశవ్యాప్తంగా ప్రధాన మార్గాల్లో 2,024 ట్రిప్పులు ఈ రైళ్లు ప్రయాణించనున్నాయి. సెప్టెంబర్ 21 నుంచి నవంబర్ 30 వరకూ ఈ ప్రత్యేక రైళ్లను నడుపుతారు. దక్షిణ మధ్య రైల్వే అత్యధికంగా 48 రైళ్లను నడుపనుంది. 684 ట్రిప్పులు పూర్తి చేస్తుంది. ఈ నిర్ణయంతో ముఖ్యంగా హైదరాబాద్, సికింద్రాబాద్, విజయవాడ నుంచి ప్రయాణికులకు ఎంతో ఉపశమనం కలుగుతుంది.

ఏటా పండుగ సీజన్‌లో బీహార్‌కు పెద్దఎత్తున ప్రయాణికులు తరలివెళుతుండటాన్ని దృష్టిలో ఉంచుకుని ఈస్ట్ సెంట్రల్ రైల్వే 588 ట్రిప్పులతో 14 రైళ్లను నడుపనుంది. పట్నా, గయ, దర్బంగా, ముజఫర్‌పూర్ వంటి ప్రధాన నగరాలను కలుపుతూ ఈ రైళ్లు ప్రయాణిస్తాయి. దక్షిణ మధ్య రైల్వే 48 రైళ్లను హైద్రాబాద్, సికింద్రాబాద్, విజయవాడ రూట్లలో నడుపుతుంది. తూర్పు మధ్య రైల్వే 14 రైళ్లను పట్నా, గయ, దర్బంగా, ముజఫర్‌పూర్ రూట్లలో, ఈస్టర్న్ రైల్వే 24 రైళ్లను కోల్‌కతా, సీల్డా, హౌరా మార్గాల్లో, వెస్టర్న్ రైల్వే 24 రైళ్లను ముంబై, సూరత్, వడోదర రూట్లలో, సదరన్ రైల్వే 10 రైళ్లను చెన్నై, కోయంబత్తూరు, మదురై రూట్లలో నడుపుతుంది. అదనంగా ప్రత్యేక సర్వీసులు భువనేశ్వర్, పూరి, సంబల్‌పూర్, రాంచీ, టాటానగర్, ప్రయాగరాజ్, కాన్పూర్, బిలాస్‌పూర్, రాయపూర్, భోపాల్, కోటకు నడుపుతారు. వెస్టర్న్ రైల్వే సూరత్ సహా పలు గమ్యస్థానాలకు 24 రైళ్లను నడపనుండటంతో గుజరాత్‌కు వెళ్లే ప్రయాణికులకు కూడా సౌకర్యంగా ఉంటుంది. ఈస్టర్న్ రైల్వే కోల్‌కతా, సీల్డా, హౌరా మధ్య 24 రైళ్లను 198 ట్రిప్పులు నడుపనుంది. ఇది కేవలం మొదటి విడత ప్రకటన మాత్రమేనని ఇండియన్ రైల్వేస్ వివరణ ఇచ్చింది. గతంలో పండుగ సీజన్లలో డిమాండ్‌కు అనుగుణంగా 12 వేలకు పైగా ప్రత్యేక రైళ్లు నడిపారు. రాబోయే వారాల్లో మరిన్ని రైళ్లు నడిపే అవకాశాలున్నాయని అధికారులు తెలిపారు. ముఖ్యంగా ఈస్ట్ సెంట్రల్ రూట్లలో ప్రయాణికుల రద్దీని భారీగా అంచనా వేస్తున్నారు. రాబోయే దీపావళి, ఛాత్ పూజ, దుర్గాపూజ పండుగలను ప్రధానంగా దృష్టిలో ఉంచుకుని భారతీయ రైల్వే తగిన ఏర్పాట్లు చేస్తోంది.

ప్రజలకు మేలు చేస్తున్నాం

- సగటు మనిషి ఆవేదన నుంచి పుట్టిందే జనసేన
- దసరా తర్వాత త్రిశూల్ ద్వారా క్రియాశీలక నాయకత్వం
- విశాఖ సభలో ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: సగటు మనిషి ఆవేదన నుంచి పుట్టిందే జనసేన అని ఆ పార్టీ అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. శనివారం రాత్రి విశాఖలో దక్షిణ నియోజకవర్గం ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో అల్లూరి సీతారామరాజు ప్రాంగణంలో నిర్వహించిన 'సేనతో సేనాని' సభలో ఆయన మాట్లాడారు. ఈ 11 ఏళ్ల ప్రయాణంలో కుటుంబం, సినిమాల కంటే జనసేన పార్టీ పైనే ఎక్కువ దృష్టిపెట్టానన్నారు. అందుకే వంద శాతం స్ట్రైక్ రేట్‌తో దేశంలోనే చరిత్ర సృష్టించామన్నారు. ఎన్ని కష్టాలు వచ్చినా తట్టుకుని నిలబడినందునే ప్రజలకు మేలు చేస్తున్నామని తెలిపారు. వీరమహిళల సేవలను ఎప్పటికీ మరచిపోలేమన్నారు. ఏ సిద్ధాంతాలు, నిబద్ధతతో వచ్చామో ఇప్పటికే అలాగే ఉన్నామని చెప్పారు. కులం, కుటుంబం, రాష్ట్రం, ప్రాంతం కోసం పెట్టిన పార్టీ జనసేన కాదన్నారు. ఉద్దానం కిడ్నీ బాధితుల సమస్యల పరిష్కారం కోసం, ఏజెన్సీలో డోలీ మోతలు చూసి తన హృదయం ద్రవించిందన్నారు. ప్రజల కష్టాలు పరిష్కరించినప్పుడు తన నిర్ణయం సరైందే అనిపించిందని చెప్పారు. పదేళ్ల పార్టీ నడిపానని, చిన్న చిన్న సమస్యలు వచ్చాయని, ఒక్క ఓటమి రాగానే అనేకమంది పారిపోయారన్నారు. ఐడియాలజీ ఉన్నవారే ఇప్పటికీ తనతో నడుస్తున్నారని తెలిపారు. ఏ భావన, ఆలోచన లేకుండానే పార్టీలు పెట్టేస్తామా? అని తనపై విమర్శలు చేస్తున్న వారికి పరోక్షంగా పవన్ సమాధానం ఇచ్చారు. నిస్వార్థంగా పని చేస్తున్నామని, మంచి ఫలితాలే వస్తున్నాయని అన్నారు. '2019-24 మధ్య మనల్ని అనేక రకాల బాధలు పెట్టారు. అయినా ప్రధాని, హోం మంత్రిని సాయం అడగలేదని, ఆనాడు కేంద్ర పెద్దల సాయం అడిగే కంటే పార్టీ మూసుకోవడం మంచిదనుకున్నాను' అని అన్నారు. ఇకపై పార్టీ సంస్థాగతంగా నిర్మాణం జరగాలని, మండల స్థాయి నాయకుడితో తానే స్వయంగా మాట్లాడుతానని పవన్ తెలియజేశారు. రాజకీయ వ్యూహంతోనే కూటమి ద్వారా అధికార భాగస్వామ్యం అయ్యామన్నారు. ప్రపంచమే మారుతుందని, తాను మారితే తప్పు అని పరోక్షంగా కమ్యూనిస్టు పార్టీలను ఉద్దేశించి అన్నారు. ఏడీ సిద్ధాంతాలతోనే ప్రజాస్వామ్యాన్ని రక్షిస్తామని, దసరా నుంచి త్రిశూల్ పేరుతో క్యాడర్‌ను క్రియాశీల రాజకీయ నాయకులుగా తయారు చేస్తానని భరోసా ఇచ్చారు. రాజకీయాలు వ్యాపారం కోసం కాదని, రాజకీయాలు సమాజ మార్పు కోసం, సేవ కోసం ఉండాలని జనసైనికులకు తెలియజేశారు. మహిళలు పేరంటాలకూ వెళ్లాలని, పోరాటాలూ చేయాలన్నారు. సినిమా నటుల లోపల కూడా రగిలే అగ్నిగుండాలు ఉంటాయని అన్నారు. కమ్యూనిస్టు, సోషలిస్టు అనే చైనా, రష్యా రాజకీయాల్లో అనేక మార్పులు వచ్చాయని తెలిపారు. మనుషులు, సిద్ధాంతాలకు కాలగమ నంలో మార్పులు తథ్యమని అన్నారు. తాను విప్లవ పంథాలోకి వెళ్లలేదని, తుపాకులు పట్టుకోలేదని, ప్రజాస్వామ్య సమాజాల్లో హింసావాదంతో ఏమీ సాధించలేమని చెప్పారు. హామీలన్నీ అమలు చేస్తున్నామని, విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ ఆగిపోయిందని, విశాఖ కేంద్రంగా రైల్వే జోన్ పనులు ప్రారంభమవుతాయని అన్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పనులు పూర్తి చేస్తామని పవన్ కల్యాణ్ తెలిపారు. ప్రజల కష్టాలు అవసరాలు తీర్చేందుకే కూటమి ప్రభుత్వం ఉందని అన్నారు. జనసేన మంత్రులు నాదెండ్ల మనోహర్, కందుల దుర్గేశ్, ఎమ్మెల్సీ నాగబాబు, ఎమ్మెల్యేలు, నేతలు, జనసైనికులు పాల్గొన్నారు.

పత్తి సుంకం రద్దు వెనక్కి

ఏఐకేఎస్ డిమాండ్

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: పత్తి దిగుమతిపై 11 శాతం సుంకాన్ని తొలగించడానికి అనుమతిస్తూ జారీ చేసిన నోటిఫికేషన్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సెప్టెంబరు ఒకటో తేదీ నుంచి మూడో తేదీ వరకు గ్రామాల్లో పత్తిని తగలబెట్టాలని ఆల్ ఇండియా కిసాన్ సభ (ఏఐకేఎస్) పిలుపునిచ్చిందని, ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆ సభ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు క్రిష్ణయ్య, ప్రభాకరరెడ్డి శనివారం ఓ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. దీనిలో భాగంగా పత్తి పండించే ప్రాంతాలలో ఉన్న ఎంపీ కార్యాలయాలకు మార్చ్ నిర్వహించాలని సూచించిందన్నారు. ఆయా నిరసన కార్యక్రమాల్లో పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొనాలని వారు కోరారు.

ఆందోళనకారులను వేధిస్తారా?

- తాగునీరు... పారిశుధ్య సౌకర్యాలేవి?
- ప్రభుత్వంపై మరాఠా నేత జరాంగే ధ్వజం



ముంబై: ముంబైలోని ఆజాద్ మైదాన్‌లో మనోజ్ జరాంగే నేతృత్వంలోని మరాఠా కోటా ఆందోళనకు గుమిగూడిన నిరసనకారులకు ప్రాథమిక సౌకర్యాలు లేవని, వేదిక వద్ద నీరు, ఆహారం అందుబాటులో లేవని మరాఠా నేత జరాంగే ఆరోపించారు. ప్రభుత్వం ఆందోళనకారులను వేధిస్తోందని మండిపడ్డారు. అయితే పారిశుధ్యం, ఇతర సౌకర్యాలకు తగిన ఏర్పాట్లు చేసినట్లు పౌర సంస్థ తెలిపింది. మరాఠా సమాజానికి కోటా కోరుతూ జరాంగే చేపట్టిన నిరవధిక నిరాహార దీక్ష శనివారం రెండవ రోజుకు చేరుకుంది. ఇతర వెనుకబడిన తరగతుల (ఓబీసీ) కేటగిరీ కింద మరాఠాలకు 10 శాతం రిజర్వేషన్లు కల్పించాలని ఆయన డిమాండ్ చేస్తున్నారు. శుక్రవారం ఉదయం నుంచి ముంబైలో ఎడతెరిపి లేని వర్షం కురుస్తోంది. దీని కారణంగా నిరసనకారులు, ముఖ్యంగా రైలు, ఇతర ప్రజా రవాణా మార్గాల ద్వారా నగరానికి వచ్చిన వారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాత్రిపూట కురిసిన వర్షాల కారణంగా విశాలమైన నిరసన వేదిక వద్ద గుంతలు ఏర్పడటంతో ఛత్రపతి శివాజీ మహారాజ్ టెర్మినస్ (సీఎస్ఎంటీ) వెలుపల ఉన్న జంక్షన్ వద్ద ఆందోళనకారులు నిరసన చేయడంతో ట్రాఫిక్ నిలిచిపోయింది. ఆహార కొరత ఉందని, ప్రభుత్వం నిరసన స్థలం చుట్టూ ఉన్న దుకాణాలను మూసివేసిందని ఆరోపిస్తూ వారిలో చాలామంది ఫిర్యాదు చేశారు. కాగా నిరసన స్థలానికి దగ్గరగా సీఎస్ఎంటీ, చుట్టుపక్కల పెద్ద సంఖ్యలో నిరసనకారులు మకాం వేస్తున్నారు. వారిలో చాలామంది రోడ్డు పక్కన ఆహారం వండుకుంటున్న దృశ్యాలు కనిపిస్తున్నాయి. మరోవైపు, ఆజాద్ మైదాన్‌లో రెండు ట్రక్కుల కంకరను వేసి, అవసరమైన పౌర సౌకర్యాలను కల్పించినట్లు బృహన్ ముంబై మున్సిపల్ కార్పొరేషన్ (బీఎంసీ) శనివారం మధ్యాహ్నం పేర్కొంది. నిరసన స్థలం, దాని పరిసర ప్రాంతాలలో పారిశుధ్య కార్మికులు క్రమం తప్పకుండా శుభ్రపరిచే పనులు చేపడుతున్నారని తెలిపింది. ఆరోగ్య సేవలను అందించడానికి వైద్య సహాయ కేంద్రం ఏర్పాటు చేయడంతో పాటు ఈ ప్రాంతంలో నాలుగు వైద్య బృందాలు, రెండు అంబులెన్స్‌లు 24/7 పని చేస్తున్నాయని వివరించింది. నిరసనకారులకు తాగునీరు అందించడానికి 11 ట్యాంకర్లు అందుబాటులో ఉంచామని తెలిపింది. ఇదిలాఉండగా, శనివారం ఉదయం జరంగే తన మీడియా సమావేశంలో ముఖ్యమంత్రి ప్రభావంతో బీఎంసీ కమిషనర్, రాష్ట్ర నియమిత నిర్వాహకుడు భూషణ్ గగ్రాని నిరసనకారులకు ఆహారం, తాగునీటిని నిలిపివేశారని ఆరోపించారు. 'మేము దీనిని మర్చిపోము. మీరు పబ్లిక్ టాయిలెట్లు, హోటళ్లను మూసివేశారు. పేద మరాఠాలను మీరు ఎన్ని రోజులు వేధిస్తారో చూద్దాం' అని ఆయన అన్నారు.

జరాంగేతో చర్చలు: మంత్రి విఖే పాటిల్

ఆజాద్ మైదానంలో నిరవధిక నిరాహార దీక్ష చేస్తున్న మనోజ్ జరాంగేతో చర్చలు జరపడానికి ప్రభుత్వ ప్రతినిధి బృందాన్ని పంపినట్లు మహారాష్ట్ర మంత్రి రాధాకృష్ణ విఖే పాటిల్ శనివారం తెలిపారు. కేబినెట్ సబ్-కమిటీ సమావేశం తర్వాత రాష్ట్ర జలవనరుల మంత్రి మాట్లాడులంతూ జరాంగే లేవనెత్తిన అంశాలను వివరంగా చర్చించామని, వాటిని సానుకూలంగా పరిష్కరించడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. జస్టిస్ సందీప్ షిండే (రిటైర్డ్) నేతృత్వంలోని ప్రతినిధి బృందం జరాంగేతో చర్చలు జరుపుతుందని విఖే పాటిల్ చెప్పారు. 'ఆందోళనకారులకు నీరు, పారిశుద్ధ్య సౌకర్యాలు లేకపోవడంపై వచ్చిన ఫిర్యాదులపై ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్‌తో చర్చించాము. సమస్య పరిష్కారమవుతుంది' అని ఆయన తెలిపారు.

పెరిగిన కొత్త ఓటర్ల దరఖాస్తులు

కేవలం రెండు రోజుల్లోనే 96 శాతం నమోదు

ఎస్ఐఆర్‌పై అభ్యంతరాలకు రేపటి వరకే గడువు

పట్నా: బీహార్‌లో ఎస్ఐఆర్ వేళ కేవలం రెండు రోజుల్లోనే కొత్త ఓటర్ల దరఖాస్తులు 96.6 శాతం మేర పెరిగాయి. కొత్త ఓటర్లు 8,51,788 మంది ఫారం-6 సమర్పించారని ఎన్నికల సంఘం(ఈసీ) తెలిపింది. ఈనెల 26 నుంచి 28వ తేదీ వరకు 4.18 లక్షలకు పైగా ఫారాలు అందాయి. అంటే 48 గంటల్లోనే కొత్త ఓటర్ల సంఖ్య 96.6 శాతం పెరిగింది. ఎస్ఐఆర్ ప్రక్రియపై అభ్యంతరాలు వ్యక్తం చేసేందుకు సెప్టెంబరు 1వ తేదీతో గడువు ముగియనుండడంతో కొత్త ఓటర్ల దరఖాస్తుల సంఖ్య అమాంతం పెరిగింది. ఎస్ఐఆర్‌పై ఓటర్ల నుంచి 21వ తేదీ వరకు ఎలాంటి అభ్యంతరాలు రాలేదు కానీ 22న పరిస్థితి ఒక్కసారిగా మారింది. 84,305 క్లెయిమ్‌లు ఎన్నికల సంఘానికి అందాయి. 23వ తేదీకి 99,656, 24కి 1,21,143, 25వ తేదీకి 1,40,931, 26వ తేదీకి 1,62,453, 27వ తేదీకి 1,78,948, 28వ తేదీకి 1,95,802 చొప్పున సంఖ్య పెరిగింది. ఎస్ఐఆర్ ప్రక్రియలో కొత్త ఓటర్లు చేరిక రోజులవారీగా పరిశీలిస్తే ఈనెల 22 నాటికి 2,63,257 ఫారం-6లు ఎన్నికల సంఘానికి అందుకుంది. 23వ తేదీకి 2,83,042కి పెరిగింది. 24కి 3,28,847, 25వ తేదీకి 3,79,692, 26వ తేదీకి 4,33,214కి చేరుకుంది. 27, 28 తేదీల్లో సంఖ్య రెండింతలు పెరిగింది. 27వ తేదీ 6,35,124, 28వ తేదీ 8,51,788కి చేరింది. ఈ ఫారాలు 18 ఏళ్లు లేదా అంతకంటే ఎక్కువ వయసుగల వ్యక్తుల నుంచే వచ్చాయి. బూత్ స్థాయి ఏజెంట్ల ద్వారా స్వీకరించిన ఫారాలు తక్కువగానే ఉన్నాయి. మొత్తం 8,51,788 ఫారాలలో 28వ తేదీ నాటికి 37,050 మాత్రమే ప్రాసెస్ అయ్యాయి. అయితే, రాజకీయ పార్టీల క్లెయిమ్‌లు చాలా తక్కువగా నమోదయ్యాయి. 1.6 లక్షల బూత్ స్థాయి ఏజెంట్స్ ఉన్నప్పటికీ ఈనెల 21వ తేదీకి పార్టీల నుంచి క్లెయిమ్‌లు లేవు. 28వ తేదీకి 82 క్లెయిమ్‌లు దాఖలయ్యాయి. వీటిలో 79 సీపీఐ (ఎంఎల్) లిబరేషన్, మూడు ఆర్‌జేడీ నుంచి వచ్చాయి.

బీఫ్‌పై బ్యాంక్ మేనేజర్ ఆంక్షలు... ఉద్యోగుల నిరసన

తిరువనంతపురం: గొడ్డు మాంసం తినొద్దన్న కెనరా బ్యాంక్ రీజినల్ మేనేజర్ ఆదేశాలకు వ్యతిరేకంగా ఆ బ్యాంక్ ఉద్యోగులు నిరసన తెలిపిన ఘటన కేరళలోని కొచ్చిలో చోటుచేసుకుంది. బీహార్ నుంచి కేరళకు బదిలీ అయిన రీజినల్ మేనేజర్ ఉద్యోగుల పట్ల అనుచితంగా ప్రవర్తిస్తున్నాడని ఆరోపణలు వచ్చాయి. బ్యాంకు క్యాంటీన్‌లో గొడ్డు మాంసం వడ్డించరాదని ఆయన ఆదేశాలు జారీ చేశారు. మేనేజర్ ఇచ్చిన ఆదేశాల పట్ల ఉద్యోగులు వినూత్నంగా నిరసన తెలిపారు. బ్యాంక్ కార్యాలయం బయట గొడ్డు మాంసం, పరోటాలతో విందు ఏర్పాటు చేసి తమ నిరసన వ్యక్తం చేశారు. బ్యాంక్ ఉద్యోగుల సమాఖ్య అధ్వర్యంలో ఈ నిరసన జరగగా... ప్రతి పౌరుడికి రాజ్యాంగం ప్రకారం నచ్చిన ఆహారం తినే హక్కు ఉందని, ఈ హక్కును ఎవరూ ఉల్లంఘించలేరని ఉద్యోగులు తెలిపారు. బ్యాంక్ ఉద్యోగుల నిరసనకు రాజకీయ నాయకులతో పాటు వివిధ సంఘాలు మద్దతు తెలిపాయి.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No.148108 (TEL TEL/2017/75553), Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.